
సూరారెడ్డిపాలెంలో పారిశుధ్య పనులను పరిశీలించి ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా



ఎట్టకేలకు కదిలారు!

డీసీసీబీపై సెక్షన్ 51 విచారణ

- కలెక్టర్ పర్యవేక్షణలోనే చేయాలి
- సహకారశాఖ ఉన్నతాధికారుల ఆదేశం

వైసీపీ హయాంలో అక్రమాలు

వైసీపీ పాలనలో ఎన్నికలు లేకుండా పర్సన్ ఇన్‌చార్జి కమిటీలతో ఐదేళ్ల కాలం వెల్లబుచ్చింది. అప్పుడు కమిటీగా ఉన్న అధికార వైసీపీ నాయకులు, అధికారులు కలిసి బ్యాంకులో భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారన్న ఫిర్యాదులను జిల్లాకు చెందిన టీడీపీ ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈనేపథ్యంలో తొలుత విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. అనంతర పరిణామాలతో సహకార శాఖ ఉన్నతాధికారుల ఉదాసీన వైఖరిపై 'ఆంధ్రజ్యోతి' కథనాలతో విషయం సీఎం దృష్టికి వెళ్లింది. ఈ నేపథ్యంలో కలెక్టర్‌కు ఉన్నతాధికారులు చేసిన సూచనలతో త్రిసభ్య కమిటీతో విచారణ చేయించారు. అందులో పలు అంశాలు వాస్తవమని తేలింది. ఆ మేరకు పక్షం క్రితం విచారణ కమిటీ నివేదికను ప్రభుత్వానికి కలెక్టర్ పంపించారు.

ఒంగోలు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో ఐదేళ్ల వైసీపీ పాలనలో భారీగా అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారణకు వచ్చింది. ఇందుకు సంబంధించి కలెక్టర్ అన్సారియా పంపిన నివేదిక ఆధారంగా సమగ్ర విచారణ చేపట్టాలని నిర్ణయించింది. సెక్షన్ 51 విచారణకు ఆదేశించింది. ఈ విషయంలో సహకారశాఖ ఉన్నతాధికారుల ఉదాసీనతపై ఈనెల 18న ఆంధ్రజ్యోతిలో 'మీనమేషాలు' శీర్షికన ప్రచురించిన కథనంతో ఉన్నత స్థాయిలో కదలిక వచ్చింది. సమగ్ర విచారణ చేపట్టాలంటూ సహకార శాఖ ఉన్నతాధికారులు కలెక్టర్ అన్సారియాకు లేఖ పంపారు. స్థానికంగా కలెక్టర్ పర్యవేక్షణలో ఒక అధికారిని నియమించి సెక్షన్ 51 విచారణ చేయించడం లేదా అవసరం అనుకుంటే రాష్ట్ర సహకార శాఖ నుంచి ఉన్నతాధికారిని నియమించడంపై నిర్ణయం తీసుకునే వెసులుబాటును కలెక్టర్‌కు కల్పించారు.

అయినా అనుమానాలే..

విచారణ కమిటీ నివేదికపై ఉన్నత స్థాయిలో స్పందన లేకపోవడంతో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు దీంతో ఉన్నతాధికారులలో కదలిక

మిగతా 6వ పేజీలో


ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, అధికారులు

క్లీన్ అండ్ గ్రీన్

| జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు ప్రారంభం |

- టంగుటూరు, సూరారెడ్డిపాలెంలో పాల్గొన్న కలెక్టర్.. పరిశీలించిన మంత్రి స్వామి
- ప్రభుత్వ కార్యాలయాలు, విద్య, వైద్య సంస్థల్లో పరిశుభ్రతపై దృష్టి
- ప్రతినెలా మూడో శనివారం నిర్వహణ
- ప్రభుత్వ ఉత్తర్వుల కన్నా ముందే అన్సారియా చొరవ




ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో చీపురుపట్టుకొని ఊడ్చుతున్న కలెక్టర్ అన్సారియా (ఇన్‌సెట్‌లో) తొలగించిన వ్యర్థాలను తీసుకెళ్తున్న జేసీ

ఒంగోలు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశుభ్రత, పచ్చదనం కార్యక్రమాలను శనివారం అధికార యంత్రాంగం నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా గతంలో వలే మళ్లీ 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమం చేపట్టాలని, ప్రతినెలా మూడో శనివారాన్ని అందుకు కేటాయించాలని ఇటీవల కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. అందుకు సంబంధించి త్వరలో ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అయితే ముందుగానే జిల్లాలో ఈ కార్యక్రమం అమలుకు కలెక్టర్ తమీమ్ అన్సారియా చొరవ చూపారు. ఇప్పటికే కేంద్రప్రభుత్వ ఆదేశాలతో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నడుస్తుండగా అన్నింటినీ కలిపి 'పరిశుభ్ర ప్రకాశం-పచ్చదనం ప్రకాశం' నినాదంతో ప్రతినెలా మూడో శనివారం కార్యక్రమాలు నిర్వహించాలని సంకల్పించారు. ఆమేరకు శుక్రవారం రాత్రి అధికారులందరితో

మిగతా 6వ పేజీలో


కొమ్మ తెగులు సోకి కాపుపైనే ఎండిపోతున్న పంట

రాలుతున్న రైతుల ఆశలు

- తెగుళ్లతో మిర్చి రైతుల దిగాలు
- కోయకుండానే బూజుపట్టిపోతున్న కాయలు
- రూ.లక్షల్లో నష్టపోతామని సాగుదారుల ఆందోళన

7

భూ ప్రకంపనలు

- దర్శి నియోజకవర్గంలోని పలు మండలాల్లో కంపించిన భూమి
- ఇళ్లలో కింద పడిన వస్తువులు
- బయటకు పరుగులు తీసిన ప్రజలు



6

జిల్లాకు ముగ్గురు ఎస్‌డీసీలు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు ముగ్గురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇరిగేషన్ (ఎల్‌ఏ) వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కె.శ్రీధర్‌రెడ్డి, గుండ్లకమ్మ ప్రాజెక్టు ఎస్‌డీసీగా సిహెచ్.విజయజ్యోతి కుమారి, కేఆర్‌సీసీ ఎస్‌డీసీగా కె.చిన్నయ్యను నియమించారు.

ప్రాజెక్టుల కమిటీలూ ఏకగ్రీవం

- మూడు మీడియం ఇరిగేషన్, సాగర్ పీసీ ఎన్నికలు ప్రశాంతం
- ముగిసిన ప్రక్రియ
- అన్నింటిలోనూ టీడీపీదే హవా


మోపాడు ప్రాజెక్టు చైర్మన్ కొండయ్యను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

ఒంగోలు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల ఎన్నికల్లో చివరి అంకమైన ప్రాజెక్టు కమిటీల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలో మీడియం ఇరిగేషన్ పరిధిలో పీబీ ఆనకట్ట, కంభం చెరువు, మోపాడు రిజర్వాయర్‌లతోపాటు జిల్లా అంతర్భాగంగా ఉన్న సాగర్ ప్రాజెక్టు కమిటీలు ఉండగా అన్నీ ఏకగ్రీవమయ్యాయి. కొండపి నియోజకవర్గంలోని పీబీ ఆనకట్ట కమిటీ ఎన్నిక సింగరాయకొండ మండలం మూలగుంటపాడులో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న నేతృత్వంలో జరిగింది. టీడీపీ సీనియర్ నేత మండలపు గాంధీచౌదరి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. కంభం చెరువు కమిటీ ఎన్నిక అక్కడి ఎంపీడీవో ఆఫీసులో మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ నేతృత్వంలో నిర్వహించారు. పార్సా ఆదినారాయణ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. మోపాడు రిజర్వాయర్ కమిటీ ఎన్నిక మోపాడులో కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించగా చుంచు కొండయ్య చైర్మన్‌గా ఎన్నికయ్యారు. తీవ్ర పోటీ, ఉత్కంఠ నెలకొన్న నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రాజెక్టు కమిటీ ఎన్నిక కూడా టీడీపీ అధిష్ఠానం ఆదేశాలతో ఏకగ్రీవమైంది. మొత్తం 48 డీసీల అధ్యక్షులు ఈ కమిటీలో ఓటర్లుగా ఉన్నారు. అందులో మన జిల్లాలో 10 మంది, ఒంగోలు ఎన్ఎస్‌పీ సర్కిల్ పరిధిలో ఉన్న ప్రస్తుత బాపట్ల జిల్లాలో ఎనిమిది మంది అధ్యక్షులు ఉన్నారు. శనివారం నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రాజెక్టు

మిగతా 6వ పేజీలో

డీఎంహెచ్‌వోగా వెంకటేశ్వర్లు

- ఉద్యోగోన్నతిపై నియామకం


వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో)గా డాక్టర్ టి.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. డీఎంహెచ్‌వోలుగా ఉద్యోగోన్నతులు కల్పించేందుకు కమిషనర్ కార్యాలయంలో ఇటీవల కౌన్సెలింగ్ నిర్వహించారు. అందులో బాపట్ల డీఐవోగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లుకు ఉద్యోగోన్నతి లభించింది. దీంతో ఆయన్ను మన జిల్లాకు నియమించారు. ఇక్కడ డీఎంహెచ్‌వోగా పనిచేసిన రాజ్యలక్ష్మి ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి పాలన నడుస్తోంది. ఇప్పుడు రెగ్యులర్ డీఎంహెచ్‌వోగా నియమితులైన వెంకటేశ్వర్లు త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

పీఐసీల పదవీకాలం పొడిగింపు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (పీడీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)ల అధికార పర్సన్ ఇన్‌చార్జి (పీఐసీ)ల పదవీ కాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 27 నుంచి ఆరు నెలలపాటు వీరి పదవీకాలాన్ని పెంచారు. పీడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్‌కు ఎన్నికలు నిర్వహించి నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరించినా... ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు జారీ చేసినా ఇవి రద్దవుతాయి.

భూ సమస్యలను పరిష్కరిస్తాం

- బాధితులకు న్యాయం చేసేందుకే రెవెన్యూ సదస్సులు
- మంత్రి డాక్టర్ స్వామి

7వ పేజీలో



విద్యుత్ వినియోగదారుల సమస్యలపై వెంటనే స్పందించండి

- సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేలు
- చీమకుర్తిలో విద్యుత్ అదాలత్

7వ పేజీలో

క్లీన్ అండ్ గ్రీన్

(5వ పేజీ తరువాయి)

కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి తగు సూచనలు చేశారు. శనివారం ఉదయం జిల్లా అంతటా ఈ కార్యక్రమాలు చేపట్టారు. కలెక్టర్ అన్సారియా టంగుటూరులో లాంఛనంగా కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం అదే మండలంలోని సూరారెడ్డిపాలెం లోనూ పాల్గొన్నారు. అక్కడ ఈ కార్యక్రమాన్ని మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి పాల్గొని పరిశీలించారు. దళితవాడలో వీధులు, డ్రైన్లు పరిశుభ్రత పనులను పర్యవేక్షించారు. ప్రకాశం భవన్‌లో కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో ఓబులేషులు చీపురు పట్టి చిమ్మి పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు జేసీ గోపాలకృష్ణ మద్దిపాడులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాలు, విద్యాసంస్థలు, హాస్టళ్లు, వైద్యశాలలు తదితర ప్రాంతాలలో స్థానిక అధికారులు, సిబ్బంది పరిశుభ్రత కార్యక్రమాన్ని పాటించారు. ప్రతినెల మూడవ శనివారం ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు.

ప్రాజెక్టు కమిటీలూ ఏకగ్రీవం

(5వ పేజీ తరువాయి)

కమిటీ ఎన్నికల్లో చైర్మన్‌గా పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గానికి చెందిన కారంపూడి డీసీ అధ్యక్షుడు పులుకూరి కాంతరావు ఎన్నికయ్యారు. వైస్‌చైర్మన్‌గా ఉమ్మడి జిల్లా పర్చూరు నియోజకవర్గానికి చెందిన కోనంకి డీసీ అధ్యక్షుడు ఉప్పలపాటి చక్రపాణి ఏకగ్రీవమయ్యారు. దీంతో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ముగిసింది. జిల్లాలో 342 డబ్ల్యూయూఏలు, 10డీసీలు, మూడు ప్రాజెక్టు కమిటీలు ఉండగా అన్నింటిలోనూ టీడీపీ మద్దతుదారులైన రైతు ప్రతినిధులే ఎన్నికయ్యారు.

ఎట్టకేలకు కదిలారు

(5వ పేజీ తరువాయి)

వచ్చింది. సెక్షన్ 51 విచారణకు అనుమతిస్తూ కలెక్టర్‌కు లేఖ పంపారు. అయితే ఇలాంటి విషయాలలో నిబద్ధత కలిగిన ఉన్నతస్థాయి అధికారిని ప్రభుత్వ స్థాయిలో విచారణాధికారిగా నియమించాలి. అందుకు భిన్నంగా నిత్యం బిజీగా ఉండే కలెక్టర్‌ను విచారణ చేయాలని, వీలు కాకపోతే రాష్ట్రస్థాయి కార్యాలయం అధికారి ఒకరి సేవలు వినియోగించుకోవాలని పేర్కొనడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

భూప్రకంపనలు

- ఇళ్లలో పడిపోయిన వస్తువులు
- బయటకు పరుగులు తీసిన విద్యార్థులు
- ఆందోళనతో ఇళ్లలో నుంచి వచ్చిన ప్రజలు

ముండ్లమూరు/తాళ్లూరు/కురిచేడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలో శనివారం స్వల్ప భూప్రకంపనలు సంభవించాయి. ముండ్లమూరు, తాళ్లూరు, కురిచేడు మండలాల్లో ఉదయం 10.32 సమయంలో రెండు సెకన్లపాటు భూమి కంపించింది. దీంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. ముండ్లమూరు, పసుపుగల్లు, వేంపాడు, సింగనపాలెం, పోలవరం, శంకరాపురం, నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెం, మారెళ్ల జమ్మలమడక, నాయుడుపాలెం, తమ్మలూరు, ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, ఈదర, భీమవరం, వేములబండ గ్రామాల్లో భూక్రంపనలు వచ్చాయి. పసుపుగల్లులోని గూడాల శివశంకర్‌రెడ్డి ఇంట్లో మచ్చు మీద పెట్టిన సామాన్లు సైతం కింద పడిపోయాయి. శంకరాపురంలో కూడా పలు ఇళ్లలోని సామాన్లు నేలపై పడ్డాయి.. పోలవరం, ముండ్లమూరు పాఠశాలల్లో విద్యార్థులు బయటకు పరుగులు తీశారు. ముండ్లమూరులో పోలీసులు ఏర్పాటుచేసి సీసీ కెమెరాల్లో భూమి కంపించిన దృశ్యాలు స్పష్టంగా నమోదయ్యాయి. కురిచేడులో రెండు సెకన్లపాటు స్వల్ప భూకంపం సంభవించింది. తాళ్లూరు మండలంలోని పలుగ్రామాల్లో శనివారం ఉదయం పెద్ద శబ్దంతో భూమి కంపించడంతో ప్రజలు ఆందోళన చెందారు. తాళ్లూరు, తూర్పుగంగవరం, కొర్రపాటివారిపాలెం, కొత్తపాలెం రమణాలవారిపాలెం తదితర గ్రామాల్లో రెండు సెకన్లపాటు భూమి కంపించింది. తాళ్లూరులోని ఎరువుల దుకాణంలోని బస్తాలు కింద పడ్డాయని యజమాని తెలిపారు.

పెద్ద శబ్దం రావటంతో భయంతో పరుగులు తీశాం



ఒక్కసారిగా పెద్ద శబ్దం రావటం, భూమి వణికినట్లుగా కన్పించటంతో ఇంట్లో నుంచి ఒక్కసారిగా భయంతో పరుగులు తీసి రోడ్డు మీదకు వచ్చాను. మా ఊరిలో వారంతా ఒక్కసారిగా భూకంపం రావటంతో పరుగులు తీశారు. ఇంట్లో వస్తువులన్నీ చెల్లాచెదురుగా కింద పడిపోయాయి.

\- గూడాల శివ శంకర్‌రెడ్డి, పసుపుగల్లు, ముండ్లమూరు మండలం



యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

శాస్త్రోక్తంగా ప్రారంభమైన పూజలు

పంగులూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొండమంజులూరు గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం సం దర్భంగా శనివారం వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు సుప్రభాతం అనంతరం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన, పంచగవ్య ఆరాధన, పంచగవ్య ప్రాసన, వాస్తుపూజ, అగ్ని ప్రతిష్ఠాపన, వాస్తు హోమం, పద్యజ్ఞీకరణం, అకల్మష హోమం, బింది శుద్ధ్యర్థం, నవ కలశ, పంచగవ్యాధివాసం, పంచాగ్ని ప్రణయనం, నివేదన, హారతి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాదవినియోగం జరిగింది. సాయంత్రం గ్రామోత్సవం, మహిళా కోలాటం ఘనంగా నిర్వహించారు. అనంతరం సాయంసవనం, నవగ్రహ ఆరాధన, అవహన కుంభాభిమర్శనం, సర్వదైవత్య హోమం, హారతి, తీర్థప్రసాద వినియోగం జరిగాయి. శాస్త్రోక్తంగా జరిగిన కార్యక్రమాలలో పలువురు దంపతులు పాల్గొన్నారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

సంతమాగులూరు, డిసెంబరు 21 : (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ తెలిపారు. సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు గ్రామంలో జనసేన పార్టీ కార్యకర్తల సమావేశంలో రియాజ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గ జనసేన నాయకులు చల్లా వెంకట కృష్ణారావు, కార్యకర్తలు పాల్గొన్నారు

వైసీపీ పాపం..ప్రయాణికులకు శాపం



గుంతలు పడిన పర్చూరు - ఇంకొల్లు మధ్య రోడ్డు



దగ్గుబాడు వద్ద ఇలా



అధ్వానంగా ఉన్న నూతలపాడు - వంకాలయలపాడు రహదారి

- పర్చూరు - ఇంకొల్లు రోడ్డుకు వీడని గ్రహణం
- మరమ్మతులకూ నోచుకోని వైనం
- గుంతలతో అధ్వానం
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు

పర్చూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలకుల పాపం ప్రయాణికులకు శాపంగా మారింది. పర్చూరు - ఇంకొల్లు వెళ్లే (పాతమద్రాస్)రోడ్డుకు గ్రహణం వీడేలా లేదు. కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో పెద్ద పెద్ద గుంతలు, కంకర రాళ్లు తేలి ప్రమాదాలకు కారణంగా మారింది. ఈ రోడ్డులో ప్రయాణమంటేనే నరకమని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఏదో ఒక చోట వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్న పరిస్థితి నెల కొంది. వానలు పడితే దారి బురదమయంగా మారుతుంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలతో రోడ్డు బాగా దెబ్బతిన్నది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో 2022లో ఈరోడ్డు నిర్మాణానికి రూ.22కోట్ల సీఆర్ఎఫ్ నిధులను మంజూరు చేసింది. ఆ నిధులతో కల్వర్టులు, సైడ్ డ్రేన్‌లతోపాటు రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అయితే ఆ కాంట్రాక్టర్ ఈరోడ్డులో కల్వర్టులు, సైడ్ డ్రైన్‌లతో సరిపెట్టారు. అప్పటిలో చేసిన పనులకు కూడా బిల్లులు చెల్లించక పోవడంతో కాంట్రాక్టర్ చేసేది లేక పనులను అర్థాం తరంగా నిలిపేశారు. అప్పటి నుంచి ఈ రోడ్డు మరమ్మతుకు కూడా నోచుకోక అధ్వానంగా తయా రైంది. ఎవరో చేసిన పాపం..ఇలా ప్రయాణి కులకు, ప్రజలకు శాపంగా మారింది. తరచూ రోడ్డు ప్రమా దాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందు తున్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం పర్చూరు - ఇంకొల్లు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మరమ్మతుల మాటే లేదు

గత వైసీపీ పాలనలో రోడ్ల అభివృద్ధి మాటే లేదు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల రోడ్లు బాగులేక ఘోర ప్రమాదాలు జరిగినా పాలకు స్పందించలేదు. తాజాగా రోడ్ల అభివృద్ధిపై సీఎం చంద్రబాబు స్పందించారు. సంక్రాంతి పండుగ నాటికి గ్రామ, పట్టణ రోడ్లను బాగు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చే శారు. దీనికి సంబంధించి నిదులు మంజూరు చేశారు. అయితే పర్చూరు - ఇంకొల్లు రోడ్డుకు గతంలోనే టెం డర్ పూర్తి కావడంతో మరమ్మతులకు కూడా నోచుకోలేదు.

దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారి నళిని వివరణిస్తూ పర్చూరు-ఇంకొల్లు రోడ్డు పరిస్థితిపై ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పలు రోడ్ల మరమ్మతులు మొదలయ్యాయి. ఈ రోడ్డు విషయంలో సాంకేతిక సమస్య ఉంది. త్వరలోనే సమస్య పరిష్కారమై రోడ్డు నిర్మాణం జరుగుతుందని తెలిపారు.

గ్రామసింహాలతో భయం..భయం

- ఒకేరోజు 18 మందిని కరిచిన కుక్కలు
- యాంటీ రేబిస్ కోసం ఆసుపత్రుల వద్ద క్యూ కడుతున్న బాధితులు



బల్లికురవలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

మేదరమెట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలో కుక్కల దాడులతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మందలమందలుగా కుక్కలు రోడ్లపై ఇష్టానుసారం తిరుగుతూ ద్విచక్రవాహనదారుల ను, విద్యార్థులను కరుస్తున్నాయి. ఈ సమ స్య మేదరమెట్లలోనే కాదు, మండలంలోని అన్ని గ్రామాలల్లో తీవ్రంగా ఉంది. ప్రతి రోజూ మేదరమెట్ల, కొరిశపాడు, ప్రాసంగులపాడు పీహెచ్‌సీలతో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లో కుక్కలు కరిచిన వారు మందుల కోసం క్యూ కడుతున్నారు. యాంటీ రేబిస్ ఇంజక్షన్‌లు వేయించుకుంటున్నారు. వారిలో చిన్నారులను, వృద్ధులు ఎక్కువగా వస్తున్నారని వైద్య సిబ్బంది చెప్తున్నారు. మూడు రోజుల కిందట ఒకేసారి 18 మందిని కు క్కలు కరిచి ఇంజక్షన్ కోసం హాస్పిటల్‌కు వచ్చారని మేదరమెట్ల ప్రాథమిక ఆ రోగ్య క్రేంద్రం సిబ్బంది తెలిపారు. ద్విచక్రవాహనాలపై వెళుతున్న వారిని వెనుక నుంచి కరవడంతో వారు కిందపడి గాయపడుతున్నారు. డ్రైవర్‌ల పైనుంచి కుక్కలు దూకడంతో ద్విచక్రవాహనదారులు కిందపడి గాయపడుతున్నారు. ఎక్కడి నుంచో వందల సంఖ్యలో కుక్కలు వచ్చాయి. కుక్కల దాడిలో గాయపడిన పలువురు పంచాయతీ అధికారులను కలువగా తామేమి చేయలేమంటూ చేతులు ఎత్తేస్తున్నారు. మండలంలోని ప్రజలు కుక్కలు సమస్యకు పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

శునకాలతో జరజాగ్రత్త

- నామ్ రోడ్డులో వీధిలో గుంపులు గుంపులుగా సంచారం
- ఆందోళనలో వాహనచోదకులు

బల్లికురవ : తరచూ గ్రామాలలో శునకాలు ద్విచక్రవాహనాలకు అడ్డుగా వచ్చి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పుడు వీధి శునకాలు రాష్ట్రీయ రహదార్లపై సం చారం చేస్తుండడంతో వాహనచోదకుల్లో భ యం భయం నెలకుంది.

బల్లికురవ మండల పరిధిలో ఉన్న అ ద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి రామాంజనేయపురం గ్రామం సమీపంలో రోడ్డుపై వీధి కుక్కల గుంపు గుంపులుగా సంచరిస్తుండడంతో వా హన చోదకులు ప్ర మాదాలబారిన పడుతున్నారు. ఈ కుక్కల ను చూడకుండా వాహనాలను నడిపే వారు ప్రమాదాలబారిన పడుతున్నారు. వాహన చోదకులు గ్రామాలలో రోడ్లపైనే కాకుండా రాష్ట్రీయ రహదార్లపై కూడా జర జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. రోడ్లపై ఉన్న వీధి కుక్కలు వాహనాలను సైతం నిలుపుదల చేస్తున్నాయి. వాహనాలు వేగంగా దగ్గరకు వచ్చిన కుక్కలు మాత్రం రోడ్లపైనే ఉంటున్నాయి. వీధి కుక్కలను నామ్ రోడ్డు, గ్రామ పంచాయతీ అధికారులు నియంత్రించకుంటే ముందు మందు పెను ప్రమాదాలు జరుగుతుఆయని ప్రజలు అంటున్నారు. వేగంగా వచ్చే వాహనాలకు కుక్కలు అడ్డంగా వస్తున్నాయని, దీంతో వాహనాలు నియంత్రించలేక బోల్తా పడుతున్నాయని చెప్తున్నారు. ఎస్ఎల్ గుడిపాడు, రామంజనేయపురం, వైదన, కొప్పెరపాడు గ్రామాల పరిధిలోని పంట పోలాల నుంచి కుక్కలు రోడ్ల మీదకు వస్తున్నాయని వాహనాల వెంబడి పడడంతో కొందరు రోడ్లపై పడిపోతుతూ గాయపడుతున్నారు. అధికారులు వెంటనే కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టి, ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

నేడు సీతారామస్వామి దేవస్థాన పునర్ నిర్మాణ పూజలు



మూతపడిన పురాతన సీతారామస్వామి ఆలయం

చినగంజాం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామంలోని అన్నపూర్ణ థియేటర్ పక్కనే ఉన్న సీతారామస్వామి దేవస్థానం పునర్ నిర్మాణ పూజలు ఆదివారం ఉదయం 7గంటల నుంచి నిర్వహించనున్నట్లు దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు వలివేటి వెంకటరామానుజం, మోటుమర్రి రామసుబ్బారావు తెలిపారు. గ్రామంలో సు మారు వంద సంవత్సరాల చరిత్ర గల సీతారామస్వామి దేవాలయంలో నిత్య నైవేద్యాలు సాగక మూతపడి శిథిలమై ఉంది. స్వామి వారి దేవాలయ ద్వార బంధం, సింహద్వారం తెరిచే కార్యక్రమాన్ని ఆగమ శాస్త్ర పండితులు అగ్నిహోత్రం వెంకటశేషాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7గంటల నుంచి విశ్వక్సేనారాధన, పుణాహవచనం, వాస్తు పూజ, పంచగవ్య ఆరాధన, ప్రోక్షణ తదనంతరం అగ్నిప్రతిష్ఠాపనం, శాంతి హోమం, పుర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం ద్వారా లు తెరిచే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 2006వ సంవత్సరం నుంచి దేవాలయంలోని సీతారాముల ఉత్సవ విగ్రహా లు స్థానిక భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానంలో ఉన్నట్లు తెలిపారు. నాటి నుంచి ప్రతి శ్రీరామనవమి పర్వదినాన భావనారాయణస్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు భావనారాయణ కల్యాణ మండపంలో ఉత్సవ విగ్రహాలతో స్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరుపుతున్నారు. సీతారామస్వామి దేవాలయంలో నాడు చినగంజాం, సోపిరాల తదితర గ్రామాల్లోని ప్రజలు తమ పిల్లలకు వివాహాది శుభకార్యాలు దేవాలయంలోనే జరుపుకునేవారిని గ్రామ పెద్దలు చెప్తున్నారు. ఆలయాన్ని నూతనముగా నిర్మాణం చేయటకు గ్రామస్థులు సంకల్పించి కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు రూ.39 లక్షల రూపాయలను ప్రజలు, భక్తుల నుంచి విరాళాల రూపంలో సేకరించి నిర్మాణానికి పూనుకున్నారు. ఇటీవల చినగంజాం పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే ఏలూ రి సాంబశివరావు కమిటీ సభ్యుల వినతి మేరకు దేవాలయాన్ని పరిశీలించారు. ఆదివారం జరిగే దేవాలయ పునఃనిర్మాణ పూజలకు కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. దేవాలయ హంసద్వారం తెరిచే కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులుఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణాలకు రక్ష



హెల్మెట్ ధరించిన వాహనదారుడిని అభినందిస్తున్న డీఎస్పీ

మేదరమెట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : హెల్మెట్ ధరించి ప్రయా ణిస్తున్న ద్విచక్రవాహనదారులు ప్రమాదాల నుంచి ప్రాణాలు కాపాడు కోవచ్చని చీరాల డీఎస్పీ మహ్మద్ మొయిన్ అన్నారు. శనివారం మేదరమెట్ల, కొరిశపాడు పోలీస్‌స్టేషన్‌లను వార్షిక తనిఖీలో భాగంగా ఆయన తనిఖీ చేశారు. రికార్డులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కొరిశపాడు పోలీస్ స్టేషన్ వద్ద నుంచి ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఉపయోగాలను వివరిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు.

జాతీయ రహదారిలో అత్యధిక ప్రమాదాలు రోడ్డు మార్జిన్‌లో వాహనాలు నిలపడంవల్లే జరుగుతున్నాయని డీఎస్పీ మొయిన్ అన్నారు. అనుమతి ఉన్న చోట మాత్రమే వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి వేళల్లో డ్రైవర్లు నిద్రలోకి జారుకోకుండా రాత్రి 3 గంటల సమయంలో లారీలను ఆపి మొఖం కడుగుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవడం వలన ఎన్నో కుటుంబాలను కాపాడవచ్చు అన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించి వెళ్తున్న వాహనదారుడికి పండు ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జున రావు, మేదరమెట్ల, కొరిశపాడు, జె.పంగులూరు ఎస్ఐలు మహమ్మద్ రఫీ, సురేష్, వినోద్‌బాబుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ : ద్విచక్ర వాహనాలను హెల్మెట్‌లు లేకుండా నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ జీవీ చౌదరి హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని వేమవరం నాలుగు రోడ్ల కూడలిలో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న పలువురికి హెల్మెట్‌ల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణ రక్షణ కలుగుతుందని చెప్పారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంవల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు. కార్యక్రమంలో రైటర్ శివ కృష్ణ ఉన్నారు.

మార్టూరు : హెల్మెట్లను వాహనాలు నడిపే సమయంలో ధరించడం వలన ప్రమాదాలబారి ప్రాణాలను కాపాడుకోవచ్చని సీఐ ఎం.శేషగిరి రావు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని బొల్లాపల్లి టోల్‌గేట్ వద్ద హెల్మెట్ల వినియెగంపై వాహన దారులకు సీఐ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ సైదా, ఏఎస్ఐ బాషా తదితరులు పాల్గొన్నారు.



కంభంలో రోడ్డుకిరువైపులా ఆక్రమణలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్

ఆక్రమణలను తొలగించండి

- అధికారులకు సబ్‌కలెక్టర్ ఆదేశం

కంభం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కంభం, కందులాపురం పంచాయతీలలో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న రహదారి ఆక్రమణలు తొలగించాలని మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ రెవెన్యూ పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతంలో రోడ్లను, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మించుకున్న అక్రమ కట్టడాలను తొలగించాలన్నారు. శనివారం సబ్‌కలెక్టర్ కంభం వచ్చారు. ట్రాఫిక్ ఇబ్బందులను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన సబ్‌కలెక్టర్ అధికారులను, పోలీసులను వెంట తీసుకుని ఆర్టీసీ బస్టాండ్ నుండి వైజంక్షన్ వరకు రోడ్డు మార్జిన్లు, ఫుట్‌పాత్, ఇరిగేషన్ కాలువలను ఆక్రమించుకున్న తీరును పరిశీలించారు. ఇంతలా ఆక్రమణలు ఉంటే సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటీసులు జారీ చేసి హద్దులు నిర్ణయించి తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో వీరభద్రాచారి, ఈవోఆర్‌డీ విజయలక్ష్మి, ఎస్సై నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కొండయ్యను సన్మానిస్తున్న కమిషనర్, అధికారులు, సిబ్బంది

క్రీస్తు శాంతి సందేశం అనుసరణీయం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : క్రీస్తు శాంతి సందేశం అనుసర ణీయమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. అంబేడ్కర్ భవన్‌లో శనివారం మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు చూపిన ప్రేమ, జాలి, దయ గుణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్యాండిల్ సర్వీస్ నిర్వహించారు. ఎమ్మెల్యే కొండయ్యను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, టీపీపీ శ్రీనివాసరావు, మాల్యాద్రి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వేటపాలెం వెలుగు కార్యాలయంలో

వేటపాలెం వెలుగు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్వతి, ఏపీఎం అంజిబాబు, పొదుపు సభ్యులు పాల్గొన్నారు

కారు ఢీకొని మాజీ సర్పంచ్‌కు గాయాలు

బల్లికురవ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి నార్కెట్‌పల్లి రహదారి ఎస్ఎల్ గుడిపాడు సమీపంలో శనివారం బైకుపై రోడ్డు దాటుతున్న గ్రామ మాజీ సర్పంచ్ రావులపల్లి గోవింద్‌ను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. గోవింద్ గ్రామానికి పరమడ వైపు న ఉన్న గొర్రెలదొడ్డి వద్దకు వెళ్లి తిరిగి బైకుపై వస్తుండగా హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న కారు బైకును ఢీకొట్టింది. సుమారు 10 అడుగుల ఎత్తు పైకి ఎగిరి గోవింద్ కింద పడిపోయారు. స్థానికులు అతడిని హైవే అంబులెన్స్‌లో నర్సారావుపేట ఆసుపత్రికి తరలించారు.

కాలువ నిర్మాణ పనుల ప్రారంభం

బల్లికురవ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో కాలువ పనులు ప్రారంభమయ్యాయి. ఉపాధి హామీ పథకంలో మంజూరైన నిధులతో శనివారం చినఅంబడిపూడి గ్రామంలో సైడు కాలువల నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఎంతో కాలగా సైడు కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూ టమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.10 లక్షల నిధులతో ప్రధాన వీధి లో రెండువైపులా కాలువ పనులు ప్రారంభయ్యాయి. నిర్మాణ పనులను టీడీపీ నేతలు మొదలు పెట్టారు.

విద్యార్థులకు నిఘంటువుల అందజేత

ఇంకొల్లు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగవరం వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాలలో 130 మంది విద్యార్థులకు ఆంగ్ల, తెలుగు నిఘంటువులను గుంటూరు జిల్లా అంకిరెడ్డిపాలెంకు చెందిన శ్యామల సుబ్బారెడ్డి, నాగరత్నమ్మ జ్ఞాపకార్థం కుమారుడు రఘురామిరెడ్డి, విజయమ్మ అందజేసారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని నార్నె సమత, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కరి కమలేశ్వరరావు, సంజీవరెడ్డి, వీరగంగాధరరెడ్డి,అంకిరెడ్డి,వీరాస్వామి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

తెగుళ్లతో మిర్చి రైతుల దిగాలు

కోయకుండానే

బూజుపట్టిపోతున్న కాయలు

రూ.లక్షల్లో నష్టపోతామని

సాగుదారుల ఆందోళన

రాలుతున్న కాయలు
సన్నగిల్లిన ఆశలు





కొమ్మతెగులు సోకిన మిర్చి చేను (ఇన్‌సెట్లో) చెట్టునే బూజుపట్టి రాలిపోయిన కాయలు

పీసీపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మిర్చికి కొమ్మ తెగులు సోకింది. కాపు దశకు వచ్చిన సమయంలో తెగుళ్ల సోకడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గతేడాది మిర్చి ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఈ సంవత్సరం మండలంలో పెద్దఎత్తున మిరప పంటను సాగుచేశారు. తలకొండపాడు, కమ్మవారిపల్లి, లక్ష్మక్కపల్లి, వరిమడుగు, పీసీపల్లి, చిరుకూరివారిపల్లి, పెద్దన్నపల్లి, పెదయిర్లపాడు, వేపగుంపల్లి తదితర గ్రామాల్లో సుమారు 500 ఎకరాలలో మిర్చి పంటను సాగుచేశారు. మొక్క నాటిన నుంచి పూత వచ్చేవరకు ఎటువంటి తెగులు లేకుండా పైరు ఏపుగా పెరిగింది. అయితే, పూత కాస్తా పిందెగా మారి కాపు దశకు వచ్చిన క్రమంలో కొమ్మ తెగులు ఆశించింది. తెగులు సోకిన కొమ్మలకు తొలుత బూజు పడుతోంది. అనంతరం కొమ్మ చివర నుంచి మొదలు వరకు చెట్టు ఎండిపోతోంది. కాయలు రాలిపోతున్నాయి. తొలుత మిరపతోటల్లో అక్కడక్కడా కనిపించిన ఈ కొమ్మతెగులు క్రమేణా ఉధృతమై తోట మొత్తం వ్యాపిస్తోంది. ఈ తెగులు సోకిన చెట్లన్నీ కొమ్మలు విరిగిపోయి పంట కళ్లముందే ఎండిపోతోంది. ఈ తెగులును అదుపు చేసేందుకు రైతులు ఎన్నిసార్లు రసాయనిక మందులు పిచికారీ చేసినా అదుపులోకి రావడంలేదు. తోటిరైతులతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు చెప్పిన మందులన్నీ పిచికారీ చేస్తున్నా పెట్టుబడి వ్యయం పెరుగుతుందే తప్ప తెగుళ్ల అదుపులోకి రావడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ఎకరం పొలంలో మిర్చిని సాగుచేసిన రైతులకు కౌలు, మిరపనారు, దుక్కి, ఎరువులు, పురుగుమందులు, నాట్లు, కలుపు కూలీలతో పాటు ఇతర ఖర్చులు కలిపి సుమారు రూ.80 వేల నుంచి రూ.లక్ష ఖర్చయింది. మరో 20రోజుల్లో మిర్చి తొలికోత కోసే సమయంలో వ్యాపించిన కొమ్మతెగులు పంటను మింగేస్తుందని, తద్వారా తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు కొమ్మతెగులు ఇలా ఉంటే మరి కొన్ని పొలాల్లో అక్కడక్కడా కుచ్చుతెగులు కూడా మిరపను చుట్టుముట్టుతోంది. ఒక వైపు కొమ్మతెగులు మరోవైపు కుచ్చుతెగులుతో మిరప రైతులను కోలుకోలేనంతగా దెబ్బ తీస్తుంది.



కొమ్మతెగులుతో ఆందోళన

\- రామయ్య, రైతు, చవిటిపల్లి

నేను మూడు ఎకరాలలో మిరపను నాటాను. ఇప్పటివరకు మిరపచెట్లు బాగా ఏపుగా పెరిగి ఆరోగ్యంగా ఉన్నాయి. ఫెంగల్ తుపాను వచ్చిపోయిన తరువాత అక్కడక్కడా కొమ్మతెగులు సోకింది. పది రోజుల నుండి ఆ తెగులు ఉధృతి ఎక్కువై తోటలోని మిగిలిన చెట్లకు వ్యాపించి కొమ్మలు విరిగిపోయి చెట్లు ఎండిపోతున్నాయి. దీంతో చెట్లకు ఉన్న కాయలు కుళ్లిపోయి కోయకుండానే నేలపాలవుతన్నాయి. ఇప్పటికే మూడు ఎకరాలకు సుమారు రూ.2.80 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. ఎన్ని మందులు పిచికారీ చేసినా తెగులు అదుపులోకి రావడంలేదు. ఉద్యాన అధికారులు మిరపపంటను పరిశీలించి కొమ్మ తెగులుకు నివారణ మార్గాలు సూచించాలి. ఈ తెగులు అదుపులోకి రాకుంటే మిరప సాగుచేసిన రైతులకు లక్షలాది రూపాయల నష్టం వాటిల్లుతుంది.



వైపాలెంలో రైతు సేవా కేంద్రంగా పేరు మార్చిన అధికారులు

పేరు మారింది

● రైతు సేవా కేంద్రంగా మార్పు

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ఎర్రగొండపాలెంరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెంలోని రైతుసేవా కేంద్రం పేరును అధికారులు శనివారం సరిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుభరోసా కేంద్రా'లను రైతుసేవా కేంద్రాలుగా పేరుమార్చిన సంగతి తెలిసిందే. అయితే ఐదు నెలలుగా వై.పాలెంలో రైతు భరోసా కేంద్రం పేరు మార్చలేదు. దీంతో 'రిపేరుపై అలవిమాలిన నిర్లక్ష్యం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం కథనం ప్రచురితమైంది. దీంతో వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. ఎర్రగొండపాలెంలోని వ్యవసాయ కార్యాలయ సమీపంలో ఉన్న రైతుభరోసా కేంద్రాన్ని రైతుసేవా కేంద్రంగా మార్చారు. మండలంలో ఉన్న అన్ని రైతు భరోసా కేంద్రాల పేర్లను త్వరలో మారుస్తామని ఏవో కేవీ.శేషారెడ్డి తెలిపారు.

చీమకుర్తిలో ఊరేగింపుగా సారె తీసుకెళ్తున్న మహిళాభక్తులు



పూజల్లో పాల్గొన్న శిద్దా రాఘవ రావు,కుటుంబసభ్యులు

గోదాదేవికి ఘనంగా సారె సమర్పణ

చీమకుర్తి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసం తిరు నక్షత్రం సందర్భంగా చీమకుర్తి పట్టణంలోని హరిహరక్షేత్రంలో గోదాదేవి, పద్మావతికి సారె సమర్పణ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా లక్ష్మీపద్మావతి తమ కుటుంబసభ్యులతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారికి సారె, వడి బియ్యంలను సమర్పించారు. పెద్దఎత్తున మహిళా భక్తులు పట్టణంలో ఊరేగింపుగా సారెను తీసుకువచ్చే వేడుకలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు హరి వెంకట కుమారాచార్యులు, సుబ్రహ్మణ్యంశర్మ, హరికృష్ణశర్మలు పూజా కార్యక్రమాలను జరిపారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం

బాధితులకు న్యాయం చేయడానికే

రెవెన్యూ సదస్సులు

మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి



పొదిలి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

పొదిలి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన భూ సమస్యలను సరిచేసి బాధితులకు న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూదందాలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహించే ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమానికి వచ్చిన అర్జీల్లో 70 శాతం వైసీపీ హయాంలో బాధితుల నుంచే వచ్చాయన్నారు. అది గుర్తించిన చంద్రబాబునాయుడు భూసమస్యల నుంచి శాశ్వతంగా ప్రజలకు విముక్తి కలిగే విధంగా చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. భూసమస్య ఉన్న రైతులు రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు ఇస్తే వెంటనే పరిష్కరిస్తారన్నారు. అంతేకాకుండా రెవెన్యూ మంత్రి, ఆ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి, సీసీఎల్ఏలు జనవరి మొదటివారంలో జిల్లాలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో పర్యటిస్తారన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మండలంలో 9,400 ఎకరాల్లో ఫ్రీహోల్డ్ చేస్తే 706 ఎకరాల్లో ఆక్రమణలు జరిగాయన్నారు. అక్రమాలకు ఆస్కారం లేకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. 251 సర్వేనంబరులో 11సెంట్లు వేణుగోపాలస్వామి భూమి కలవడం వలన రిజిస్ట్రేషన్‌లకు సమస్య ఉందని దాన్ని పరిష్కరించాలని సూచించారు. శివాలయం వద్ద ఉన్న ఆరామక్షేత్రాన్ని సర్వే చేయించాలని ఎమ్మెల్యే సూచించారు. పృదులగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూమిలో నిర్మించిన గోశాలతో పాటు ఆలయానికి కూడా ఆదాయం వచ్చేలా ముందుకు వెళతామన్నారు. ఆ భూమిలో కల్యాణమండపం నిర్మించే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య ఎప్పటి నుంచో వేధిస్తోందని దానికి పరిష్కారమార్గం చూపాలన్నారు. అదేవిధంగా దర్శి కెనాల్ నుంచి పొదిలి పెద్దచెరువుకు పైపుల ద్వారా నీరు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కనిగిరి ఆర్‌డీవో కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో శోభన్‌బాబు, ఇరిగేషన్ ఏఈ విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, సర్వేయర్ గురవయ్య, ఆర్ఐ నరసింహారావు, పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో వీఆర్‌వోను హెచ్చరిస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

భూబకాసురుడి ఆటకట్టిస్తా : కందుల

పొదిలి చిన్నచెరువును యథేచ్ఛగా ఆక్రమించుకున్న భూబకాసురుడి ఆటకట్టిస్తానని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హెచ్చరించారు. శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో ఆయన ఉద్వేగపూర్వకంగా మాట్లాడారు. 12 ఎకరాలకుపైగా చెరువుతొట్టి భూమిని వైసీపీకి చెందిన ఓ భూబకాసురుడు ఆక్రమించుకున్నట్లు ఆయన ఆరోపించారు. రెవెన్యూ అధికారులు ఆక్రమణలపై సమగ్రంగా విచారించాలని, మంత్రి డాక్టర్ స్వామి ఎదుట జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణను ఆయన కోరారు. స్పందించిన జేసీ గోపాలకృష్ణ తక్షణమే మూడు బృందాలను ఏర్పాటు చేశారు. ఆక్రమణలపై మూడురోజుల్లోగా నిగ్గు తేల్చాలని తహసీల్దార్ కృష్ణారెడ్డిని ఆదేశించారు.

విచారణ నివేదికను తనకు తక్షణమే పంపాలని సూచించారు. అక్కడికక్కడే సర్వేయర్లు, వీఆర్‌వోలతో మూడు బృందాలను నియమించారు. ఎమ్మెల్యే భూబకాసురలపై ఉక్కుపాదం మోపుతాననడం పట్టణంలో చర్చనీయాంశమైంది.

రేపు జాతీయ రైతు దినోత్సవం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధానమంత్రి చౌదరి చరణ్‌సింగ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఉదయం పదిన్నర గంటలకు ఒంగోలులోని రంగాభవన్‌లో జాతీయ రైతు దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆచార్య ఎన్‌జీ రంగా కిసాన్ సంస్థ అధ్యక్షుడు ఆళ్ల వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. రంగా కిసాన్ సంస్థ, జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రబీ పంటలపై శాస్త్రవేత్తలతో ముఖాముఖి ఉంటుందన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈసదస్సు జరుగుతుందని, రైతులు అధిక సంఖ్యలోపాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు జాబ్ మేళా

సంతనూతలపాడు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఎండ్లూరు డొంకవద్ద మహిళా ప్రాంగణంలో ఈనెల 23న ఇన్ఫో సెవెన్ ప్రైవేట్ లిమిటెడ్, పేటీఎం కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రవితేజ యాదవ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 18-30 సంవత్సరాల వయస్సుగల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు స్కిల్‌హబ్ కో-ఆర్డినేటర్ షేక్ బా షా,సెల్ నెం.9963005209లను సంప్రదించాలన్నారు.

24న ఉమ్మడి ప్రకాశం జిల్లా క్రికెట్ జట్లు ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-12 బాలుర ఉమ్మడి ప్రకాశం జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక ఈనెల 24వ తేదీన ఒంగోలులో జరగనుంది. స్థానిక మంగమూరు రోడ్‌లోని అసోసియేషన్ సబ్ సెంటర్‌లో ఉదయం 9గంటలకు ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్టు జనవరి 9న ఎన్టీఆర్ జిల్లా మూలగుంటపాడులో జరిగే అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో పాల్గొంటుందన్నారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు తెల్ల దుస్తులు, కిట్, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్కూల్ స్టడీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని, వివరాలకు కోచ్ కె.సుధాకర్ సెల్ 9701022333 ద్వారా పేర్లునమోదు చేసుకోవాలని కోరారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలపై సత్వరమే స్పందించండి

● సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేలు

● చీమకుర్తిలో విద్యుత్ అదాలత్



వినియోగదారుడితో మాట్లాడుతున్న చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేలు, అధికారులు

చీమకుర్తి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరిచటంలో అధికారులు, సిబ్బంది సత్వరమే స్పందించాలని విద్యుత్ అదాలత్ సీజీఆర్ఎఫ్ చైర్మన్ జస్టిస్ ఎస్.విక్టర్ ఇమ్మానుయేలు ఆదేశించారు. చీమకుర్తి పట్టణంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో శనివారం జరిగిన విద్యుత్ వినియోగదారుల అదాలత్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వినియోగదారుల నుంచి వచ్చిన సమస్యలను పరిశీలించారు. చీమకుర్తి, దర్శి, పొదిలి, కురిచేడు తదితర ప్రాంతాల నుంచి విచ్చేసిన వినియోగదారుల నుంచి 40 ఫిర్యాదులు అందాయి. వాటిలో 10సమస్యలను తక్షణమే పరిష్కరించారు. తక్కువ విద్యుత్ వినియోగానికి ఎక్కువగా బిల్లులు రావటం, ఓల్టేజీ సమస్యలు, ఇన్సులేటర్ల సమస్యలతో విద్యుత్ సరఫరాలో కలుగుతున్న అంతరాయాలు, అలాగే ఎస్సీ ఎస్టీలకు అందాల్సిన సబ్సిడీలు అందకపోవటం లాంటి సమస్యలతో కూడిన వినతిపత్రాలు అదాలత్‌లో వచ్చాయి. సమావేశంలో సీజీఆర్ఎఫ్ సాంకేతిక సభ్యులు కె.వెంకటకృష్ణ, ఆర్థికసభ్యులు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, ఇండిపెండెంట్ సభ్యులు ఎ.సునీత, ఒంగోలు ఆపరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.వెంకటేశ్వర్లు, ఈఈ పి.శ్రీనివాసులు, డీఈలు మోహనరావు, హరిబాబు,కృష్ణారెడ్డి, ఏఈలు చంద్రశేఖరరావు, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.



దివ్యాంగులు, వృద్ధులతో క్రిస్మస్ కేక్ కట్ చేయిస్తున్న ఫైట్‌మాస్టర్ సాల్మన్

సొంత ఊరుకి సేవ

\- సినీ ఫైట్ మాస్టర్ కింగ్ సాల్మన్

చీరాలటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : 'పేద కుటుంబంలో జన్మించి ఉన్నత స్థానంలో ఉన్నాను. ఎక్కడున్నా.. ఎంత బిజీగా ఉన్నా సొంతూరికి సేవలు చేయాలనే ధ్రుడ సంకల్పం అధికంగా ఉంది. ఆ నిశ్చయంతోనే గ్రామంలో ఏటా సేవా కార్యక్రమాలు చేస్తున్నాను' అని బాహుబలి 2, ఆర్ఆర్ఆర్, కల్కి, దేవర చిత్రాలకు పనిచేసిన ఫైట్ మాస్టర్ కింగ్ సాల్మన్ అన్నారు. ఆయన సొంతూరు చీరాల మండలం తోటవారి పాలెం గ్రామం. ఫైట్ మాస్టర్ రాజు సాయంతో నేడు చలనచిత్ర రంగంలో తనకంటూ ఓ గుర్తింపు సంపాదించి రెండు సార్లు ఆస్కార్ అవార్డులు అందుకున్నారు. శనివారం గ్రామంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దాదాపుగా 20 నుంచి 25 వేలమంది ప్రజలకు అన్నదానం నిర్వహించారు. అలాగే నిరు పేదలకు రైస్ బ్యాగులు, నూతన వస్త్రాలు బహూకరించారు. కింగ్ సాల్మన్ ఫౌండేషన్ ట్రస్టును స్థాపించి దాదాపుగా 20 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రభాస్‌తో రాజాసాబ్, వచ్చే ఏడాది నుంచి రాజమౌళి, మహేష్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకోబోతున్న నూతన చిత్రానికి అగ్రిమెంట్ చేసినట్లు ఫైట్ మాస్టర్ తెలిపారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని, ఉన్నదానిలో స్వగ్రామానికి సేవ చేయాలనే తలంపుతో ఏటా సుమారు 25 వేల మందికి అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు.

నిరుపేదలకు నిత్యాన్నదానం



తాను బతికి ఉన్నంత కాలం పేదలు, నిస్సహాయకులకు నిత్యాన్నదానం చేయనున్నట్లు కింగ్ సాల్మన్ ప్రకటించారు. శనివారం నుంచి తన సొంత ఇంటి వద్ద అన్నదానం కార్యక్రమం ప్రారంభమైనట్లు చెప్పారు. తన పర్సనల్ మేనేజర్ అనిల్ సహకారంతో బెంగళూరు నుంచి 150 పొటేళ్లను తెప్పించి అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కదలలేని పరిస్థితిలో ఉన్న వాళ్లు తమ వివరాలు తెలియజేస్తే వారికి నేరుగా భోజనం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. బాపట్ల బేతనీకాలనీ (కుష్టు) వాసుల విజ్ఞప్తి మేరకు మార్చురీ బాక్స్‌ను అందజేశారు. చీరాల చుట్టుపక్కల ఉన్న నిరుపేదలకు సొంత బిడ్డలా ఉంటానని తెలిపారు. ఇల్లు లేక, పిల్లల ఆదరణకు నోచుకోని వారికి సొంత ఇంటిని నిర్మిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం దివ్యాంగులు, వృద్ధులతో క్రిస్మస్ కేక్ కట్ చేయించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ శనివారం పంపిణీ చేశారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడిన వారికి ఆర్థికంగా అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం నగదు సహాయాన్ని అందిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. కాగా 21మందికి రూ.54లక్షల చెక్కులను ఎమ్మెల్యే జనార్దన్ ఒంగోలులో అందజేశారు.

నేడు పురందేశ్వరి నగరానికి రాక

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆదివారం ఉదయం ఒంగోలుకు వస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కాకతీయ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బాలికల వసతిగృహ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'వివాదాస్పద స్థలంలోకి ఎవరూ వెళ్లొద్దు'

మద్దిపాడు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్డవరం గ్రామంలోని బీసీ కాలనీలో ఒక స్థలంపై వివాదం నెలకొంది. ఆ స్థలంలోకి ఎవరూ వెళ్లకూడదని తహసీల్దార్ సృజన్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. శనివారం తెల్లవారుజాము నుంచి ఆ స్థలం విషయంలో ఇరు వర్గాలు ఘర్షణకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలం వద్దకు వెళ్లి తహసీల్దార్‌కు సమాచారం అందజేశారు. ఈక్రమంలో ఆయన పై విధంగా ఆదేశాలు జారీ చేస్తూ వివాదంలో బైండోవర్ అయిన వారు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో హాజరుకావాలన్నారు. అప్పటివరకు ఆ స్థలంలోకి ఎవరూ వెళ్లకుండా పర్యవేక్షించాలని పోలీసులను ఆదేశించారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

మద్దిపాడు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురం, మద్దిపాడులోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పీడీ హేనసుజన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రతి నెలా మూడవ శనివారం క్లీన్ ప్రకాశం-గ్రీన్ ప్రకాశం కార్యక్రమంలో భాగంగా శుభ్రం చేసుకోవాలని, పిల్లలకు ఉడికించి ఇచ్చే గుడ్లను నాలుగు భాగాలుగా చేసి ఇవ్వాలని సూచించారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు.

జ్వర పీడితులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు

మర్రిపూడి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామాయపాలెంలో జ్వరపీడితులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందిస్తామని కాకర్ల వైద్యాధికారి తేజ చెప్పారు. ఆంధ్రజ్యోతిలో 'రామాయపాలేనికి జ్వరమొచ్చింది' శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు శనివారం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పలువురి నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి తేజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దోమ తెరలు వినియోగించాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని కోరారు. వారం రోజులపాటు వైద్య శిబిరాన్ని కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి రుచిత, విస్తరణాధికారి ఏడుకొండలు, సీహెచ్‌వో వాసంతి, ఏఎన్‌ఎం ప్రశాంతి, ఆశాకార్యకర్తలు పరిశుద్ధం, శ్రీలీల పాల్గొన్నారు.

పీబీ చానల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా గాంధీచౌదరి


గాంధీచౌదరికి ఎన్నికపత్రాన్ని అందజేసిన ఆర్డీవో లక్ష్మీప్రసన్న

సింగరాయకొండ డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాలేరు-చిట్రగుంట (పీబీ) చానల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా కలికివాయికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మండలపు గాంధీచౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మూలగుంటపాడులోని ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికలు నిర్వహించారు. పీబీ చానల్ పరిధిలోని పాకల-1,2 బింగినపల్లి, సోమరాజుపల్లి, చిట్రగుంట సాగునీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు. చైర్మన్‌గా సోమరాజుపల్లి- 1 నీటి సంఘం అధ్యక్షుడు గాంధీచౌదరి, వైస్ చైర్మన్‌గా పాకల-2 నీటి సంఘం అధ్యక్షుడైన బాయిరెడ్డి మురళిను ఎన్నుకున్నారు. అనంతరం ఆర్డీవో లక్ష్మీప్రసన్న వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి, టీడీపీ నాయకులు సన్నెబోయిన శ్రీనివాసులు, సుదర్శి చంటి, చిగురుపాటి గిరి, నర్రా రాంబాబు, ఇమ్మిడిశెట్టి రామారావు, రాజగోపాల్‌రెడ్డి, గుళ్లా వెంకటేష్ పాల్గొన్నారు.


వరిలో ఉల్లికోడు పట్ల జాగ్రత్తలు వహించాలి

నాగులుప్పలపాడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వరి పైరులో వచ్చే ఉల్లికోడు తెగులు పట్ల రైతులు జాగ్రత్తలు వహించాలని ఏవో వెంకట్రావు సూచించారు. వినోదరాయునిపాలెం గ్రామంలో సాగు చేసిన వరిపైరును ఆయన రైతులతో కలిసి శనివారం పరిశీలించారు ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కేఎన్ఎం-1638 రకం వరి ఎక్కువ మొత్తంలో రైతులు సాగు చేశారని తెలిపారు. ఆఖరి దఫా ఎరువులు చల్లే సమయంలో తప్పనిసరిగా పొటాష్ 30 కేజీలు వేయాలని చెప్పారు. ఉల్లికోడు పురుగు నివారణకు బెల్ట్ ఎక్స్‌పర్ట్ 80 ఎంఎల్, అగ్గితెగులు సోకితే ఆకులపైన నూలుకండె ఆకారంలో గోధుమరంగు మచ్చలు కనిపిస్తాయని నివారణకు ఫ్యూజివన్400 ఎంఎల్ ఎకరానికి పిచికారి చేయాలని వివరించారు. రబీలో పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని కోరారు. పంటల బీమా నమోదుకు ఈ నెల 31 వరకు గడువు పెంచారని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలకు పంటలు నష్టపోతే పరిహారం పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల వారోత్సవాల ర్యాలీ

ఒంగోలు విద్య, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఒంగోలులోని డీఎస్ ప్రభుత్వమహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి. కళ్యాణి మాట్లాడుతూ వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే అనంతరం స్థానిక కళాశాలలో ఆదా వారోత్సవాలను నిర్వహిచారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.కుసుమాకుమారి, కె.రాణి, ఎం.పద్మ, సురేష్, పి.ఇందిర, ఎం.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు


విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని డీఆర్ఆర్ఎం స్కూలులో శనివారం వైద్యాధికారులు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల బరువు, ఎత్తు, హిమోగ్లోబిన్, కంటి వైద్య పరీక్షలు 40 మందికి చేశారు. వారిలో ఆరుగురు విద్యార్థులు కంటి , దంత సమస్యలు, రక్తహీనతను గుర్తించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ భగీరథి, డాక్టర్ సాయి, సంతోష్, ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలి

● అర్జీలు అందజేసిన దేవదాయశాఖ అధికారులు

ఒంగోలు(రూరల్), డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు గ్రామంలో శనివారం రెవెన్యూసదస్సు జరిగింది. 80మంది రైతులు అర్జీలను తహసీల్దార్ వాసుకు అందజేశారు. ఈ సందర్భంగా దేవదాయశాఖ అధికారులు మాట్లాడుతూ గ్రామంలోని చెన్నకేశవస్వామి దేవాలయం, భీమేశ్వరస్వామిదేవాలయం, కొప్పోలు చెరువుమాన్యం, గుత్తికొండవారిపాలెం చెరువు మాన్యం భూములు సర్వే చేసి ఆలయాలకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని కోరారు. అలాగే బాపట్ల జిల్లా బేతపూడిఅగ్రహారం గ్రామంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయ భూమి కొప్పోలు సర్వేనెంబరు367లో 6.25 ఎకరాలు ఉందని, దానిని సర్వేచేసి పాసుపుస్తకాలు ఇవ్వాలని దేవాలయ ఈవో అర్జీ సమర్పించారు. కార్యక్రంలో డీఆర్వో చినఓబులేషు, డీటీ శీలం శ్రీనివాసరావు, సర్వేయర్ ఎల్.విష్ణువర్దన్, ఆర్ఐ శ్రీకాంత్, వీఆర్వోలు రమ, కృష్ణారావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ ప్రకాశం'లో భాగస్వాములు కావాలి

మంత్రి డాక్టర్ స్వామి పిలుపు

కలెక్టర్ అన్సారియాతో కలిసి సూరారెడ్డిపాలెంలో 'క్లీన్ ప్రకాశం- గ్రీన్ ప్రకాశం' ప్రారంభం

పలుచోట్ల పారిశుధ్య పనుల నిర్వహణ


టంగుటూరులో పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా


మద్దిపాడులో శుభ్రం చేస్తున్న జేసీ గోపాలకృష్ణ


ఒంగోలులో పార చేతపట్టిన కమిషనర్ వెంకటేశ్వరరావు

టంగుటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్లీన్ ప్రకాశం- గ్రీన్ ప్రకాశం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా క్లీన్ ప్రకాశం- గ్రీన్ ప్రకాశం కార్యక్రమాన్ని శనివారం ఆయన కలెక్టర్ తమీమ్ అన్సారియా కలిసి సూరారెడ్డిపాలెంలో నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడారు. స్థానిక ఎస్సీకాలనీలో వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదని, తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు మంత్రి దృష్టి తెచ్చారు. స్పందించిన ఆయన ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి మూడు రోజుల్లో వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, డీపీవో వెంకటనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో కుసుమకుమారి పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : కలెక్టర్

టంగుటూరు: గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. క్లీన్ ప్రకాశం- గ్రీన్ ప్రకాశం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె టంగుటూరులో పర్యటించారు. పంచాయతీ కార్యాలయం రోడ్డు, రైల్వేగేటు రోడ్డు, అంబేడ్కర్ నగర్‌లో పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్మికులు, ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమైన కూడళ్లలో చెత్త తొట్లను ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఆమె వెంట జడ్పీ సీఈవో చిరంజీవి, డీపీవో వెంకటనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, ఎంపీడీవో కుసుమకుమారి, తహసీల్దార్ అంజనేయులు, టీడీపీ నాయకుడు బెల్లం జయంత్‌బాబు తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్‌లో..

ఒంగోలు కలెక్టరేట్: పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యతని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ప్రాంగణంలో జేసీ గోపాలకృష్ణతో కలిసి పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతినెలా మూడవ శనివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా క్లీన్ ప్రకాశం- గ్రీన్ ప్రకాశం నినాదంతో ఈ కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు. వచ్చేనెల మూడవ శనివారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పాత ఫైల్స్‌ను క్లియర్ చేసే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లోని టాయిలెట్ల నిర్వహణపైనా ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో చినఓబులేషు, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


నాగులుప్పలపాడు ఎంపీడీవో కార్యాలయంలో..


సంతనూతలపాడులో పారిశుధ్య పనులు

కార్పొరేషన్ కార్యాలయంలో...

ఒంగోలుకార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయంలో పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వరరావు, మేయర్ గంగాడ సుజాత, శానిటరీ సూపర్ వైజర్ షేక్ బాబ్జి, అధికారులు పాల్గొన్నారు

ఒంగోలు మండలంలో..

ఒంగోలు(రూరల్): మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు శనివారం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. మండవవారిపాలెంలో ఎంపీడీవో శేషుబాబు ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించారు. అనంతరం ఒంగోలు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గల పిచ్చిమొక్కలను తొలగించారు. ఆయా కార్యక్రమాల్లో ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య, మండవవారిపాలెం సర్పంచ్ మండవ వెంకటసుబ్బయ్య ఉద్యోగులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జేసీ ఆర్.గోపాలకృష్ణ కోరారు. శనివారం మద్దిపాడు ఎంపీడీవో కార్యాలయం దగ్గర ఆయన క్లీన్ ప్రకాశం-గ్రీన్ ప్రకాశం కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలిసి చెత్తాచెదారం తొలగించారు. ప్రతి నెల మూడవ శనివారం కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు అధికారులు పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.జ్యోతి, తహసీల్దార్ సృజన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అధికారులు, ప్రజా ప్రతినిధులు శనివారం స్థానిక ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డీఎల్‌డీవో మహాలక్ష్మి అధికారులతో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: కలెక్టర్ ఆదేశాల మేరకు సంతనూతలపాడులో శనివారం ఎంపీడీవో డి.సురేష్‌బాబు, పంచాయతీ సిబ్బందితో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ క్లీన్ అండ్ గ్రీన్‌గా సంతనూతలపాడులో ఉండటమే లక్ష్యమన్నారు. అనంతరం పలుచోట్ల బ్లీచింగ్ చల్లించారు. అనంతరం సచివాయలం సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈవో ప్రతాప్ పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం కొండపిలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు, పంచాయతీలోని పలు కాలనీల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ పి.మురళి ఆధ్వర్యంలో సిబ్బంది చెత్తాచెదారాన్ని తొలగించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో రామాంజనేయులు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు చేశారు. పంచాయతీ కార్యదర్శి బిళ్లా అంకయ్య పర్యవేక్షణలో రోడ్ల వెంట ఉన్న చెత్తను తొలగించారు.

వైసీపీ పాలనలో అంతులేని దోపిడీ

ఆ పార్టీ నేతల భూదాహానికి అనేక మంది సామాన్యులు బలి

అయ్యపురాజుపాలెం రెవెన్యూ సదస్సులో మంత్రి స్వామి ధ్వజం


అర్జీని పరిశీలిస్తున్న మంత్రి స్వామి

మర్రిపూడి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఐదేళ్ల పాలనలో అంతులేని దోపిడీ జరిగిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆరోపించారు. వారి భూదాహానికి అనేక మంది సామాన్యులు, పేదలు బలయ్యారని ధ్వజమెత్తారు. టీడీపీ జాతీయ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమానికి పెద్దఎత్తున బాధితులు వచ్చి వారికి జరిగిన అన్యాయాలను వివరిస్తున్నారని చెప్పారు. మండలంలోని అయ్యపురాజుపాలెంలో శనివారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో మంత్రి పాల్గొని మాట్లాడారు. వైసీపీ పాపాలను కూటమి ప్రభుత్వం ప్రక్షాళన చేస్తున్నదని చెప్పారు. భూసమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందన్నారు. న్యాయబద్ధమైన వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈసందర్భంగా పలువురు రైతులు తమ భూములను ఆన్‌లైన్ చేయించాలని కోరుతూ మంత్రికి అర్జీలు అందజేశారు. జక్కరాజుపాలెంలో దళితులకు గత ప్రభుత్వంలో నిలిపివేసిన నివేశన స్థల పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అధికారులకు స్వామి సూచించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పీసీపల్లి మండలానికి చెందిన కొందరి అడ్రస్‌లను ఆధార్ కార్డుల్లో మార్పించి ఇక్కడ ఓటర్లుగా నమోదు చేయించారని పలువురు మంత్రి దృష్టికి తెచ్చారు. వెంటనే వారి పేర్లను తొలగించాలని కోరారు. స్పందించిన మంత్రి స్వామి పూర్తిస్థాయి విచారణ చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని జేసీ గోపాలకృష్ణకు సూచించారు. సదస్సులో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి అయిన ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, తహసీల్దార్ నరసింహారావు, ఎంపీడీవో జగదీష్, కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ రామయ్య చౌదరి, టీడీపీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నర్సారెడ్డి, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి రేగుల వీరనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు తుళ్లూరి నరసింహారావు, మాజీ ఎంపీపీ దాసరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అనకర్లపూడిలో 25 అర్జీలు

కొండపి: మండలంలోని అనకర్లపూడిలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అనకర్లపూడి, రేగలగడ్డపాలెం గ్రామాలకు చెందిన 25 మంది భూముల ఆన్‌లైన్, కొలతలు, ఇతర ధ్రువీకరణ పత్రాలు కోరుతూ అధికారులకు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.మురళి, ఆర్ఐ శ్రీనివాసరావు, డీటీ కాశయ్య, వీఆర్వో జి.శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ నాయకుడు కొర్రపాటి వసంతరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాచవరంలో 18

సంతనూతలపాడు: మాచవరం గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 18 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి తెలిపారు. గ్రామాల్లోని భూసమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు. కార్యక్రమంలో డీటీ మాబూసుబాని, ఆర్ఐ రామ్‌తేజ, రెవెన్యూసిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

తిమ్మసముద్రంలో 10

నాగులుప్పలపాడు: తిమ్మసముద్రం గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రెవెన్యూ సమస్యలపై 10 అర్జీలు అందినట్లు తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సర్వేయరు రత్నాకర్, ఆర్ఐ రమేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు

హాజరైన జడ్పీచైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి తదితరులు


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి, చెవిరెడ్డి, చైర్‌పర్సన్ వెంకాయమ్మ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఒంగోలులో ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబులు కేక్‌ను కట్ చేశారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ముందుగా దివంగత సీఎం వైఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నగరంలో జరిగిన పలు సేవా కార్యక్రమాల్లో నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బత్తుల బ్రహ్మానందరెడ్డి, కసుకుర్తి అదెన్న, మాదాసు వెంకయ్య, బొట్లా సుబ్బారావు, డీఎస్.క్రాంతికుమార్, కేవీ.రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, చావలి శివ, వెన్నపూస వెంకటేశ్వరెడ్డి, ఇమ్రాన్‌ఖాన్, ఆళ్ల రవీంద్రారెడ్డి, కోడూరి కిషోర్, భూమిరెడ్డి రమణమ్మ, నాగూర్, పిగిలి శ్రీనివాసరావు, రొండా అంజిరెడ్డి, పాలపర్తి సుబ్బారావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: మాజీ సీఎం జగన్మోహనరెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం మద్దిపాడులో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి మెరుగ నాగార్జున హాజరై వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. పీహెచ్‌సీలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైసీపీ మండల అధ్యక్షుడు మండల అప్పారావు, మోరబోయిన సంజీవరావు, గుడ్డపోతల రవి, పిట్టల ఆంజనేయులు, లక్ష్మీనారాయణరెడ్డి, నల్లూరి మహేష్, బొమ్మల రామాంజనేయులు, నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం సంతనూతలపాడులో వైసీపీ మండల కన్వీనర్ డి.చెంచిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. తొలుత కేక్ కట్ చేసి అనంతరం రక్తదానశిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి మేరుగ నాగార్జున హాజరై రక్తదానం చేసిన వారందరికి పండ్లు, దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు దుంపా రమణమ్మ, వేమాశ్రీను, ఎంపీపీలు యుద్ధనపూడి శ్రీను, బి.విజయ, నాయకులు యలమందారెడ్డి, కిష్టయ్య, చీమకుర్తి జవహర్ ఆసుపత్రి బ్లడ్‌బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాస రామానుజన్‌కు ఘన నివాళి


శ్రీచైతన్యలో రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


క్విస్ హైస్కూలులో విద్యార్థుల ప్రదర్శన

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం లాయర్‌పేటలోని శ్రీచైతన్య స్కూలులో శనివారం గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాసరామానుజన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులతో గణిత శాస్త్రానికి సంబంధించి వివిధ ప్రయోగాలతో ప్రదర్శనలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ జోసెఫ్ శ్రీనివాస రామానుజన్ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ అనిల్‌కుమార్, కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, డీన్ బాలసుబ్రహ్మణ్యం, వైస్‌ప్రిన్సిపాల్ శివపార్వతి, ప్రైమరీ ఇన్‌చార్జి రజనీ పాల్గొన్నారు.

క్విస్ హైస్కూలులో..

ఒంగోలు విద్య: స్థానిక క్విస్ హైస్కూలులో శనివారం ప్రముఖ గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇంగ్లీషు, తెలుగు, సోషల్ సబ్జెక్టులకు సంబంధించి 215 ప్రాజెక్టును రూపొందించి ప్రత్యేకంగా ప్రదర్శించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను క్విస్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ సూర్యకళ్యాణ్ చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రి అభినందించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమలేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రేమకు ప్రతిరూపం జీసస్ : మంత్రి స్వామి


కేక్ కట్ చేస్తున్న మంత్రి స్వామి

కొండపి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : శాంతి, ప్రేమకు ప్రతిరూపం జీసస్ అని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని పెట్లూరు పీహెచ్‌సీ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో మంత్రి పాల్గొని మాటాడారు. ఏసుక్రీస్తు జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. తొలుత ఆయన క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, పీహెచ్‌సీ డాక్టర్లు, పేముల అనూష, ఇత్తడి ప్రియాంక, వైద్యశాల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

కలికివాయి ఎస్సీ కాలనీలో..

సింగరాయకొండ: ఏసు మార్గం అనుసరణీయం అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని కలికివాయి ఎస్సీ కాలనీలో శనివారం రాత్రి నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇతరుల పై ప్రేమ, అప్యాయతను చూపాలన్నారు. అనంతరం చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి వారికి పంచిపెట్టారు. కార్యక్రమంలో పీబీ చానల్ చైర్మన్ మండలపు గాంధీచౌదరి, సుదర్శి చంటి, మించల బ్రహ్మయ్య, గణిపినేని రవి, మోటుపల్లి వెంకటేశ్వర్లు ప్రేముల బాబురావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ధ్యాన దినోత్సవం


మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

ఒంగోలు విద్య, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు చైర్మన్ శిద్దా వెంకటేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర పతంజలి యోగాపీఠ్ అధ్యక్షుడు యోగాచార్య బాలసుబ్రహ్మణ్యం, పతంజలి యోగాపీఠ్ జిల్లా అధ్యక్షుడు బోయపాటి రవి ఆధ్వర్యంలో విద్యార్థులకు ధ్యానంపై శిక్షణ ఇచ్చారని డైరెక్టర్ ఏవీ.భాస్కరరావు పేర్కొన్నారు. రాగా చీఫ్ అడ్వయిజర్ శిద్దా ప్రవల్లిక మాట్లాడుతూ ధ్యానం వల్ల మానిసిక శాంతి, ఆనందాన్ని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, కో ఆర్డినేటర్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలంలో

నాగులుప్పలపాడు: ధ్యాన దినోత్సవాన్ని వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో పలు పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఉప్పుగుండూరు, ఈదుమూడి, బి.నిడమానూరు గ్రామాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సేవా సమితి వ్యవస్థాపకులు కామిశెట్టి శంకరరావు మాట్లాడుతూ ధ్యానం ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విధిగా హెల్మెట్ ధరించాలి : మంత్రి స్వామి

టంగుటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని మంత్రి స్వామి సూచించారు. శనివారం టంగుటూరు టోల్‌ప్లాజావద్ద వాహనచోదకులకు ఆయన హెల్మెట్ వల్ల ఉపయోగాలు వివరించారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు హజరత్తయ్య, సోమశేఖర్, ఎస్సైలు నాగమల్లేశ్వరరావు, ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: హెల్మెట్ వాడకంపై పోలీసులు నాగులుప్పలపాడులో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్, ఏఎస్ఐ సుబ్బారావు, పోలీసు సిబ్బంది బైక్ ర్యాలీ నిర్వహించారు.

సంతనూతలపాడులో..


ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ అజయ్‌బాబు

సంతనూతలపాడు: ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ వి.అజయ్‌బాబు తెలిపారు. శనివారం సంతనూతలపాడులో సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు.

చీమకుర్తిలో

చీమకుర్తి: ద్విచక్రవాహనదారుల శ్రేయస్సు కోసం హెల్మెట్ వినియోగంపై శనివారం చీమకుర్తిలో సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ శివారు నుంచి మర్రిచెట్లపాలెం వరకు కర్నూల్‌రోడ్‌కు ఇరువైపులా ప్రధాన కూడళ్లలో పోస్టర్లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. బస్టాండ్ సెంటర్లో హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న వారికి పెనాల్టీలు విధించటంతో పాటు అవగాహన కల్పించారు.

క్రైం సమాచారం

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

కంభం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళుతున్న రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతిచెందిన ఘటన కంభం రైల్వేస్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకొంది. రైల్వేకానిస్టేబుల్ హరికృష్ణ కథనం ప్రకారం, సుమారు 60 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి ప్లాట్‌ఫాంకు 30 అడుగుల దూరంలో కిందపడి మృతిచెందాడు. ఆ మేరకు సమాచారం అందడంతో ఘటన స్థలానికి వచ్చి మృతుని జేబును పరిశీలించగా 20వ తేదీ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం చేయించుకున్నట్లు ఓపీ చీటి ఉందని, దానిలో జి.ప్రకాశ్ (60) అని ఉందన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతుడు గుంటూరు నుంచి ధర్మవరం వెళ్లే రైలు నుండి తెల్లవారుజామున జారిపడి ఉంటాడని భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

పెద్దదోర్నాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్సైజ్ శాఖాధికారులు శనివారం విస్తృత దాడులు నిర్వహించారు. మార్కాపురం సీఐ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. కొత్తూరు సమీప అటవీ ప్రాంతంలో అక్రమంగా నాటుసారా తయారీ చేస్తున్న స్థావరాలను అధికారులు గుర్తించారు. అక్కడ సారాతయారీకి సిద్ధంగా ఉన్న 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. తయారీకి వినియోగించే వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వంద లీటర్ల బెల్లంఊట ధ్వంసం

● 5 లీటర్ల నాటుసారా స్వాధీనం, వ్యక్తి అరెస్టు

గిద్దలూరుటౌన్ : నాటుసారా తయారీకి ఉపయోగించే వంద లీటర్ల బెల్లంఊటను ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. ఓ వ్యక్తిని అదుపులోనికి తీసుకొని 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఓబులాపురం తండా పరిధిలోని అటవీ ప్రాంతంలో నాటు సారా తయారు చేస్తున్నట్లు ఎక్సైజ్‌శాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, గిద్దలూరు ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు ఆధ్వర్యంలోని బృందం ఆ స్థావరంపై దాడి చేశారు. ఆ సమయంలో నాటుసారా తయారీకి ఉపయోగించే 100 లీటర్ల బెల్లంఊటను గుర్తించి ధ్వంసం చేశారు. నాటుసారా తయారు చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడికి న్యాయాధికారి రిమాండ్‌కు పంపినట్లు ఎక్సైజ్ సీఐ జయరావు తెలిపారు.

అవీ..ఇవీ

ఘనంగా జగన్ జన్మదినం


కేకు కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు రాంబాబు, వెంకటరెడ్డిలు

మార్కాపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గడియారస్తంభం వద్ద ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, జంకె వెంకటరెడ్డిలు కేకు కత్తిరించి వైసీపీ నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ, వైస్‌చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, చాతరాజుపల్లి అంజమ్మ, శ్రీనివాస్, మైనార్టీ విభాగం రాష్ట్రనాయకులు మీర్జా షంషీర్‌అలీబేగ్, జెడ్పీటీసీ సభ్యుడు నారు బాపనరెడ్డి, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ

ఎర్రగొండపాలెం రూరల్ : వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో. ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 500 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలలో ఎంపీపీ దొంత కిరణ్‌గౌడ్, సర్పంచ్ ఆరుణ బాయ్, మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు షేక్ జబిఉల్లా, ఒంగోలు మూర్తిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గిద్దలూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరులోని వాసవీ జాగృతి క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివపురం హరికృష్ణ, కార్యదర్శిగా కోటా కృష్ణయ్య, కోశాధికారిగా మునగనూరి సత్యనారాయణ, సీసీ ఆఫీసర్లుగా సూరె చెంచయ్య, బాదం వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఈ నెల 22న ఆదివారం ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎస్ఎస్.ప్లాజాలో నిర్వహించనున్నారు. వాసవి జాగృతి ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తిరువీది వేణు గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారన్నారు.

తీరుమారకపోతే అధికారులపై చర్యలు

● పొదిలి రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే నారాయణరెడ్డి ధ్వజం ● రైతు నుంచి వీఆర్వో అర్జీ తీసుకోకపోవడంతో ఆగ్రహం


పొదిలిలో సమ్యలు ఆలకిస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి

పొదిలి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అధికారుల తీరుమార్చుకోకపోతే శాశ్వతంగా సెలవు తీసుకుని ఇంటివద్ద ఉండాల్సి వస్తుందని ఎమ్మెల్యే కందుల నారయణరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం అన్నవరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కొత్తపులి శివారెడ్డి ఇచ్చిన భూసమస్యకు సంబంధించిన అర్జీని వీఆర్వో సామ్యేల్ తీసుకోలేదని పొదిలి రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే కందుల దృష్టికి తీసుకొచ్చారు. ఆగ్రహించిన ఎమ్మెల్యే వెంటనే వీఆర్వోను పిలి పించి రైతు ఇచ్చిన అర్జీని ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. రాష్ట్రప్రభుత్వం భూసమస్యలు పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తు న్నట్లు తెలియదా..? అని వీఆర్వోను ప్రశ్నించారు. అధికారులు ఇంకా వైసీపీ పాలనలోని జ్ఞాపకాలలో ఉన్నారని ఇదే కొనసాగితే తీవ్ర ఇబ్బందులకు గురవుతారని హెచ్చరించారు.



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ విజయభాస్కర్

ప్రజలను మభ్యపెట్టేందుకే వెలిగొండ డ్రామా

కొనకనమిట్ల : పశ్చిమప్రాంతంలోని ప్రజలను మభ్యపెట్టేందుకు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెలిగొండ డ్రామాకు తెరతీశారని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని సిద్ధవరం గ్రామంలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తికాకుండానే జాతికి అంకితం చేస్తున్నానంటూ కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసం చేశాడని విమర్శించారు.

తర్లుపాడు : భూసమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని విజయభాస్కర్ అన్నారు. మండలంలోని జంగంరెడ్డిపల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూసమస్యలపై అర్జీలను తహసీల్దార్‌కు అందజేశారు. మొత్తం 23 అర్జీలు భూ సమస్యలపై వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ, గతంలో రీసర్వే జరగడంతో ఒకరి భూములు మరొకరికి పట్టాదారు పాసుపుస్తకం కంటే ఎక్కువ, తక్కువ తప్పుల తడకగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలకు 45 రోజుల్లోపు పరిష్కరిస్తారన్నారు. కార్య క్రమంలో సర్వేయర్ సురేష్, వీఆర్వోలు, ఈవోఆర్డీ సుకుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్


ఫుడ్ ఫెస్టివల్‌కు హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 21 ఆంధ్రజ్యోతి: స్థానిక వాసవి విద్యానికేతన్‌లో శనివారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఎంతో ఆకట్టుకుంది. పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ కె.రంగయ్య, ఏవో రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ భారీ ఫుడ్ ఫెస్టివల్ పట్టణ ప్రజలు, తల్లిదండ్రులను ఎంతో ఆకట్టుకుంది. ముఖ్యఅతిథిలుగా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ వక్కలగడ్డ రాధిక, ఎంఈఓ శర్వాణిలు పాల్గొని వివిధ వంటకాల గురించి అడిగితెలుసుకున్నారు. ఇటువంటి ప్రదర్శనల వలన విద్యార్థులకు ఆరోగ్యకరమైన పోషక విలువలు తెలుస్తాయన్నారు. బయట వండిన వంటలకు కాకుండా ఇళ్లల్లో వండిన వంటలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం నేర్చుకుంటారన్నారు. 210 రకాల వంటకాలు విద్యార్థులు ప్రదర్శించారు.

కంభం నీటిసంఘం చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం

నియామక పత్రాలు అందజేసిన సబ్‌కలెక్టర్


ఆదినారాయణకు నియామక పత్రం అందచేస్తున్న సబ్‌కలెక్టర్

కంభం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కంభం నీటిసంఘం చైర్మన్‌గా పార్సా ఆదినారాయణ, వైస్‌చైర్మన్‌గా నన్నెబోయిన వెంకటలక్ష్మిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కంభం ఎంపీడీవో కార్యాలయంలో మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకటత్రివినాగ్ సమక్షంలో జరిగిన ఈ ఎన్నికల్లో చిన్నకంభం తూము కాలువ అధ్యక్షుడు పార్సా ఆదినారాయణ, చీతిరాల కతువ, నక్కలగండి, పాపాయిపల్లె, పెద కంభంతూము కాలువల అధ్యక్షులు వెంకట రాజు, దండూరి ఆదినారాయణ, శ్రీరామ్ సత్యవతి, నన్నెబోయిన వెంకటలక్ష్మి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ త్రివినాగ్ మాట్లాడుతూ నీటిసంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ఐదుగురి నుంచి ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకోవాల్సి ఉంటుందని నామినేషన్లు ఇవ్వాల్సిందిగా కోరారు. చైర్మన్ అభ్యర్థిగా పార్సా ఆదినారాయణ, వైస్ చైర్మన్ అభ్యర్థిగా నన్నెబోయిన వెంకటలక్ష్మిలు పత్రాలు అందజేశారు. మిగిలిన సభ్యులు బలపరచడంతో వారి రువురు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సబ్‌కలెక్టర్ ప్రకటించి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్‌చైర్మన్లు మాట్లా డుతూ తమపై నమ్మకంతో పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎంపికయ్యేలా కృషి చేసిన ఎమ్మె ల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు తోట వెంకటశ్రీనివాసులు, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర నాయకులు గోన చెన్నకేశవులు, హెచ్‌గూడెం షబ్బీర్, శ్రీనివాసులు, తోట శ్రీనివాసులు, టీడీపీ మండల కార్యదర్శిఆరేపల్లి మల్లికార్జునరావు, మాజీ సర్పంచ్ కోటయ్య, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను కంభం తహసీల్దార్ కిరణ్, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు పర్యవేక్షించారు.

హెల్మెట్ ధారణతో వాహనదారుల కుటుంబాలకు భద్రత


బైకు ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

గిద్దలూరుటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం ద్వారా వారి కుటుంబాలకు భద్రత ఉన్నట్లు అవుతుందని గిద్దలూరు అర్బన్ సీఐ కె.సురేష్ అన్నారు. హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధులలో కొనసాగింది. రాచర్లగేటు కూడలిలో పోలీసులు మానవహారంగా ఏర్పడ్డారు. అర్బన్ సీఐ సురేష్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించి వాహనాలు నడుపడం వలన కలిగే ఉపయోగాలను వివరించారు. హెల్మెట్ ధరించకుండా అనేక మంది వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఇక హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఇప్పటికే ఆదేశించినట్లు తెలిపారు. ర్యాలీలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గణిత మేధావి రామానుజన్


రామానుజన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పవన్‌కుమార్

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గణిత శాస్త్ర పరిశోధనలో ప్రపంచంలో భారత దేశానికి ప్రత్యేక స్థానం కల్పించిన గణిత మేధావి రామానుజన్ అని కమలా విద్యా సంస్థల అధినేత పెనుగొండ పవన్‌కుమార్ అన్నారు. స్థానిక కమలా కాన్సెప్ట్ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రతిభ పరీక్ష, క్విజ్, మ్యాథ్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జేసీ

త్రిపురాంతకం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విశ్వనాధపురంలో పొగాకు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ శనివారం సందర్శించారు. ఈసందర్భంగా సిబ్బంది, నిర్వాహకులతో మాట్లాడారు. రైతులందరూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తమ ధాన్యాన్ని తెచ్చుకుని విక్రయించుకోవాలని సూచించారు. రైతులు తెచ్చే ధాన్యం తేమ 17 శాతంలోపు ఉండేలా చూసుకోవాలన్నారు. దళారులను నమ్మవద్దని తెలిపారు. కనీస మద్దతు ధర రైతులకు అందుతుందని, 24 గంటల లోపే రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ అవుతుందని అన్నారు. పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మిరప తోటలను పరిశీలించిన అధికారులు


మిరపతోటలను పరిశీలిస్తున్న అధికారులు

బేస్తవారపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒందుట్ల, వంగపాడు గ్రామంలోని మిరప తోటలను ఉద్యానశాఖ సహాయ సంచాలకులు గోపి చంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో మిరప పైరుకు ప్రభుత్వం దిగుబడి ఆధారిత పంటల బీమాను అమలు చేస్తుందన్నారు.జిల్లాకు సంబంధించి ఐసీఐసీఐ లాంబర్డ్ జనరల్ ఇన్స్‌రెన్స్ కంపెనీ ద్వారా పంటలబీమా అమలుచేస్తోందన్నారు. ఈ పథకంలో ప్రీమియం రూ.525 రైతులు చెల్లించాలన్నారు. పంటకోత ప్రయోగాలు నిర్వహించి దిగుబడి తగ్గినట్లు నిర్ధారణ అయితే రైతుకు హెక్టారుకు రూ.105,000 వరకు బీమాను కంపెనీ చెల్లిస్తుందన్నారు. ఈనెల 31వ తేదీ వరకు రైతులు ప్రీమియం చెల్లించవచ్చన్నారు. మిరపలో నల్ల తామర పురుగు వలన జరిగే నష్టాల నివారణకు తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉద్యానశాఖ అధికారి డి.శ్వేత పాల్గొన్నారు.

బీమా గడువు పొడిగింపు

గిద్దలూరు : ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రబీ సీజన్‌లో మిరప సాగు చేసిన రైతులు నెలాఖరులోగా బీమా ప్రీమియం చెల్లించ వచ్చని ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. మిరప సాగు చేసే రైతులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

సుందరయ్య కాలనీవాసులకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల హామీ


నీటి సరఫరాకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దదోర్నాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దోర్నాలలోని సుందరయ్య కాలనీ వాసులకు నీటి సరఫరా చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. ట్యాంకరుతో చేసే నీరు అవసరాలకు సరిపోవడం లేదని పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న పెద్దట్యాంకు నుంచి నీటిని సరఫరా చేయాలని శుక్రవారం కాలనీవాసులు ఆందోళన నిర్వహించారు. ఈ క్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఏఈ భ్రమరాంబికాదేవి పరిశీలించారు. తగిన ఏర్పాట్లు చేసి కొద్ది రోజుల్లోనే నీటిని సరఫరా చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శివ కోటేశ్వరరావు, సచివాలయం ఇంజనీరు శేషారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలి



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

గిద్దలూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సర్దుబాటు చార్జీలను, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయవద్దని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం గిద్దలూరులో ఆ పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు టి.ఆవులయ్య మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా విద్యుత్ సర్దుబాటు చార్జీలు, ట్రుఅప్ చార్జీలు రద్దు చేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి రాగానే దాదాపు రూ.20వేల కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై మోపారని ఆరోపించారు. పెంచిన ట్రూ అప్ చార్జీలను ప్రభుత్వమే భరాయించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్‌మీటర్లను కూడా రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నరసింహులు, మూర్తి, వివిధ సంఘాల నాయకులు పూర్ణ, లక్ష్మీనారాయణ, బాబూరావు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం


వై.పాలెంలో పరిసరాలు శుభ్రం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మన గ్రామాన్ని మనం పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉంచుకోవాలని అలా ఉన్నపుడే గ్రామం అభివృద్ధి చెందుతుందని గ్రామసర్పంచ్ రామావత్ ఆరుణబాయ్ అన్నారు. మెగా శానిటేషన్ డే సందర్భంగా శనివారం పట్టణంలోని పలువీధులలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీధులను శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఈదుల రాజశేఖరరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి, వేగినాటి శ్రీనివాస్, వార్డుసభ్యులు చేదూరి కిషోర్, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, వాసవిక్లబ్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ గోళ్ల వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

కొమరోలు : పచ్చదనంతోనే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని ఉపాధ్యాయుడు విశ్వరూప ఆచారి అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శనివారం 'క్లీన్ ఆండ్ గ్రీన్' కార్యక్రమాన్ని విద్యార్థులు ఉపాధ్యాయులు చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విశ్వరూపాచారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు పారిశుధ్యం, పచ్చదనం కార్యక్రమాలు చేపట్టామన్నారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలసి పరిసరాల్లోని చెత్తా, చెదారాన్ని శుభ్రపరిచారు. అవసరమైన ప్రదేశాల్లో చెట్లను నాటారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు పుల్లయ్య, రామాంజి, వీరనారాయణ, అంజిలు పాల్గొన్నారు.

తర్లుపాడు : స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల వద్ద 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమం నిర్వహించారు. మండలం లోని వీఆర్ఏలు ఆవరణలో ఉన్న పిచ్చిచెట్లను తొలగించారు. పిచ్చిచెట్లు ఎక్కువగా ఉండటంతో విషపురుగులు వస్తున్నా యని ప్రజలు, సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం పిచ్చిమొక్కలు తొలగించడంతో ఆవరణం అంతా పరిశుభ్రంగా ఉంది. ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు రఫీ, షేక్షావలి, చెన్నయ్య, కిశోర్, కేశవ, వెంగయ్య పాల్గొన్నారు.

ఘనంగా వినియోగదారుల దినోత్సవం

గిద్దలూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవం గిద్దలూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాలలు, సూర్య విద్యా నికేతన్, సాయిటెక్నో హైస్కూలు విద్యార్థులు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వినియోగదారుల చట్టాల ప్రాముఖ్యతల గురించి వివరించారు. వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక వినియోగదారుల హక్కు ల పరిరక్షణ సమితి అధ్యక్షులు వి.వీరారెడ్డి, కార్యదర్శి టి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి.శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీని నెరవేర్చాలి

● కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా డిమాండ్


మాట్లాడుతున్న షేక్ సైదా

మార్కాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రధానంగా మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా వెలుగొండ ప్రాజెక్టు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ రెండింటి విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు జిల్లాకు వచ్చిన ప్రతిసారీ హామీ ఇచ్చారన్నారు. ఆరు నెలలు కావస్తున్నా కూటమి ప్రభుత్వం ఆ దిశగా ముందడుగు వేయడంలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరై నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ పనులను ప్రభుత్వమే చేపట్టి పూర్తి చేయాలన్నారు. పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వారికి అప్పజెప్పేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. దీని వలన ఈ ప్రాంత పేద, మధ్య తరగతి ప్రజలకు ఒరిగేదేమిలేదన్నారు. అంతేకాక సూపర్ సిక్స్ పథకాలైన అమ్మకు వందనం, రైతుకు రుణసాయం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం తదితరాలు పెండింగ్‌లోనే ఉన్నాయని వాటిని వెంటనే అమలు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు తిరుమలశెట్టి రామయ్య, రెహనాబాను, షేక్ మతీన్, నిశనం ఇమ్మానియేల్, సుభాని, ఇస్మాయిల్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్యానోత్సవం


యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని సాయిబాలాజీ ఉన్నత పాఠశాలలో వరల్డ్ మెడిటేషన్ దినోత్సవం శనివారం నిర్వహించారు. యోగా గురువు రవి మాట్లాడుతూ.. విద్యార్థులలో ఏకాగ్రత పెరగడానికి యోగా అద్భుతమైన సాధనం అన్నారు. శ్వాస మీద ధ్యాస నియంత్రించాలి అనే అంశాలు వివరించారు. ప్రిన్సిపాల్ సయ్యద్ మస్తాన్‌వలి, కరస్పాండెంట్ ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ ధ్యానోత్సవం నిర్వహించారు. ఎంఈవో శర్వాణి మాట్లాడుతూ.. ధ్యానం ఒత్తిడిని తగ్గించి ఆలోచనలను శ్రేష్ఠతవైపు నడిపిస్తుందన్నారు.

కృష్ణయ్యను కలిసిన గణేష్‌సింగ్


కృష్ణయ్యను సన్మానిస్తున్న గణేష్‌సింగ్

పుల్లలచెరువు, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి) : రాజ్యసభ సభ్యుడిగా రెండవసారి ప్రమాణస్వీకారం చేసి హైదారాబాద్‌కు వచ్చిన, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను పుల్లలచెరువు మండలం మర్రివేముల గ్రామానికి చెందిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏపీ యువజన ఉపాధ్యక్షుడు, జాతీయ బీసీ జన సంక్షేమ సంఘం అధ్యక్షుడు కత్రి గణేష్‌సింగ్ శనివారం హైదారబాద్‌లో కలిశారు. ఆయనను సన్మానించారు.



శిశు ఆధార్ ఏర్పాట్లుచేస్తున్న మెడికల్ అధికారి డాక్టర్ ప్రవీణ

సీహెచ్‌సీలో శిశు ఆధార్ కేంద్రం ఏర్పాటు

పామూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో శిశు ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.ప్రవీణ తెలిపారు. శిశు ఆధార్ నమోదు నిర్వాహకులు రఫితో శనివారం ఆమె చర్చించారు. 5 సంవత్స రాలలోపు పిల్లలకు వైద్యశాలలో ఉచితంగా ఆధార్ నమోదు చేస్తున్నట్లు డాక్టర్ ప్రవీణ తెలిపారు. ఇందుకోసం పుట్టినతేదీ సర్టిఫికెట్, మొబైల్‌లింక్ అయిన తండ్రి లేదా తల్లి ఆధార్ కార్డు తీసుకురావాలని తెలిపారు. పామూరు, పరిసర ప్రాంతాలప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రాజెక్టు చైర్మన్‌ను సన్మానించిన కంచుమాటి

ముండ్లమూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రాజెక్టు చైర్మన్‌గా శనివారం నియమితులై ప్రమాణ స్వీకారం చేసిన పులుకూరి కాంతారావును మండలంలోని మోదేపల్లి డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు సన్మానించి బొకే అందజేశారు. కార్యక్రమంలో రజా నగర్ డీసీ చైర్మన్ చందాడి సుబ్బారావు, మాజీ డీసీ చైర్మన్ గంగినేని శేషగిరిరావు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల లైసెన్స్ పత్రాల తనిఖీ



ఆటో డ్రైవర్ల పత్రాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ కిశోర్‌బాబు

పామూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆటోలు నడిపే డ్రైవర్లందరూ తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగిఉండాలని ఎస్‌ఐ టి.కిశోర్‌బాబు సూచించారు. పట్టణంలో ఆటో పత్రాల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. లైసెన్స్‌లు లేని పలుఆటోలను స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశారు. వాహన ఇన్సూరెన్స్ పత్రాలను రెన్యువల్ చేయించుకోవాలని ఎస్‌ఐ తెలిపారు. పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కించుకోరాదని, మైనర్లను డ్రైవర్లుగా పెట్టుకోరాదని తెలిపారు.

పొగాకు బ్యారెన్ దగ్ధం

ముండ్లమూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ళ గ్రామంలో సుంకర చిన బ్రహ్మానందరెడ్డి, రమణారెడ్డిలకు చెందిన పొగాకు బ్యారెన్ శనివారం ఉదయం ప్రమాద వశాత్తు అగ్నికి ఆహుతైంది. భూకంపం దాటికి బ్యారెన్‌లో పొగాకు కర్రలు కిందపడటంతో మంటలు చెలరేగి 1100 పొగాకు కర్ర దగ్ధమైంది. దాదాపు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు.

నేడు బీసీ హాస్టల్ ప్రారంభం

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని సి నాగులారం గ్రామంలో రూ.70 లక్షలతో నిర్మించిన ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని ఆదివారం ప్రారంభిస్తున్నట్లు జీవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు. ఉగ్రనరసింహారెడ్డి, కలెక్టర్ అన్సారియా, ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజి, బీసీ సంక్షేమశాఖ ఏడీ డి.చంద్రశేఖర్, ఎం. అంజల, షేక్ జబ్బార్‌లు పాల్గొంటున్నట్లు ఇన్‌చార్జి వార్డెన్ పి.వెంకటేశ్వర్లు తెలిపారు.

ఆదమరిస్తే.. అంతే సంగతులు

- కురిచేడు-ఆవులమంద రోడ్డులో ప్రమాదకరంగా కల్వర్టు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



కొత్తూరు చెరువు వద్ద దెబ్బతిన్న కల్వర్టు

కురిచేడు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కురిచేడు-ఆవులమంద రోడ్డులో కొత్తూరు గ్రామం వద్ద కల్వర్టు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నా అధికారులు పట్టించుకోకపోవండతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

కురిచేడు నుంచి ఆవులమంద గ్రామం వెళ్లే దారిలో కొత్తూరు వద్ద చెరువును రెండు భాగాలుగా విభజించి ఆర్‌అండ్‌బి రోడ్డు నిర్మించారు. రెండు చెరువుల మధ్య నీరు పారేందుకు అనుకూలంగా కల్వర్టు నిర్మించి పైపులు వేశారు. కాలక్రమేణా కల్వర్టు, పైపులు దెబ్బతిని రోడ్డు కోతకు గురైంది. దీంతో కల్వర్టు ఉన్న చోట రోడ్డు కుంచించుకుపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

రాత్రి సమయాలలో వాహనాలు ఎదురెదురుగా వస్తే కల్వర్టు వద్ద ప్రమాదాలకు గురవుతున్నాయి. పలుమార్లు ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. కల్వర్టు నిర్మించి ప్రమాదాలు జరుగకుండా చూడాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించినా ఫలితం లేదు. ఇప్పటికైన స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కుంట పోరంబోకు భూమికి కంచె ఏర్పాటు

- ఆక్రమణలకు గురికాకుండా అధికారుల చర్యలు



కుంటపోరంబోకు భూమి ఆక్రమణకు గురికాకుండా కంచె ఏర్పాటుచేస్తున్న రెవెన్యూ అధికారులు

దర్శి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా రెవెన్యూ అధికారులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అనేక ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఓ వైసీపీ నాయకుడు కుంటపోరంబోకు భూమికి ఫొజిషియన్ సర్టిఫికెట్ తీసుకొని స్వాహాచేసే యత్నం చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో కుంటపోరంబోకు భూమి స్వాహాయత్నాలపై ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమయ్యాయి. అధికారులు స్పందించి రికార్డులు పరిశీలించి ఫొజిషియన్ సర్టిఫికెట్లు ఇచ్చినట్లు ధ్రువీకరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ సర్టిఫికెట్లు ఇచ్చినట్లు తెలుస్తుంది

దర్శి రెవెన్యూలోని 450/8 సర్వేనెంబర్‌లో 33 సెంట్ల కుంటపోరంబోకు భూమి ఉంది. దర్శి-తూర్పుగంగవరం ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న ఈ కుంట భూమి విలువ రూ.3 కోట్లకు పైగా ఉంటుంది. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఓవైసీపీ నాయకుడు అప్పటి అధికారులకు భారీ మొత్తంలో ముడుపులు చెల్లించి కుంట భూమికి ఫొజిషియన్ సర్టిఫికెట్ తీసుకున్నాడు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో డొంక కదిలింది. తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కు మార్ సిబ్బందితో వెళ్లి శనివారం ఆ స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణకు గురికాకుండా కంచె ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో విలువైన కుంట భూమికి గతంలో ఫొజిషియన్ సర్టిఫికెట్లు కొంత మంది తీసుకున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం కుంట భూమికి ఇవి ఇవ్వకూడదు. కుంట భూమిని ఆక్రమణకు గురికాకుండా పటిష్ట పర్చామన్నారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారులకు సమాచారం అందించి వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

రెవెన్యూ సదస్సుల ద్వారానే భూసమస్యల పరిష్కారం

ముండ్లమూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్ అన్నారు. మండలంలోని కెల్లంపల్లిలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు అర్జీలు అందజేశారు.

ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్న రైతులు గ్రామసభల్లో అర్జీలు ఇచ్చినట్లయితే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానంగా భూముల సరిహద్దులు, విస్తీర్ణం తగ్గటం, రికార్డుల్లో తప్పులు ఉంటే సరిచేస్తున్నట్లు శ్రీకాంత్ చెప్పారు.

కార్యక్రమంలో మండల సర్వేయర్ కోటం రాజు, వీఆర్‌వోలు నాగేశ్వరరావు, సీహెచ్ బ్రహ్మతేజ, రాఘవరెడ్డి, సుజాత, ఎంపీటీసీ యోగేశ్వరి, మాజీ సర్పంచ్ నిడమానూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ భూములు మంజూరు చేయాలి

పామూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సెంటు భూమి లేని తమకు వ్యవసాయ భూములను మంజూరుచేసి ఆదుకోవాలని గ్రామానికి చెందిన గిరిజన మహిళలు తహసీల్దార్ బీవీ రమణారావుకు వినతి పత్రం అందజేశారు. మండలంలోని అయ్యన్నకోట గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వివిద సమస్యలపై ఏడు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఎం. పానకాలరావు, ఈవో నరసింహబాబు, ఎంఆర్‌ఐ బి.మల్లికార్జునరావు, మండల సర్వేయర్ స్నేహ, వీఆర్వో మహ్మద్ రఫి, నీటి సంఘం అధ్యక్షుడు తుమ్మ అంజనేయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ముండ్లమూరు: కెల్లంపల్లిలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్

ఇసుకను తోడేస్తున్నారు..

- చెరువుమేటనూ వదలని అక్రమార్కులు
- చోద్యంచూస్తున్న అధికారులు



నాగులచెరువు ప్రాంతంలో అక్రమంగా ఇసుక మేట తవ్వకాలు

కనిగిరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. నెల్లూరు ప్రాంతం నుంచి సీనరేజ్‌కు ఎగనామం పెట్టి అక్రమమార్గంలో ఇసుక రవాణా జరుగుతుంది. మరోపక్క, కనిగిరి ప్రాంతంలోని చెరువు, అలుగువాగు మేటలనూ వదలకుండా ఇసుకను తోడేస్తూ ప్రభుత్వ విధానాలకు తూట్లు పొడుస్తున్నారు. గత వైసీపి ప్రభుత్వంలో ఇసుక అక్రమ వ్యాపారంలో అడ్డేలేకుండా సాగించినవారికి ప్రభుత్వం మారినా వారిదే పైచేయిలా సాగుతుంది. వైసీపీ నేతలు వెనుకుండి వారి అనుయాయులను కూటమి పార్టీల్లో తిప్పుతూ అక్రమ వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్ అధికారులు కళ్ళప్పగించి చూస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

కనిగిరి ప్రాంతంలోని నాగులచెరువు, చినిర్లపాడు, పునుగోడు, ఏరువారిపల్లి, బొమ్మిరెడ్డిపల్లి, తాళ్లూరు, యడవల్లి, దిరిశవంచ, కమ్మవారిపాలెం, కంచర్లవారిపల్లి, గ్రామాల్లోని అలుగు వాగులు, పీసీపల్లి మండలంలోని అలవలపాడు, గుదేవారిపాలెం, రామాపురం, మర్రిపూడి మండలం నర్సాపురం ప్రాంతాల్లో ఇసుక మేటను తవ్వుతూ అక్రమ మార్గంలో అమ్మకాలు సాగిస్తున్నారు.

ఉచితంగా ఇసుకను అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రూపొందించిన విధానాలు అక్రమార్కులకు కలిసొచ్చింది. సామాన్యులకు ఇసుక బంగారంగా మారింది. నెల్లూరు ప్రాంతం నుంచి టర్బో లారీల్లో 36 టన్నుల వరకు రవాణా సాగిస్తున్నారు. అక్కడి నుంచి కనిగిరికి డంపింగ్ చేసి ట్రాక్టర్ రూ.5 వేలకు పైగా అమ్ముతున్నారు. గత్యంతరం లేక నిర్మాణదారులు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని నిర్మాణదారులు కోరుతున్నారు.

విద్యార్థులు గణితశాస్త్రంలో రాణించాలి

కనిగిరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గణితశాస్త్రంలో విద్యార్థులు రాణించాలని ఎస్‌ఐ టి.శ్రీరాం అన్నారు. పట్టణంలోని ఐకిడ్స్ స్కూల్‌లో శనివారం గణితశాస్త్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులు పలు గణిత ప్రయోగాలు ప్రదర్శించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత శ్రీరామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన గణిత ప్రయోగాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గణితశాస్త్రంలోని తేలికపాటి పద ప్రయోగాలతో విజ్ఞానాన్ని పొందవచ్చునని చెప్పారు. గణితం అంటే విద్యార్థుల్లో భయాందోళన ఉంటుందన్నారు. సరళతరమైన గణిత బోధనతో విద్యార్థుల్లో మక్కువ పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈసందర్భంగా గణిత ప్రయోగాలు ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయిని ఐనా మాధవి, సాజిదా, సుమైనా, వరలక్ష్మి, సుమ, కావ్య, పూజిత, జబీనా, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు ప్రదర్శించిన గణిత ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ శ్రీరాం

పామూరులో..

పామూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ మార్క్ హైస్కూల్‌లో శనివారం జాతీయ గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ఎం. జయకుమార్ మాట్లాడుతు రామానుజన్ స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. రామానుజన్ చిత్రపటానికి విద్యార్థులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో మస్తాన్, హుసేన్ బాషా, శ్రీనివాసులు, యశోదరెడ్డి, శిరిషా, తదితరులు పాల్గొన్నారు.

'మోపాడు' అభివృద్ధికి తోడ్పాటునందించాలి

పామూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మోపాడు ప్రాజెక్టు అభివృద్ధికి రైతులందరూ సమిష్టిగా ఉండి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని మోపాడు రిజర్వాయర్ వద్ద ప్రాజెక్టు చైర్మన్, వైస్‌చైర్మన్‌ల ఎన్నికను ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ విజయ భాస్కర్‌రెడ్డి సమక్షంలో శనివారం నిర్వహించారు. ప్రాజెక్టు చైర్మన్‌గా చుంచు కొండయ్య, వైస్ చైర్మన్ ఎం.నరసింహారావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆర్డీవో ప్రకటించి నియామక పత్రం అందజేశారు. అనంతరం మోపాడు ప్రాజెక్టు చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు రిజర్వాయర్ పరిధిలోని బొట్లగూడూరు, తూర్పుకట్టకిందపల్లి, నెల్లూరు జిల్లా పరిదిలోని నీటి సంఘాల చైర్మన్‌లు కమ్మ ప్రసాద్, పసుపులేటి గురుస్వామి, దాసరి అశోక్‌లను నాయకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్, జి.దశరథరామయ్య, నీరుకట్టు హరిప్రసాద్, పి.చంద్రబాబు, బొల్లా నరసింహారావు, షేక్ ఖాజారహంతుల్లా, కోట చినవెంకటేశ్వర్లు, ఎం.గిద్దయ్యయాదవ్ ఆర్.కోటేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే, ఎం.హుసేన్‌రావు, మన్నం రమణయ్య పచ్చవ బాబు, పి.పేరయ్య, గోళ్ల మాల్యాద్రి నాయుడు, ఏ.నరసింహులు, శశి మహేశ్వరరావు, కొలూరి ఖాజారహంతుల్లా, డి.మాల్యాద్రి, ఏలూరి నరసింహారావు, జి.వీరబాబు, ఇర్రి కోటిరెడ్డి, జి.శ్రీనివాసులు, ఖాజా మస్తాన్, ఏఈ ప్రసాద్, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.



ప్రాజెక్టు చైర్మన్ కొండయ్యకు నియామక పత్రం అందజేస్తున్న ఆర్డీవో కేశవర్ధనరెడ్డి

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న ఎంపీడీవో సుందరరామయ్య, ఐ.శ్రీనివాసరెడ్డి తదితరులు

తాళ్లూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నిత్యం గ్రామాల్లోని చెత్తాచెదారాన్ని తొలగిస్తూ, మురుగు కాలువలను శుభ్రం చేస్తూ గ్రామాలను శుభ్రతగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికుల కష్టాన్ని గుర్తించి టీడీపీ నేత ఐ.శ్రీనివాసరెడ్డి దుస్తులు పంపిణీ చేయటం అభినందనీయమని ఎంపీడీవో కె.సుందరరామయ్య అన్నారు. స్థానిక రైతు సేవాకేంద్రంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి నేతృత్వంలో ఐ.శ్రీనివాసరెడ్డి, ప్రశాంతి కుటుంబీకులు సొంత నిధులతో గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, స్వీపర్లు, వాచ్‌మెన్‌లను సత్కరించి దుస్తులు అందజేశారు. ముందుగా సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల చార్లెస్ సర్జన్, పంచాయతీ కార్యదర్శి ఐవీ రమణారెడ్డి, ఐ.సుబ్బారెడ్డి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు సుజాత, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాగా, స్థానిక ఎంపీపీ సమావేశం హాలులో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసరావు, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, సీడీపీవో భారతి, తదితరులు పాల్గొన్నారు.

కాల్వల ఆక్రమణలతో రోడ్లపై మురుగునీరు



మురుగుకాల్వల ఆక్రమణలను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డి

తాళ్లూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరులోని రజానగరం రోడ్డు వెళ్లే మార్గంలో సైడు కాలువను ఆక్రమించటం వల్ల మురుగునీరు రోడ్లపైకి చేరుతుంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఐవీ రమణారెడ్డి శనివారం పరిశీలించారు. ఈమార్గంలో కాలువలను పూడ్చి ఇళ్లలోని మురుగు నీటినంతా రోడ్లపై పోస్తున్నారు. రోడ్డుపై మురుగు నీరు చేరడంతో ఆమార్గంలో వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను టీడీపీ నేత ఐ.శ్రీనివాసరెడ్డి పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసువెళ్లారు. ఆప్రాంతాన్ని పరిశీలించి గృహ యజమానులపై పంచాయతీ కార్యదర్శి ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు మార్జిన్‌లో కాలువలను తీయించి మురునీటి సమస్య ఇబ్బందులు తొలగిస్తామని ఆయన తెలిపారు.

రజకుల అభివృద్ధికి పాటుపడాలి

పామూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రజకుల సాధికారిక అభివృద్ధికి పాలకులు పాటుపడాలని పామూరుకు చెందిన రజక సాధికారిక కమిటీ జిల్లా కన్వీనర్ ఆరెకొండ హరిప్రసాద్ పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రజకుల ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం 15 మంది సభ్యులతో రజక కార్పొరేషన్ ఏర్పాటుచేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈసందర్భంగా గుంటూరు ఎమ్మెల్యే మాధవి, ఎమ్మెల్సీ దువ్వరపు రామారావులను రాష్ట్ర కన్వీనర్ గురవుశాల రామకృష్ణతో కలిసి శాలువలతో ఘనంగా సత్కరించినట్లు హరిప్రసాద్ తెలిపారు.

అలాగే, టీడీపీ రజక సాధికార కమిటీ దర్శి నియోజక వర్గ కన్వీనర్ పూరిమెట్ల యల్లయ్య ఎమ్మెల్యే మాధవిని కలసి సన్మానించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో పారిశుధ్య కార్యక్రమం చేపట్టిన అధికారులు

దొనకొండ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం చేపట్టారు. ఎంపీడీవో ఎం.శ్రీదేవి, ఈవోఆర్డీ షేక్ ఆదామ్‌షఫీ, గ్రామ కార్యదర్శులు పి.కృష్ణమూర్తి, మన్నె శ్రీనివాసరావు పారిశుధ్య కార్మికులతో కలిసి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ముండ్లమూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లులో బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ రూ.3 లక్షలతో ఏర్పాటుచేసిన ఆర్‌వో ప్లాంట్‌ను శనివారం జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిధుల కోసం ఎదురు చూడకుండా గ్రామాల్లో తమ ట్రస్ట్ నుంచి ప్రజల దాహార్తి తీర్చటం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించటం జరుగుతుందన్నారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా అభిమానులు ఏర్పాటుచేసిన కేక్‌ను కట్ చేశారు.

కార్యక్రమంలో జడ్పీటీసీ తాతపూరి రత్నంరాజు, ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మానందరెడ్డి, మాజీ సర్పంచ్ చింతా శ్రీనివాసరెడ్డి, ఉపసర్పంచ్ బిజ్జం జ్యోతి కృష్ణారెడ్డి, సూదిదేవర అంజయ్య, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు మోడల్ పేపర్లు పంపిణీ



మోడల్ పేపర్లను పంపిణీ చేస్తున్న ఎంఈవో ప్రసాదరావు

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండల కేంద్రంలోని కేజీబీవీ పదో తరగతి విద్యార్థినులకు యూటీఎఫ్ ప్రచురించిన మోడల్ పేపర్లను ఎంఈవో జె.ప్రసాదరావు శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించేలా ప్రణాళికలు రూపొందించుకొని లక్ష్యాన్ని సాధించాలని ఆయన సూచించారు.

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ రేష్మ, యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. వెంట్రామయ్య, షేక్ సాదుషా, తదితరులు పాల్గొన్నారు.



కుంభమేళాకు ప్రత్యేక రైలు

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జనవరిలో జరగనున్న కుంభమేళాకు గుంటూరు నుంచి ప్రత్యేక రైలుని ఏర్పాటు చేసినట్లు డీఆర్ఎం రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07701 గుంటూరు - అజాంగడ్ రైలు జనవరి 24(శుక్రవారం) రాత్రి 11 గంటలకు గుంటూరులో బయల్దేరి 26న ఉదయం 6.20కి ప్రయాగ్‌రాజ్, మధ్యాహ్నం 12 గంటలకు బనారస్(వారణాసి), సాయంత్రం 5.15 గంటలకు అజాంగడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో నంబరు. 07702 అజాంగడ్ - గుంటూరు రైలు జనవరి 26(ఆదివారం) రాత్రి 7.45కి బయలుదేరి 11.20కి బనాసర్, 27న వేకువజామున 4 గంటలకు ప్రయాగ్‌రాజ్, 28న ఉదయం 9 గంటలకు గుంటూరు చేరుకుంటుంది.



బహిరంగ.. సిట్టింగ్‌లు

- ఖాళీ స్థలాలూ మద్యపాన కేంద్రాలు
- గంజాయి గుంపులతో భయానక పరిస్థితి
- మహిళలు, విద్యార్థినుల్లో భయాందోళనలు
- రోడ్లు, కూడళ్లలో మందుబాబుల హల్‌చల్

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, ఖాళీ స్థలాలు, పార్కులు, గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో పగలు, రాత్రి అన్న తేడా లేకుండా మందుబాబుల సిట్టింగ్‌లతో సందడిగా మారుతున్నాయి. ఆ పరిసరాల వైపు పురుషులు కూడా వెళ్లేందుకు భయపడుతుంటారంటే మందుబాబుల హల్‌చల్ ఏ స్థాయిలో ఉంటుందో తెలుసుకోవచ్చు. గత వైసీపీ ప్రభుత్వంలో విడతల వారీ మద్యపాన నిషేధం పేరుతో తీసుకువచ్చిన మద్యం పాలసీతో గతంలో రహస్యంగా సాగిన మద్యపానం రోడ్డెక్కింది. అప్పటి ప్రభుత్వంలో ప్రారంభమైన బహిరంగ మద్యపాన అరాచకం కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతోంది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పర్మిట్ రూములను వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడంతో మొదలైన బహిరంగ మద్యపానం నేడు అతి పెద్ద సామాజిక సమస్యగా రూపుదాల్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీ ఈ ప్రమాదాన్ని అరికడుతుందని అంతా భావించారు కానీ.. నేటికీ ఈ సామాజిక జాఢ్యం ప్రజలను వెంటాడుతోంది. 2019కి ముందు వరకూ మద్యం దుకాణాలు ప్రైవేటు యాజమాన్యాల కింద ఉండేవి. అప్పట్లో మందుబాబులకు షాపు నిర్వాహకులే పర్మిట్ రూములను ఏర్పాటు చేసేవారు. ఆ కారణంగా వారంతా ఆ షాపులోనే మద్యం తాగి ఇళ్లకు వెళ్లేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం ప్రైవేటు వైన్స్‌ను రద్దు చేసి ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేసింది. దీంతో అప్పటి వరకూ నాలుగు గోడల మధ్య ఉండే మద్యపాన వ్యవహారం వీధుల్లోకి వచ్చిపడింది. కూటమి ప్రభుత్వం తిరిగి పాత విధానాన్ని ప్రవేశపెట్టినా బహిరంగ మద్యపానాలు మాత్రం గతంలో మాదిరిగానే కొనసాగుతున్నాయి. ఎక్కడంటే అక్కడ మద్యం అందుబాటులోకి రావడంతో మందుబాబులు ఎక్కడికక్కడే సిట్టింగ్ వేస్తున్నారు. దర్జాగా రోడ్ల సమీపంలోనే బైఠాయించి నిస్సంకోచంగా మద్యం తాగుతున్నారు. పట్టణాల్లోని దుకాణాలు, చిల్లరకొట్లు, షాపుల ముందుండే అరుగులు, ఫుట్‌పాత్‌లు, ఇళ్ల మధ్యలో ఉండే ఖాళీ స్థలాలు, రోడ్డు మార్జిన్లు, రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారాలు, బస్ షెల్టర్లు, కల్వర్టులు, పబ్లిక్ పార్కులు, పాఠశాల ప్రాంగణాలు, గ్రామాల్లో ఉండే ముఖ్యమైన కూడళ్లను ఆక్రమించివేస్తున్నారు. నలుగురు కలిసి అక్కడే కూర్చుని మద్యం తాగుతున్నారు. మందుబాబులు గుంపులు, గుంపులుగా పోగుపడే విధానం వచ్చిన తర్వాత దాన్ని ఆసరా చేసుకుని గంజాయి గుంపు కూడా వీధుల్లోకి వచ్చింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో గంజాయి విచ్చలవిడి చలామణి కారణంగా ముక్కుపచ్చలారని చిన్నారులు సహా అనేక మంది యువకులు గంజాయి మహమ్మారికి అలవాటు పడ్డారు. వారంతా మందుబాబులను ఆసరా చేసుకుని బహిరంగ ప్రదేశాల్లోనే గంజాయి తీసుకునేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక స్వయంగా స్థానిక ఎమ్మెల్యేలకే ప్రజలు గంజాయి, మందుబాబుల గుంపుల బైఠాయింపు, దాడులపై ఫిర్యాదులు చేసిన సందర్భాలు అనేకం జిల్లాలో ఉన్నాయి. బహిరంగంగా గంజాయి, మద్యపానం కారణంగా ఉనికిలోకి వచ్చిన అరాచక గుంపులు సమాజానికి పెనుసవాలుగా మారుతున్నాయి. మహిళలు, విద్యార్థులు, యువతులు బయటికి రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. మహిళలపై అఘాయిత్యాలు నిత్యకృత్యంగా మారిన నేపథ్యంలో అత్యవసరమైన పనులున్నా కూడా బయటికి రావడానికి జంకుతున్నారు. గడిచిన ఐదేళ్లలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు విపరీతంగా పెరిగాయి. అత్యాచారాలు, హత్యలు, సామూహిక దాడులు మహిళలపై లెక్కకు మించి పెరిగాయి. ఎక్కడో దూరంగా జరిగే ఘటనలు జిల్లాలో రోజువారీ ఘటనలుగా మారిపోయి భయానక వాతావరణం నెలకొంది. ఈ పరిస్థితిని చక్కదిద్ది, మహిళా భద్రతకు భరోసా కల్పించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఎంతైనా ఉంది. కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన తాజా మద్యం పాలసీ మహిళలకు నిరాశనే మిగిల్చింది. పర్మిట్ రూము విధానం అమలు చేయకపోవడంతో బహిరంగ మద్యపానం నేటికీ రాజ్యమేలుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక మందుబాబుల వీధి విహారం యథేచ్ఛగా సాగుతోంది.



పీసీ చైర్మన్లుగా.. పులుకూరి పంతాని

- సాగర్, కేడబ్ల్యూడీల ఎన్నిక ఏకగ్రీవం
- వైఎస్ చైర్మన్లుగా చక్రపాణి, సునీల్‌చౌదరి
- ముగిసిన సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ
- పల్నాడు, బాపట్ల జిల్లాలకు సాగర్ పీసీ పదవుల పంపకం
- బాపట్ల, గుంటూరు జిల్లావాసులకు కేడబ్ల్యూడీ పీసీ పదవులు
- ఆయకట్టు రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా అడుగులు వేస్తామన్న నేతలు



నాగార్జున సాగర్ పీసీ చైర్మన్‌గా ఎన్నికైన పులుకూరి కాంతారావు, వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణికి డిక్లరేషన్ పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే యరపతినేని, ఎస్సీ పీ కృష్ణమోహన్



కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన పంతాని మురళీధరరావును అభినందిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు ఆనందబాబు, రామాంజనేయులు.

సాగునీటి రంగాన్ని అస్తవ్యస్తం చేశారు.. సంఘాలను విస్మరించారు.. కాల్వల మరమ్మతులు మరిచారు.. అన్నదాతల గోడు అరణ్య రోదనగా మార్చారు.. మొత్తం మీద వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగునీటి రంగం సంక్షోభంలో చిక్కుకుంది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జలవనరులకు జవసత్వాలు తీసుకు వచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. తొలుత సాగునీటి ఎన్నికలు నిర్వహించింది. ఈ క్రమంలో ఈ నెల 14 నుంచి ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టగా శనివారం పీసీ చైర్మన్ల ఎంపికతో ఆ క్రతువు ముగిసింది. బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలోని నాగార్జున సాగర్ కుడి కాల్వ, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో సాగర్ కుడి కాల్వ ప్రాజెక్టు కమిటీ ఎన్నిక జరగ్గా చైర్మన్‌గా పులుకూరి కాంతారావు, వైఎస్ చైర్మన్‌గా ఉప్పలపాటి చక్రపాణిలను ఎన్నుకున్నారు. అమృతలూరు మండలం కూచిపూడిలోని కృష్ణ పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన ఎన్నికలో చైర్మన్‌గా పంతాని మురళీధరరావు, వైస్ చైర్మన్‌గా నువ్వుల సునీల్‌చౌదరిలను ఎన్నుకున్నారు. టీసీలు, డబ్ల్యూయూఏ, డీసీల పదవులలో అధ్యక్షులు ఇప్పటికే కొలువుతీరగా పీసీ చైర్మన్ల ఎన్నిక కూడా ముగియడంతో ఇక సాగునీటి రంగాన్ని గాడిలో పెట్టడానికి పదవుల్లో కొలువుదీరిన వారు కృషి చేసే దిశగా ప్రభుత్వం మార్గనిర్దేశనం చేయనుంది.

కారంపూడి డీసీ అధ్యక్షుడే చైర్మన్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ కుడి కాల్వ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా పల్నాడు జిల్లా గురజాలకు చెందిన పులుకూరి కాంతారావు(కారంపూడి డీసీ అధ్యక్షుడు)ను, బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గానికి చెందిన ఉప్పలపాటి చక్రపాణి(కొనంకి డీసీ అధ్యక్షుడు)ని డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంతారావు, చక్రపాణిలకు కలెక్టర్ అరుణ్‌బాబు డిక్లరేషన్ పత్రాలను అందజేశారు. వీరిని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జలవనరులశాఖ ఎస్సీ కృష్ణమోహన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో మురళి, ఇరిగేషన్ ఈఈ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు. పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలోని డీసీల అధ్యక్షులు ఎన్నికకు హాజరయ్యారు. పీసీ చైర్మన్‌గా కాంతారావుకు రెండేళ్లు, తదుపరి మూడేళ్లు గోగినేని కోటేశ్వరరావు పేర్లను టీడీపీ అధిష్టానం ఖరారు చేసిన విషయం తెలిసిందే.

కాల్వ బాగుకు కృషి చేస్తాం : చైర్మన్, వైస్‌చైర్మన్లు

వైసీపీ ఐదేళ్ల పాలనలో పాడుబెట్టడంతో అధ్వానస్థితికి చేరిన సాగర్ కాల్వల బాగుకు తాము కృషి చేస్తామని చైర్మన్ పులుకూరి కాంతారావు, వైస్‌చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి తెలిపారు. సాగునీటి కాల్వల్లో గడ్డిపరక కూడా తొలగించలేదని కాంతారావు తెలిపారు. కుడి కాల్వ చివరి భూములకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. కాల్వల పరిధిలోని సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామన్నారు. కాల్వలను (మిగతా 6వ పేజీలో)

మోర్తోట డీసీ అధ్యక్షుడే చైర్మన్

అమృతలూరు, బాపట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా రేపల్లె నియోజకవర్గ పరిధిలోని మోర్తోట డీసీ అధ్యక్షుడైన పంతాని మురళీధరరావును ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా చేబ్రోలు డీసీ అధ్యక్షుడైన కాకుమాను మండలానికి చెందిన నువ్వుల సునీల్‌చౌదరిని ఎన్నుకున్నారు. ప్రాజెక్టు పరిధిలోని 22 మంది డీసీలు హాజరు కాగా చైర్మన్ పదవికి మురళీధరరావు పేరును మొఖమాటం రాధాకృష్ణమూర్తి, వైస్ చైర్మన్ పదవికి సునీల్‌చౌదరి పేరును దద్దుకూటి బూషబాబు ప్రతిపాదించగా సభ్యులు ఆమోదించారు. వెలిగొండ ప్రాజెక్టు ఎస్ఈ అబూదలేమ్, ఆర్డీవో రామలక్ష్మి చైర్మన్, వైఎస్ చైర్మన్లకు ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఎస్ఈ వెంకటరత్నం, చీరాల డీఈ ఎన్‌కేవీ ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భ్రష్టుపట్టించారు : మంత్రి పార్థసారథి

గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి రంగాన్ని భ్రష్టుపట్టించిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఎన్నిక అనంతరం మంత్రి, వేమూరు, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు చైర్మన్, వైఎస్‌చైర్మన్లను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం సాగు నీటి రంగాన్ని నిర్లక్ష్యం చేసి రైతులకు తీరని అన్యాయం చేసిందన్నారు. సాగు నీటి రంగం కోసం చంద్రబాబు రూ.వేల కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టుల నిర్మాణం చేపడితే వాటిని నాశనం చేసేదాకా జగన్ నిద్రపోలేదన్నారు. గత ప్రభుత్వం చేతకానితనం వల్ల సాగు నీటి రంగం (మిగతా 6వ పేజీలో)

సమాజ వికాసానికి విద్యార్థులు దోహదపడాలి

పెదకాకాని, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాజ వికాసం భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమనీ, అందుకు తగినట్లుగా నేటితరం విద్యార్థులు అడుగులు వేయాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సీహెచ్ ద్వారకా తిరుమలరావు సూచించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో శనివారం ఇండక్షన్ అండ్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ కార్యక్రమానికి డీజీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని సైబర్ నేరాలు, డ్రగ్స్ ముప్పు వంటి ముఖ్యమైన సమస్యలపై అవగాహన కల్పించారు. డిజిటల్ యుగంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు తమతోపాటు సమాజాన్ని రక్షించుకోవడానికి బాధ్యతాయుతమైన ప్రవర్తనను అలవర్చుకోవాలని కోరారు. ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ఆచార్య కె.గంగాధరరావు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. విద్యార్థులు వినూత్న పరిష్కారాలను అన్వేషించాలని, సాంకేతిక పురోగతికి సహకరించాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి మాట్లాడుతూ సమాజాభివృద్ధి, దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకమన్నారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ సమయపాలన, క్రమశిక్షణ ప్రాముఖ్యతను వివరించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సిద్దయ్య, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

గాలులు.. చినుకులు

- అన్నదాతల్లో ఆందోళన మొదలు
- హార్బర్‌లో మూడో నెంబరు ప్రమాద సూచిక



నిజాంపట్నం హార్బర్‌లో 3వనెంబర్ ప్రమాద సూచిక ఎగురవేత

రేపల్లె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారడంతో తీరంలో శనివారం ఉదయం నుంచి ఈదురు గాలులతో కూడిన చిరుజల్లులు పడ్డాయి. దీంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. నాలుగు రోజులుగా వాతావరణంలో మార్పు రావడంతో రైతులు హార్వెస్టుల ద్వారా కోతలు కోసి ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. ఈ పరిస్థితుల్లో చిరుజల్లుపడటంతో రైతులు ధాన్యం తడిసిపోతాయని ఆందోళన చెందుతున్నారు. ఆరబెట్టుకున్న ధాన్యం రాశులపై పట్టాలు కప్పుకుని జాగ్రత్త పడుతున్నారు. వర్షం పెద్దదైతే ధాన్యం అంతా నీటిపాలవుతుందంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణంలో మార్పులు కారణంగా రెండు రోజులుగా కోసిన పనలు ఎండకుండానే కుప్పలు వేసుకుంటున్నారు.

తుఫాన్‌గా మారిన అల్పపీడనం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తుఫాన్‌గా మారింది. శనివారం నిజాంపట్నం హార్బర్‌లో మూడో నెంబరు ప్రమాద సూచిక ఎగరవేశారు. మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లరాదని, వెళ్లిన వారంతా తీరానికి చేరుకోవాలని అధికారులు ఆదేశించారు. ఇప్పటికే 90 శాతం వేటకు వెళ్లిన బోట్లు హార్బర్‌కు చేరుకున్నాయి. తుఫాన్ ప్రభావంతో సముద్రంలో అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని చిన్నబోట్లు వారు వేటకు వెళ్లరాదని అధికారులు ఆదేశాలు జారీ చేశారు..



జాతీయ రహదారిపై ఆరబెట్టుకున్న వరి ధాన్యం

రైతులను మోసగిస్తే మిల్లర్లపై చర్యలు

- అవకతవకలకు పాల్పడితే లైసెన్సుల రద్దు
- అసోసియేషన్ నాయకుల సమావేశంలో కలెక్టర్ హెచ్చరిక

బాపట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులను మోసగిస్తే చర్యలు తీసుకుంటాం.. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే లైసెన్సులు రద్దు చేస్తాం.. అని మిల్లర్లకు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. శనివారం కలెక్టర్ తన చాంబర్‌లో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులతో సమావేశం నిర్వహించి ఈ మేరకు హెచ్చరికలు జారీ చేశారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే మిల్లర్ల తీరు అందుకు భిన్నంగా ఉందన్నారు. ఆంక్షలతో రైతులను నష్టపర్చాలని చూస్తే సహించేదిలేదన్నారు. ప్రభుత్వ విధానాలపై పూర్తి స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయాధికారులపై ఉందన్నారు. తేమశాతం అధికంగా ఉందని సాకు చూపి క్వింటాకు అదనంగా 10 కేజీల చొప్పున ధాన్యాన్ని మిల్లర్లు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. తేమశాతంలో తేడాలు ఉంటే సంబంధితాధికారులకు తెలియజేయాలన్నారు. గోనె సంచుల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, పౌరసరఫరాల జిల్లా అధికారి విలియమ్స్, జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్యామ్‌సన్, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్, బాపట్ల తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివరామప్రసాద్, జీడీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం తదితరులు పాల్గొన్నారు.

అర్జీలపై అధికారులదే బాధ్యత

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే అర్జీల పరిష్కారంలో నాణ్యత లేకపోతే అధికారులే బాధ్యులవుతారని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. తహసీల్దార్లు, జిల్లా అధికారులతో కలెక్టర్ శనివారం కాన్ఫరెన్స్ నిర్వహించి పునరావృతమయ్యే అర్జీలను గుర్తించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. పౌరులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే వారి అర్జీలు పరిష్కరించినట్లు కొందరు అధికారులు క్లోజ్ చేయడం సరికాదన్నారు. ఇందు కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేకసెల్ ఏర్పాటు చేస్తామన్నారు.పర్చూరు మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్ పరిధిలో 88 ఫిర్యాదులకు పరిష్కారం చూపినా అసంతృప్తి వ్యక్తం చేయడంపై కలెక్టర్ ఆరా తీశారు. చీరాల మండలంలోని అదే పరిస్థితి ఉండటంపై అధికారులను నిలదీశారు.



కలెక్టర్ జె.వెంకటమురళి

వర్గీకరణపై వినతిపత్రాల స్వీకరణ

రాష్ట్రంలో షెడ్యూల్ కులాల వర్గీకరణను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించేందుకు విశ్రాంత ఐఏఎస్ రాజీవ్‌రంజన్‌మిశ్రా ఆధ్వర్యంలో నియమించిన ఏకసభ్య కమిషన్‌కు వినతిపత్రాలను అందజేయవచ్చని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. వర్గీకరణపై కమిషనర్‌కు నివేదించే వ్యక్తులు, సంస్థలు వినతి పత్రాలను పై రెండు అంశాలకు సంబంధించిన వాస్తవాలను తగు ధ్రువీకరణపత్రాలతో సమర్పించాలన్నారు. ఒరిజనల్ ధ్రువీకరణపత్రాలను జనవరి 9లోగా ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 5గంటలలోపు విజయవాడలోని కార్యాలయంలో సమర్పించి రశీదు పొందాలన్నారు. లేదా రిజిస్టర్ పోస్ట్ ద్వారా కూడా పంపవచ్చన్నారు.


హెల్మెట్ ధరించిన వాహనదారుని అభినందిస్తున్న డీఎస్పీ

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష

మేదరమెట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనదారులు ప్రమాదాల నుంచి ప్రాణాలు కాపాడు కోవచ్చని చీరాల డీఎస్పీ మహ్మద్ మొయిన్ అన్నారు. శనివారం మేదరమెట్ల, కొరిశపాడు పోలిస్‌స్టేషన్‌లను వార్షిక తనిఖీలో భాగంగా ఆయన తనిఖీ చేశారు. రికార్డులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కొరిశపాడు పోలీస్ స్టేషన్ వద్ద నుంచి ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ ఉపయోగాలను వివరిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు.

జాతీయ రహదారిలో అత్యధిక ప్రమాదాలు రోడ్డు మార్జిన్‌లో వాహనాలు నిలపడంవల్లే జరుగుతున్నాయని డీఎస్పీ మొయిన్ అన్నారు. అనుమతి ఉన్న చోట మాత్రమే వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి వేళల్లో డ్రైవర్లు నిద్రలోకి జారుకోకుండా రాత్రి 3 గంటల సమయంలో లారీలను ఆపి మొఖం కడుగుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవడం వలన ఎన్నో కుటుంబాలను కాపాడవచ్చు అన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించి వెళ్తున్న వాహనదారుడికి పండు ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జున రావు, మేదరమెట్ల, కొరిశపాడు, జె.పంగులూరు ఎస్‌ఐలు మహమ్మద్ రఫీ, సురేష్, వినోద్ బాబుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ : ద్విచక్ర వాహనాలను హెల్మెట్‌లు లేకుండా నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ జీవీ చౌదరి హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని వేమవరం నాలుగు రోడ్ల కూడలిలో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న పలువురికి హెల్మెట్‌ల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణ రక్షణ కలుగుతుందని చెప్పారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంవల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు. కార్యక్రమంలో రైటర్ శివ కృష్ణ ఉన్నారు.

మార్టూరు : హెల్మెట్లను వాహనాలు నడిపే సమయంలో ధరించడం వలన ప్రమాదాలబారి ప్రాణాలను కాపాడుకోవచ్చని సీఐ ఎం.శేషగిరిరావు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని బొల్లాపల్లి టోల్‌గేట్ వద్ద హెల్మెట్ల వినియెగంపై వాహన దారులకు సీఐ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సైదా, ఏఎస్‌ఐ బాషా తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల దాతృత్వం వెలకట్టలేనిది


వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ తంబీ జోసఫ్

పర్చూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వృద్ధులకు సాయం అందించాలన్న చిన్నారుల సంకల్పం వెలకట్టలేనిదని ప్రిన్సిపాల్ కొండవీటి తంబీ జోసఫ్ అన్నారు. మండలం నాగులపాలెం గ్రామంలోని ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాలలోని విద్యార్థులు క్రిస్మస్ పండుగ సందర్భంగా సమకూర్చిన నగదుతో 40 మంది నిరుపేద వృద్ధులకు దుప్పట్లను ప్రిన్సిపాల్ పంపిణీ చేశారు. అంతకముందు సెమీ క్రిస్మస్ వేడుకను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రేమ, దయ ఉండాలి : వెలుగు పీడీ పద్మ

క్రీస్తు బోధనలు అనుసరణీయమని, ప్రతి ఒక్కరితోనూ ప్రేమ, దయ కలిగి ఉండాలని వెలుగు బాపట్ల జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.పద్మ అన్నారు. శనివారం వెలుగు కార్యాలయంలో ఏపీఎం రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్, ఏరియా కోఆర్డినేటర్ లక్ష్మణాచారి, ఏపీఎం రామకృష్ణ, ఉన్నతి ఏపీఎం ఫణిబాబు, స్త్రీనిధి మేనేజర్ కరుణాకర్, సీసీలు విజయ్ కుమార్, శ్రీనివాస మూర్తి, ప్రమీల, నరసింహారావు, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

మోర్తోట డీసీ అధ్యక్షుడే చైర్మన్


కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన సునీల్‌చౌదరికి నియామక పత్రం అందజేస్తున్న ఎస్‌ఈ అబూదలేమ్, ఆర్డీవో రామలక్ష్మి

(5వ పేజీ తరువాయి)

నాశనమైందన్నారు. సాగు నీటి రంగంలోని సమస్యలను గుర్తించి, రైతులకు మేలు జరిగేలా కమిటీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ మరుగునపడిన వ్యవస్థను గాడిలో పెడతానికి చంద్రబాబు నడుం బిగించారని ఇందులో భాగంగానే సాగు నీటి సంఘాల ఎన్నికలన్నారు. రైతులకు ఎంతో ఉపయోగ పడే వ్యవస్థలను జగన్మోహనరెడ్డి నాశనం చేశారన్నారు. ఎమ్మెల్యే బుర్ల రామాంజనేయలు మాట్లాడుతూ సాగు నీటి రంగం చంద్రబాబు మానసపుత్రిక అన్నారు. నూతన కమిటీ ప్రతి ఎకరాకు నీరందించే విధంగా పని చేస్తుందన్నారు.

కాల్వలు, డ్రైయిన్లు ఆధునికీకరిస్తాం : చైర్మన్

కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని కాల్వలు, డ్రైయిన్లను అభివృద్ధి చేస్తామని బాధ్యతలు స్వీకరించిన అనంతరం చైర్మన్ పంతాని మురళీధరరావు తెలిపారు. జగన్‌రెడ్డి పాలనలో కాల్వలు, డ్రెయిన్లను అభివృద్ధి చేయలేదన్నారు. పట్టిసీమ నీటిని కూడా అందించలేదన్నారు. రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టిసారించి సాగునీటి సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. అధ్వానంగా తయారైన కాల్వలు, డ్రెయిన్లను అభివృద్ధి చేసి చివరి భూములకు కూడా సాగునీరు అందించేందుకు కృషిచేస్తామన్నారు.

ఇసుకను తోడేస్తున్నారు!

కనిగిరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. నెల్లూరు ప్రాంతం నుంచి సీనరీజ్‌కు ఎగనామం పెట్టి అక్రమమార్గంలో ఇసుక రవాణా జరుగుతుంది. మరోపక్క కనిగిరి ప్రాంతంలోని చెరువు, అలుగువాగు మేటలనూ వదలకుండా ఇసుకను తోడేస్తూ ప్రభుత్వ విధానాలకు తూట్లు పొడుస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక అక్రమ వ్యాపారంలో అడ్డేలేకుండా సాగించినవారికి ప్రభుత్వం మారినా వారిదే పైచేయిలా సాగుతుంది. వైసీపీ నేతలు వెనుకుండి వారి అనుయాయులను కూటమి పార్టీల్లో తిప్పుతూ అక్రమ వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్ అధికారులు కళ్ళప్పగించి చూస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.నాగులచెరువు, చినిర్లపాడు, పునుగోడు, ఏరువా రిపల్లి, బొమ్మిరెడ్డిపల్లి, తాళ్లూరు, యడవల్లి, దిరి శవంచ, కమ్మవారిపా లెం, కంచర్లవారిపల్లి, గ్రా మాల్లోని అలుగు వాగులు, పీసీపల్లి మండలంలోని అలవలపాడు, గు దేవారిపాలెం, రామాపురం, మర్రిపూడి మండలం నర్సాపురం ప్రాంతాల్లో ఇసుక మేటను తవ్వుతూ అక్రమ మార్గంలో అమ్మకాలు సాగిస్తున్నారు.

నేడు సీతారామస్వామి దేవస్థాన పునర్‌నిర్మాణ పూజలు


మూతపడిన పురాతన సీతారామస్వామి ఆలయం

చినగంజాం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామంలోని అన్నపూర్ణ థియేటర్ పక్కనే ఉన్న సీతారామస్వామి దేవస్థానం పునర్ నిర్మాణ పూజలు ఆదివారం ఉదయం 7గంటల నుంచి నిర్వహించనున్నట్లు దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు వలివేటి వెంకటరామానుజం, మోటుమర్రి రామసుబ్బారావు తెలిపారు. గ్రామంలో సుమారు వంద సంవత్సరాల చరిత్ర గల సీతారామస్వామి దేవాలయంలో నిత్య నైవేద్యాలు సాగక మూతపడి శిథిలమై ఉంది. స్వామి వారి దేవాలయ ద్వార బంధం, సింహ ద్వారం తెరిచే కార్యక్రమాన్ని ఆగమ శాస్త్ర పండితులు అగ్నిహోత్రం వెంకటశేషాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7గంటల నుంచి విశ్వక్సేనారాధన, పుణాహవచనం, వాస్తు పూజ, పంచగవ్య ఆరాధన, ప్రోక్షణ తదనంతరం అగ్నిప్రతిష్ఠాపనం, శాంతి హోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం ద్వారాలు తెరిచే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 2006వ సంవత్సరం నుంచి దేవాలయంలోని సీతారాముల ఉత్సవ విగ్రహాలు స్థానిక భూ సమేత భావ నారాయణస్వామి దేవస్థానంలో ఉన్నట్లు తెలిపారు. నాటి నుంచి ప్రతి శ్రీరామనవమి పర్వదినాన భావనారాయణస్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు భావనారాయణ కల్యాణ మండపంలో ఉత్సవ విగ్రహాలతో స్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరుపుతున్నారు. సీతారామస్వామి దేవాలయంలో నాడు చినగంజాం, సోపిరాల తదితర గ్రామాల్లోని ప్రజలు తమ పిల్లలకు వివాహాది శుభకార్యక్రమాలు దేవాలయంలోనే జరుపుకునేవారిని గ్రామ పెద్దలు చెప్పన్నారు. ఆలయాన్ని నూతనముగా నిర్మాణం చేయటకు గ్రామస్థులు సంకల్పించి కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు రూ.39 లక్షల రూపాయిలను ప్రజలు, భక్తుల నుంచి విరాళాల రూపంలో సేకరించి దేవాలయ నిర్మాణానికి పూనుకున్నారు. ఇటీవల చినగంజాం పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కమిటీ సభ్యుల వినతి మేరకు దేవాలయాన్ని పరిశీలించారు. ఆదివారం జరిగే దేవాలయ పునఃనిర్మాణ పూజలకు కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. దేవాలయ హంసద్వారం తెరిచే కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

శాస్త్రోక్తంగా ప్రారంభమైన పూజలు


యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

పంగులూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొండమంజులూరు గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా శనివారం వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు సుప్రభాతం అనంతరం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన, పంచగవ్య ఆరాధన, పంచగవ్య ప్రాసన, వాస్తుపూజ, అగ్ని ప్రతిష్ఠాపన, వాస్తు హోమం, పద్యుజీకరణం, అకల్మష హోమం, బింది శుద్ధ్యర్థం, నవ కలశ, పంచగవ్యాధివాసం, పంచాగ్ని ప్రణయనం, నివేదన, హారతి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాదవినియోగం జరిగింది. సాయంత్రం గ్రామోత్సవం, మహిళా కోలాటం ఘనంగా నిర్వహించారు. అనంతరం సాయంసవనం, నవగ్రహ ఆరాధన, అవహన కుంభాభిమర్శనం, సర్వదైవత్య హోమం, హారతి, తీర్థప్రసాద వినియోగం జరిగాయి. వేద మంత్రోచ్చరణతో శాస్త్రోక్తంగా జరిగిన కార్యక్రమాలలో పలువురు దంపతులు పాల్గొన్నారు

క్లీన్ అండ్ గ్రీన్ ప్రకాశం

- జిల్లావ్యాప్తంగా పారిశుధ్యం, పచ్చదనం కార్యక్రమాలు ప్రారంభం
- టంగుటూరు, సూరారెడ్డిపాలెంలలో పాల్గొన్న కలెక్టర్, పరిశీలించిన మంత్రి స్వామి
- ప్రభుత్వ కార్యాలయాలు, విద్య, వైద్య సంస్థల్లో పరిశుభ్రతపై దృష్టి
- ప్రతినెలా మూడవ శనివారం నిర్వహణ
- ప్రభుత్వ ఉత్తర్వుల కన్నా ముందే కలెక్టర్ చొరవ


చెత్తను ఊడ్చుతున్న కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, అధికారులు

ఒంగోలు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశుభ్రత, పచ్చదనం కార్యక్రమాలు శనివారం అధికార యంత్రాంగం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా గతంలో వలే మళ్లీ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించాలని ప్రతినెల మూడవ శనివారం అందుకు కేటాయించాలని ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. అందుకు సంబంధించి త్వరలో ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అయితే ఉత్తర్వులు అందక మునుపే జిల్లాలో ఈ కార్యక్రమం అమలుకు కలెక్టర్ తమీమ్ అన్సారియా చొరవ చూపారు. ఇప్పటికే కేంద్రప్రభుత్వ ఆదేశాలతో స్వచ్ఛతహీ సేవా కార్యక్రమం నడుస్తుండగా అన్నింటిని కలిపి 'పరిశుభ్రత ప్రకాశం, పచ్చదనం ప్రకాశం' నినాదంతో ప్రతినెల మూడవ శనివారం కార్యక్రమాలు నిర్వహించాలని సంకల్పించారు. ఆ మేరకు శుక్రవారం రాత్రి అందరూ అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి తగు సూచనలు చేయగా శనివారం ఉదయం జిల్లా అంతటా ఈ కార్యక్రమాలు చేపట్టారు. కలెక్టర్ అన్సారియా టంగుటూరులో లాంచనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం అదే మండలంలోని సూరారెడ్డిపాలెంలోనూ పాల్గొన్నారు. అక్కడ ఈ కార్యక్రమాన్ని మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి పాల్గొని పరిశీలించారు. దళితవాడలో వీధులు, డ్రైన్లు పరిశుభ్రత పనులను పర్యవేక్షించారు. ప్రకాశం భవన్‌లో కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో ఓబులేసులు చీపురు పట్టి చిమ్మి పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు జేసీ గోపాలకృష్ణ మద్దిపాడులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాలు, విద్యాసంస్థలు, హాస్టళ్లు, వైద్యశాలలు తదితర ప్రాంతాలలో స్థానిక అధికారులు, సిబ్బంది పరిశుభ్రత కార్యక్రమాన్ని పాటించారు. ప్రతినెల మూడవ శనివారం ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు.

భూ ప్రకంపనలు

- ఇళ్లలో పడిపోయిన వస్తువులు
- బయటకు పరుగులు తీసిన విద్యార్థులు
- ఆందోళనతో ఇళ్లలో నుంచి వచ్చిన ప్రజలు



ముండ్లమూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలో శనివారం స్వల్ప భూప్రకంపనలు సంభవించాయి. ముండ్లమూరు, తాళ్లూరు, కురిచేడు మండలాల్లో ఉదయం 10.32 సమయంలో రెండు సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. ముండ్లమూరు, పసుపుగల్లు, వేంపాడు, సింగనపాలెం, పోలవరం, శంకరాపురం, నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెం, మారెళ్ళ, జమ్మలమడక, నాయుడుపాలెం, తమ్మలూరు, ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, ఈదర, భీమవరం, వేములబండ గ్రామాల్లో భూమి కంపించింది. పసుపుగల్లులోని గూడాల శివశంకర్‌రెడ్డి ఇంట్లో మచ్చు మీద పెట్టిన సామాన్లు సైతం కింద పడిపోయాయి. శంకరాపురంలో కూడా పలు ఇళ్లలోని సామాన్లు సైతం భూమి అదిరిన శబ్దానికి కింద పడిపోయాయి. పోలవరం, ముండ్లమూరు పాఠశాలల్లో విద్యార్థులు బయటకు పరుగులు తీశారు. ముండ్లమూరులో పోలీసులు ఏర్పాటుచేసి సీసీ కెమెరాల్లో భూమి కంపించిన దృశ్యాలు స్పష్టంగా నమోదయ్యాయి.

పెద్ద శబ్దం రావటంతో భయంతో పరుగులు తీశాం



పసుపుగల్లు, ముండ్లమూరు మండలం ఒక్కసారిగా పెద్ద శబ్దం రావటం, భూమి వణికినట్లుగా కన్పించటంతో ఇంట్లో నుంచి ఒక్కసారిగా భయంతో పరుగులు తీసి రోడ్డు మీదకు వచ్చాను. మా ఊరిలో వారంతా ఒక్కసారిగా భూకంపం రావటంతో పరుగులు తీశారు. ఇంట్లో వస్తువులన్నీ చెల్లాచెదురుగా కింద పడిపోయాయి.

- గూడాల శివ శంకర్‌రెడ్డి,

కురిచేడులో..

కురిచేడు : కురిచేడులో రెండు సెకన్లపాటు స్వల్ప భూకంపం సంభవించింది. భూమి లోపల నుంచి కొద్ది పాటి శబ్దం వచ్చింది. స్థానికులు పెద్దగా దీనిని పరిగణనలోకి తీసుకోలేదు. శబ్దం వచ్చిన వెంటనే భవనాల నుంచి బయటకు వచ్చారు. మరలా ఎటువంటి శబ్దాలు రాకపోవడంతో ప్రజలు ఎవరి పనులకు వారు వెళ్లిపోయారు.

తాళ్లూరులో ..

తాళ్లూరు :మండలంలోని పలుగ్రామాల్లో శనివారం ఉదయం పెద్ద శబ్దంతో భూమి కంపించటంతో ప్రజలు ఆందోళన చెందారు. తాళ్లూరు, తూర్పుగంగవరం, కొర్రపాటివారిపాలెం, కొత్తపాలెం రమణాలవారిపాలెం తదితర గ్రామాల్లో రెండు సెకన్లపాటుపెద్ద శబ్దంతో భూమిలో ఏదో వెళుతున్నట్లు అలజడి కన్పించింది. నేలపై కాళ్లు అదిరాయి. తాళ్లూరులో ఎరువుల దుకాణంలోని బస్తాలు కింద పడ్డాయని దుకాణం యజమాని తెలిపారు. భూకంపం రావటంతో ప్రజలు భయాందోళన చెందారు.

జిల్లాకు ముగ్గురు ఎస్‌డీసీలు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు ముగ్గురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇరిగేషన్ (ఎల్‌ఏ) వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కె.శ్రీధర్‌రెడ్డి, గుండ్లకమ్మ ప్రాజెక్టు ఎస్‌డీసీగా సిహెచ్.విజయజ్యోతి కుమారి, కేఆర్‌సీసీ ఎస్‌డీసీగా కె.చిన్నయ్యను నియమించారు.

కేజీబీవీ విద్యార్థినులకు మోడల్ పేపర్లు పంపిణీ

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండల కేంద్రంలోని కేజీబీవీ పదో తరగతి విద్యార్థినులకు యూటీఎఫ్ ప్రచురించిన మోడల్ పేపర్లను ఎంఈవో జె.ప్రసాదరావు శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించేలా ప్రణాళికలు రూపొందించుకొని లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ రేష్మ, యూటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్. వెంట్రామయ్య, షేక్ సాదుషా, తదితరులు పాల్గొన్నారు.


వివాదాన్ని పరిష్కరించిన అనంతరం ఇరువైపుల వారితో మాట్లాడుతున్న తహసీల్దార్ పార్వతి

కొత్తపేట శ్మశాన వాటిక వివాదం పరిష్కారం

తహసీల్దార్ పార్వతి

కొత్త పేట(చీరాల), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : కొత్త పేట శ్మశాన వాటికకు సంబంధించిన వివాదం నేపథ్యంలో శనివారం తహసీల్దార్ పార్వతి స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఇరువైపులా వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. తహసీల్దార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆ శ్మశాన వాటిక స్థలాన్ని కొలిచి హద్దులు నిర్ణయించాలని కొందరు, తన తండ్రి సమాధి తొలగించారని ఎన్. ఏకలవ్య అనే వ్యక్తి సోమవారం నిర్వహించే కలెక్టర్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చారు. దీనిపై గతంలో క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ చేపట్టారు. ఆ క్రమంలో తాజాగా ఇరువైపుల వారితో స్థానిక పంచాయతీ కార్యాలయంలో మాట్లాడి ఎన్. ఏకలవ్య, మరో ఇరువురు గ్రామస్థులు ఏకపక్షంగా ప్రహరీ గోడపై పగలగొట్టిన సమాధుల నామ ఫలకం ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. అందుకు ఇరువైపుల వారు అంగీకరించారని దీంతో దీర్ఘకాలంగా నెలకొన్న సున్నితమైన సమస్యకు పరిష్కారం లభించిందని తహసీల్దార్ తెలిపారు. అలానే శ్మశాన స్థలం 78 సెంట్లు ఉందని పేర్కొన్నారు. చర్చల అనంతరం ఇరువైపుల వారిని చేతులు, చేతులు కలిపించి స్నేహపూర్వక వాతావరణం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

గణితంపై ఆసక్తిని పెంచుకోవాలి


రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

అద్దంకిటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు గణితం పట్ల ఆసక్తిని పెంచుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వీ మోహనరావు అన్నారు. శనివారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత మేథావి శ్రీనివాస రామానుజన్ 138వ జయంతి సందర్భంగా కళాశాల గణిత విభాగం ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత గణిత అధ్యాపకుడు బీ నారాయణ రావు హాజరై రామానుజన్ జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో గణిత శాస్త్రం విభాగం అధిపతి డాక్టర్ సిహెచ్. సురేష్‌కుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం కార్యక్రమం ప్రిన్సిపాల్ డాక్టర్ వీ మోహనరావు అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులకు వినియోగదారులు హక్కులు, సంబంధిత చట్టలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎంవీ సత్యనారాయణ, కామర్స్ విభాగాదిపతి ఏ. శిఖామణి, వి.ప్రసాద్, బీ అశోక్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా తరలిస్తే చర్యలు

- ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు
- రామాపురం తీరంలో వాహనాల తనిఖీ


రామాపురంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

వేటపాలెం(చీరాల), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా మద్యం అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు స్పష్టం చేశారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా మద్యం తరలిస్తారనే సమాచారం మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో శనివారం మండల పరిధిలోని రామాపురంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఎవరు మద్యంను తరలించినా, విక్రయించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్


కార్యక్రమంలో పాల్గొన్న రియాజ్, నాయకులు, కార్యకర్తలు

సంతమాగులూరు, డిసెంబరు 21 : (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ తెలిపారు. సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు గ్రామంలో జనసేన పార్టీ కార్యకర్తల సమావేశంలో రియాజ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గ జనసేన నాయకులు చల్లా వెంకట కృష్ణారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారంపూడి డీసీ అధ్యక్షుడే చైర్మన్

(5వ పేజీ తరువాయి)

ఆధునికీకరించి సాగు నీటి విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అద్దంకి బ్రాంచ్ కాల్వ చివరి భూములకు సాగునీరు అందించేందుకు ప్రయత్నిస్తామని చక్రపాణి తెలిపారు. అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గత ఐదేళ్ల సాగు నీటి సంఘాలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి నీటి సరఫరాలో రైతులను భాగస్వాములను చేసిందన్నారు.

రైతుల ప్రయోజనాలకు పెద్దపీట : యరపతినేని

సాగర్ ఆయకట్టులో ప్రతి ఎకరాకు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని, రైతుల ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తామని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు తెలిపారు. 11 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగర్ ప్రాజెక్టు సాగు నీరు అందిస్తున్నా వైసీపీ హయాంలో కాల్వల మరమ్మతులు చేయకపోవడంతో రైతులు అవస్థలు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధులు కేటాయించి పనులు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, నాలుగు జిల్లాల ఎమ్మెల్యేలు మంత్రులు, డీసీల సహకారంతో గురజాలకు చెందిన పులుకూరి కాంతారావు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం హర్షణీయమన్నారు.

వైసీపీ పాపం..ప్రయాణికులకు శాపం


దారుణంగా ఉన్న పర్చూరు - ఇంకొల్లు మధ్య రోడ్డు


దగ్గుబాడు వద్ద ఇలా


గుంతలతో అధ్వానంగా ఉన్న నూతలపాడు - వంకాయలపాడు రహదారి

- పర్చూరు - ఇంకొల్లు రోడ్డుకు వీడని గ్రహణం
- మరమ్మతులకూ నోచుకోని వైనం
- గుంతలతో అధ్వానం
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు

పర్చూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలకుల పాపం ప్రయాణికులకు శాపంగా మారింది. పర్చూరు - ఇంకొల్లు వెళ్లే (పాతమద్రాస్)రోడ్డుకు గ్రహణం వీడేలా లేదు. కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపో వడంతో పెద్ద పెద్ద గుంతలు, కంకర రాళ్లు తేలి ప్రమాదాలకు కారణంగా మారింది. ఈ రోడ్డులో ప్రయాణమంటేనే నరకమని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఏదో ఒక చోట వాహన దారులు ప్రయాదాలకు గురవుతున్న పరిస్థితి నెల కొంది. వానలు పడితే దారుణంగా మారుతుంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలతో రోడ్డు బాగా దెబ్బతిన్నది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో 2022లో ఈరోడ్డు నిర్మాణానికి రూ.22కోట్ల సీఆర్ఎఫ్ నిధులను మంజూరు చేసింది. ఆ నిధులతో కల్వర్టులు, సైడ్ డ్రేన్‌లతోపాటు రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అయితే ఆ కాంట్రాక్టర్ ఈరోడ్డులో కల్వర్టులు, సైడ్ డ్రైన్‌లతో సరిపెట్టారు. అప్పటిలో చేసిన పనులకు కూడా బిల్లులు చెల్లించక పోవడంతో కాంట్రాక్టర్ చేసేది లేక పనులను అర్ధాంతరంగా నిలిపేశారు. అప్పటి నుంచి ఈ రోడ్డు మరమ్మతుకు కూడా నోచుకోక అధ్వానంగా తయారైంది. ఎవరో చేసిన పాపం..ఇలా ప్రయాణి కులకు, ప్రజలకు శాపంగా మారింది. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం పర్చూరు - ఇంకొల్లు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మరమ్మతుల మాటే లేదు

గత వైసీపీ పాలనలో రోడ్ల అభివృద్ధి మాటే లేదు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల రోడ్లు బాగులేక ఘోర ప్రమాదాలు జరిగినా పాలకు స్పందించలేదు. తాజాగా రోడ్ల అభివృద్ధిపై సీఎం చంద్రబాబు స్పందించారు. సంక్రాంతి పండుగ నాటికి గ్రామ, పట్టణ రోడ్లను బాగు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. దీనికి సంబంధించి నిదులు మంజూరు చేశారు. అయితే పర్చూరు - ఇంకొల్లు రోడ్డుకు గతంలోనే టెండర్ పూర్తి కావడంతో మరమ్మతులకు కూడా నోచుకోలేదు.

దీనిపై ఆర్అండ్‌బీ అధికారి నళిని వివరణిస్తూ పర్చూరు-ఇంకొల్లు రోడ్డు పరిస్థితిపై ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పలు రోడ్ల మరమ్మతులు మొదలయ్యాయి. ఈ రోడ్డు విషయంలో సాంకేతిక సమస్య ఉంది. త్వరలోనే సమస్య పరిష్కారమై రోడ్డు నిర్మాణం జరుగుతుందని తెలిపారు.



అలవలపాడులో మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు

సమస్యల పరిష్కారానికి సహకరించాలి

రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సింగారావు

పంగులూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికి రైతులు సహకరించాలని తహసీల్దార్ సింగారావు కోరారు. మండలంలోని అలవలపాడు గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. విస్తీర్ణ వ్యత్యాసాల సవరణకు రైతులు సర్వేకు సహకరించాలన్నారు. రైతులు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను నిర్ణీత వ్యవధిలో పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకాలకు 10 మంది, సర్వే కోసం ఐదుగురు దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో సర్వేయర్ సురేష్, వీఆర్వో, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లు : మండలంలోని సూదివారిపాలెం, నాగండ్ల గ్రామాలలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో భూసమస్యలపై 6 అర్జీలు అందినట్లు తహసీల్దార్ వెంకటరత్నం తెలిపారు. కార్యక్రమంలో దేవదయశాఖ అధికారి ఎం.శ్రీనివాసరావు, సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం

అద్దంకిటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శనివారం నేత్రదానం జరిగింది. పట్టణంలోని సూర్యారావు(54) అనారోగ్యంతో మృతి చెందారు. రోటరీ నేత్ర విభాగం డైరెక్టర్ మురళీసుధాకరరావు కుటుంబ సభ్యుల సహకారంతో శంకర కంటి వైద్యశాల వైద్యులు డాక్టర్ ఆకాంక్ష బృందం సూర్యారావు కార్నియాలను సేకరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు వీరయ్య, ఏజీ షేక్ మహమ్మద్ రఫీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

మార్టూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలంతా పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా డీఐవో వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని జొనతాళి గ్రామాన్ని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సందర్శించారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించి విద్యార్థుల ఆరోగ్యంపై సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికార్లు సౌజన్య, రేష్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శునకాలతో భయం..భయం!

- ఒకేరోజు 18 మందిని కరిచిన కుక్కలు
- యాంటీ రేబిస్ కోసం ఆసుపత్రుల వద్ద క్యూ కడుతున్న బాధితులు


బల్లికురవ ప్రధాన రహదారిపై కుక్కల గుంపు

మేదరమెట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలో కుక్కల దాడులతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మందలమందలుగా కుక్కలు రోడ్లపై ఇష్టానుసారం తిరుగుతూ ద్విచక్రవాహనదారులను, విద్యార్థులను కరుస్తున్నాయి. ఈ సమస్య మేదరమెట్లలోనే కాదు, మండలంలోని అన్ని గ్రామాలల్లో తీవ్రంగా ఉంది. ప్రతి రోజూ మేదరమెట్ల, కొరిశపాడు, ప్రాసంగులపాడు పీహెచ్‌సీలతో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లో కుక్కలు కరిచిన వారు మందుల కోసం క్యూ కడుతున్నారు. యాంటీ రేబిస్ ఇంజక్షన్‌లు వేయించుకుంటున్నారు. వారిలో చిన్నారులను, వృద్ధులు ఎక్కువగా వస్తున్నారని వైద్య సిబ్బంది చెప్తున్నారు. మూడు రోజుల కిందట ఒకేసారి 18 మందిని కుక్కలు కరిచి ఇంజక్షన్ కోసం హాస్పిటల్‌కు వచ్చారని మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య క్రేంద్రం సిబ్బంది తెలిపారు. ద్విచక్రవాహనాలపై వెళుతున్న వారిని వెనుక నుంచి కరవడంతో వారు కిందపడి గాయపడుతున్నారు. డ్రైవర్‌ల పైనుంచి కుక్కలు దూకడంతో ద్విచక్రవాహనదారులు కిందపడి గాయపడుతున్నారు. ఎక్కడి నుంచో వందల సంఖ్యలో కుక్కలు వచ్చాయి. కుక్కల దాడిలో గాయపడిన పలువురు పంచాయతీ అధికారులను కలువగా తామేమి చేయలేమంటూ చేతులు ఎత్తేస్తున్నారు. మండలంలోని ప్రజలు కుక్కలు సమస్యకు పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

జరజాగ్రత్త

- నామ్ రోడ్డులో వీధిలో గుంపులు గుంపులుగా సంచారం
- ఆందోళనలో వాహనచోదకులు

బల్లికురవ : తరచూ గ్రామాలలో శునకాలు ద్విచక్రవాహనాలకు అడ్డుగా వచ్చి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పుడు వీధి శునకాలు రాష్ట్రీయ రహదార్లపై సంచారం చేస్తుండడంతో వాహనచోదకుల్లో భయం భయం నెలకుంది.

బల్లికురవ మండల పరిధిలో ఉన్న అద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి రామాంజనేయపురం గ్రామం సమీపంలో రోడ్డుపై వీధి కుక్కల గుంపు గుంపులుగా సంచరిస్తుండడంతో వాహన చోదకులు ప్ర మాదాలబారిన పడుతున్నారు. ఈ కుక్కల ను చూడకుండా వాహనాలను నడిపే వారు ప్రమాదాలబారిన పడుతున్నారు. వాహన చోదకులు గ్రామాలలో రోడ్ల పైనే కాకుండా రాష్ట్రీయ రహదార్లపై కూడా జర జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. రోడ్లపై ఉన్న వీధి కుక్కలు వాహనాలను సైతం నిలుపుదల చేస్తున్నాయి. వాహనాలు వేగంగా దగ్గరకు వచ్చిన కుక్కలు మాత్రం రోడ్లపైనే ఉంటున్నాయి. వీధి కుక్కలను నామ్ రోడ్డు, గ్రామ పంచాయతీ అధికారులు నియంత్రించకుంటే ముందు మందు పెను ప్రమాదాలు జరుగుతుఆయని ప్రజలు అంటున్నారు. వేగంగా వచ్చే వాహనాలకు కుక్కలు అడ్డంగా వస్తున్నాయని, దీంతో వాహనాలు నియంత్రించలేక బోల్తా పడుతున్నాయని చెప్తున్నారు. ఎస్ఎల్ గుడిపాడు, రామంజనేయపురం, వైదన, కొప్పెరపాడు గ్రామాల పరిధిలోని పంట పొలాల నుంచి కుక్కలు రోడ్ల మీదకు వస్తున్నాయని వాహనాల వెంబడి పడడంతో కొందరు రోడ్లపై పడిపోతుతూ గాయపడుతున్నారు. అధికారులు వెంటనే కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టి, ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

27న మున్సిపల్ సమావేశం

అద్దంకి, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పురపాలక సంఘం సాధారణ సమావేశం ఈనెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ రవీంద్ర తెలిపారు.


సోపిరాల గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

సమస్యలు తెలుసుకునేందుకే పల్లెనిద్ర

చినగంజాం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని ప్రజల సమస్యలను తెలుసుకునేందుకే పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ టి.పాండురంగ విఠలేశ్వర్‌రావు తెలిపారు. చినగంజాం పోలీసుస్టేషన్ పరిధిలోని సోపిరాల గ్రామంలో శుక్రవారం రాత్రి ఆయన పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించి, గ్రామస్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పోలీసుశాఖను ప్రజలకు చేరువ చేసేందుకు ఎస్పీ పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వ్యక్తిగతంగా ఉన్న సమస్యలను మా దృష్టికి తెస్తే వాటిని పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవకాశమున్న వారు ఇళ్ల వద్ద, వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంకొల్లు సీఐ వై.వి.రమణయ్య, ఎస్ఐ శీలం రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కొండయ్యను సన్మానిస్తున్న కమిషనర్ అబ్దుల్ రషీద్, ఇతర అధికారులు, సిబ్బంది

క్రీస్తు శాంతి సందేశం అనుసరణీయం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : క్రీస్తు శాంతి సందేశం అనుసరణీయమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. అంబేడ్కర్ భవన్‌లో శనివారం మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు చూపిన ప్రేమ, జాలి, దయ గుణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్యాండిల్ సర్వీస్ నిర్వహించారు. ఎమ్మెల్యే కొండయ్యను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, టీపీపీ శ్రీనివాసరావు, మాల్యాద్రి, పలువురు కౌన్సిలర్లు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేటపాలెం వెలుగు కార్యాలయంలో

వేటపాలెం వెలుగు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్వతి, ఏపీఎం అంజిబాబు, పొదుపు సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు

కారు ఢీకొని మాజీ సర్పంచ్‌కు గాయాలు

బల్లికురవ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి నార్కెట్‌పల్లి రహదారి ఎస్ఎల్ గుడిపాడు సమీపంలో శనివారం బైకుపై రోడ్డు దాటుతున్న గ్రామ మాజీ సర్పంచ్ రావులపల్లి గోవింద్‌ను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. గోవింద్ గ్రామానికి పరమడ వైపున ఉన్న గొర్రెలదొడ్డి వద్దకు వెళ్లి తిరిగి బైకుపై వస్తుండగా హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న కారు బైకును ఢీకొట్టింది. సుమారు 10 అడుగుల ఎత్తు పైకి ఎగిరి గోవింద్ కింద పడిపోయారు. స్థానికులు అతడిని హైవే అంబులెన్స్‌లో నర్సారావుపేట ఆసుపత్రికి తరలించారు.

పలుచోట్ల జగన్ పుట్టినరోజు వేడుకలు

అద్దంకి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను శనివారం అద్దంకిలోని శింగరకొండ రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం హనిమిరెడ్డి నియోజకవర్గంలోని పలువురు నేతలతో కలిసి కేక్ కట్ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పర్చూరు, చినగంజాంలో నాయకులు కార్యక్రమాలు నిర్వహించారు.

కాలువ నిర్మాణ పనులు ప్రారంభం


సైడు కాలువల నిర్మాణానికి పనులు చేయిస్తున్న టీడీపీ నేతలు

బల్లికురవ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో కాలువ పనులు ప్రారంభమయ్యాయి. ఉపాధి హామీ పథకంలో మంజూరైన నిధులతో శనివారం చినఅంబడిపూడి గ్రామంలో సైడు కాలువల నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఎంతో కాలగా సైడు కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.10 లక్షల నిధులతో ప్రధాన వీధిలో రెండువైపులా కాలువ పనులు ప్రారంభయ్యాయి. నిర్మాణ పనులను టీడీపీ నేతలు మొదలు పెట్టారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జాష్టి స్వప్న బ్రహ్మ, బొల్లినేని హనుమంతురావు, కిలారి శ్రీనివసరావు, గంగవరపు రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నిఘంటువులు అందజేత


దాతలు ఇచ్చిన నిఘంటువులతో విద్యార్థినీవిద్యార్థులు

ఇంకొల్లు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగవరం వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాలలో 130 మంది విద్యార్థులకు ఆంగ్ల, తెలుగు నిఘంటువులను గుంటూరు జిల్లా అంకిరెడ్డిపాలెంకు చెందిన శ్యామల సుబ్బారెడ్డి, నాగరత్నమ్మ జ్ఞాపకార్థం కుమారుడు రఘురామిరెడ్డి, విజయమ్మ అందజేసారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని నార్నె సమత, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కరి కమలేశ్వరరావు, సంజీవరెడ్డి, వీరగంగాధరరెడ్డి,అంకిరెడ్డి,వీరాస్వామి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం గడువు పెంపు

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. పంటల బీమాకు చెల్లించే ప్రీమియం గడువును ఈ నెలాఖరు వరకు పెంచుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రైతులు, రైతు సంఘాల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం రాసిన లేఖపై కేంద్రం స్పందించింది. రుణం తీసుకున్న రైతులకు వారి తరఫున బ్యాంకులే ప్రీమియం చెల్లిస్తాయి. మిగిలిన రైతులు ప్రీమియాన్ని ఈ నెలాఖరులోపు చెల్లించాల్సి ఉంది. మొదటి పంటల బీమా కోసం ప్రీమియం చెల్లించేందుకు వరికి మాత్రమే ఈ నెల 31 వరకు ఉండగా, మిగిలిన పంటలకు 15 వరకు గడువు విధించారు. ఈ గడువును నెలాఖరు వరకు పొడిగించడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

వీఎస్‌యూకి రూ.20 కోట్ల మంజూరు

వెంకటాచలం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయానికి రూ.20 కోట్లు మంజూరైనట్లు ఆ వర్సిటీ ఉపకులపతి విజయభాస్కర్ రావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఉన్నత విద్య విభాగం నుంచి పీఎం ఉషా పథకం కింద ఈ నిధులు మంజూరైనట్లు చెప్పారు. కొత్త భవన నిర్మాణాలు, భవనాల పునరుద్ధరణ, పరిశోధన పరికరాలు, ఇతర అభివృద్ధి పనులకు ఈ నిధులు వినియోగించనున్నట్లు చెప్పారు. అంతేగాక ఆన్‌లైన్ కోర్సుల అభివృద్ధి, ఇంటర్న్‌షిప్‌లు, పారిశ్రామిక సహకారం, వృత్తిపరమైన కోర్సులు తదితర వాటిల్లోనూ పురోగతి సాధిస్తామన్నారు. వర్సిటీ చరిత్రలో తొలిసారిగా ఇంత భారీ మొత్తంలో నిధులు రావడం సంతోషంగా ఉందన్నారు.

వీఏఏల ఆకస్మిక బదిలీలు

ఉదయగిరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖలో గ్రామ వ్యవసాయ సహాయకులను (వీఏఏ) ఆకస్మికంగా డిప్యూటేషన్‌పై బదిలీ చేయడంతో వారు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 48 మంది వీఏఏలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వీరిలో 28 మంది మహిళా వీఏఏలు ఉండటం గమనార్హం. ఉదయగిరి సబ్ డివిజన్‌లోని సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, ఉదయగిరి, మర్రిపాడు మండలాల్లో 61 మంది వీఏఏలు ఉండగా 24 మందిని బదిలీ చేశారు. ఇతర మండలాల్లో వీఏఏల కొరత కారణంగా ఉన్నతాధికారులు ఈ చర్యలు తీసుకొన్నట్లు సమాచారం. అయితే విద్యాసంవత్సరం మధ్యలో ఇలా బదిలీ చేయడం దారుణమని పలువురు వీఏఏలు వాపోతున్నారు.

ఎన్‌డీసీసీబీ, ఎన్‌డీసీఎంఎస్‌లకు ప్రత్యేకాధికారి పాలన

పొడిగింపు

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (ఎన్‌డీసీసీబీ), నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (ఎన్‌డీసీఎంఎస్)లకు ప్రత్యేకాధికారి పాలనా కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ఎన్నికలు జరిగితే వాటి అధ్యక్షులే ఎన్‌డీసీసీబీకు, ఎన్‌డీసీఎంఎస్‌లో సభ్యులుగా ఉంటారు. వారిలో ఒకరిని ఎన్‌డీసీబీ, ఎన్‌డీసీఎంఎస్‌కు ఛైర్మన్‌గా ఎన్నుకుంటారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం డైరెక్టర్లను ఎన్నుకుంటారు. అయితే, సహకార సంఘాలకు ఎన్నికలు జరగక పోవటంతో ఎన్‌డీసీసీబీ, ఎన్‌డీఎంఎస్‌లకు ప్రత్యేకాధికారి పదవీ కాలాన్ని పొడిగించారు. ప్రస్తుతం ప్రత్యేక అధికారిగా ఉన్న జాయింట్ కలెక్టర్ కార్తీక్ మరో ఆరునెలలపాటు కొనసాగున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరుగుతాయని నాయకులు ఆశించారు. కానీ పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించకపోవటంతో వారి ఆశలు అడియాశలయ్యాయి.

అరుదైన దృశ్యం..

ఆవిష్కృతం



- శనివారం నాటి పగలు 11.30 గంటలు, రాత్రి 12.30 గంటలు
- సైన్స్ కేంద్రంలో ఖగోళ దర్పణం ద్వారా వీక్షణ
- క్యూరేటర్ సుబ్రహ్మణ్యం ప్రయోగ పూర్వక వివరణ

- వివరాలు 6లో..

నీరు అందేనా..

వరి పండేనా!?



సీతారామపురం గ్రామ సమీపంలో ఎండిన దుక్కులు

రాళ్లపాడు రిజర్వాయరు ఆయకట్టు రైతుల పరిస్థితి త్రిశంకుస్వర్గంలో పడింది. రిజర్వాయరు స్టాప్‌లాక్ గేటు విరిగిపోయి రెండువారాలు గడిచినా సమస్య పరిష్కారానికి ప్రణాళికాబద్ధ కృషి జరగడం లేదని, మొక్కుబడి చర్యలతో కాలం వెళ్లబుచ్చుతున్నారన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కుడికాలువకు ప్రస్తుతం 140 క్యూసెక్కుల నీరు వెళుతోందని అధికారులు చెబుతున్నా వాస్తవానికి 70 క్యూసెక్కులు కూడా రావటం లేదని దుక్కులు, నాట్ల సమయంలో 200 క్యూసెక్కులను తగ్గకుండా వస్తేనే నాట్లు వేయగలం కానీ ఇలా నీరిస్తే ఏమాత్రం ఫలితం ఉండదని రైతులు వాపోతున్నారు.

6

యాంటీబయోటిక్స్ మోతాదుకు

మించితే అనర్థమే!



- వ్యాధుల నివారణకు ముందస్తు టీకాలే బెటర్
- 'గోకులం' షెడ్ల నిర్మాణానికి రాయితీలు
- జునోటిక్ వ్యాధులపై అవగాహన అవసరం
- 'ఆంధ్రజ్యోతి'తో పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏడీ చైతన్యకిషోర్

6

కేంద్ర పథకాలతో

జిల్లా సమగ్రాభివృద్ధి

- పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులదే!

త్వరలో గుజరాత్‌లో పర్యటిస్తాం

'దిశ' సమీక్షలో ఛైర్మన్, ఎంపీ వేమిరెడ్డి

ఎమ్మెల్యేలు, ఎంపీపీల గైర్హాజరుపై అసంతృప్తి

నెల్లూరురూరల్, డిసెంబరు 21, (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో పేదలు, నిరుపేదలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల ద్వారా ప్రత్యక్ష, పరోక్ష లబ్ధిని అందిపుచ్చుకుని జిల్లాను సమగ్ర అభివృద్ధి వైపు తీసుకెళ్లాలని నెల్లూరు ఎంపీ, జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) ఛైర్మన్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన దిశ సమావేశంలో కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ఎంపీ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 67 పథకాల ద్వారా ప్రజలకు ఆర్థిక ప్రయోజనాన్ని అందిస్తోందని, వీటిని ప్రజలకు చేరవేసే బాధ్యత ప్రజాప్రతినిధులు తీసుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో కేంద్ర పథకాలు, వాటి ప్రయోజనాలు ఉన్నా వాటిని సక్రమంగా ఉపయోగించుకోవడం లేదన్నారు. గుజరాత్‌లో కేంద్ర పథకాల ద్వారా గణనీయమైన అభివృద్ధి సాధించారని, ఒకసారి ఆ రాష్ట్రానికి వెళ్లి పర్యటించమని ప్రధాని మోదీ తనకు సలహా ఇచ్చారన్నారు. వీలైనంత తొందరలో అధికారులు, ప్రజాప్రతినిధుల బృందంతో గుజరాత్‌లో అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. ఏ పథకం కింద కేంద్ర ప్రభుత్వ నిధులను అదనంగా రాబట్టుకోవచ్చో తన దృష్టికి తీసుకురావాలని అధికారులను కోరారు. తన శక్తిమేరకే జిల్లాను అభివృద్ధి చేయాలనే ఆలోచనతోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని, ఎంపీ అనే రెండు అక్షరాల కోసం రాలేదన్నారు. కేంద్ర పథకాలు, నిధుల పట్ల అవగాహన లేక అందరం రాష్ట్ర ప్రభుత్వం మీదే ఆధారపడుతున్నామని, ఇకనైనా కేంద్రం నుంచి ఏ రూపంగా నిధులు జిల్లాకు తీసుకురావచ్చో ఆలోచించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి పక్కన కలెక్టర్ ఆనంద్, జడ్పీ ఛైర్‌పర్సన్ అరుణమ్మ



పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గైర్హాజరుపై అసంతృప్తి

కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమీక్షించుకునేందుకు తొలిసారిగా మొదలు పెట్టిన ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు, ఎంపీపీలు గైర్హాజరుకావడం కొంతబాధ కలిగించిందని వేమిరెడ్డి అన్నారు. ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ కల్యాణ చక్రవర్తి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మలైన హాజరైనందుకు సంతోషంగా ఉందని తెలిపారు. 37 మంది ఎంపీపీలకు 8 మంది హాజరవడం తృప్తినివ్వడం లేదన్నారు. ఈసారి జరిగే సమావేశానికైనా ప్రజాప్రతినిధులంతా రావాలని కోరారు. ప్రజలకు ప్రయోజనాలు చేకూర్చే ఇలాంటి సమావేశాలకు కూడా రాకపోతే ఎలా అంటూ సున్నితంగా ప్రశ్నించారు.

అక్కడ చెప్పేది ఇక్కడ జరగడం లేదు

డిల్లీలో ఎంపీలకు కేంద్రం చెప్పేది క్షేత్ర స్థాయిలో జరగడం లేదని ఎంపీ వీపీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో తాము అడిగిన ప్రశ్నలకు గొప్పగా సమాధానాలు వస్తున్నాయని తీరా ఇక్కడ చూస్తే ఏమీ లేదన్నారు. ఇలాగైతే ఎలా అంటూ

- మిగతా 6లో

ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం



చేజర్ల : సోమశిల ప్రాజెక్టు ఛైర్మన్‌గా ప్రత్యేక అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న వేలూరు కేశవచౌదరి

నెల్లూరురూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సాగు నీటి సంఘాలకు జరుగుతున్న ఎన్నికల క్రతువు ముగిసింది. క్షేత్రస్థాయిలో ఇటీవల నిర్వహించిన సాగునీటి వినియోగదారుల సంఘాలన్నీ కూటమి ఖాతాలోనే జమ అయ్యాయి. అనంతరం జరిగిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు సైతం టీడీపీ చేజిక్కించుకుంది. ఆఖరి ఘట్టంగా శనివారం జరిగిన ఎన్నికల్లో మేజర్, మీడియం ప్రాజెక్టులకు టీడీపీ అభ్యర్థులే ఛైర్మన్లుగా ఎన్నికయ్యారు. ఈ తంతు జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో సాగునీటి మేజర్ ప్రాజెక్టులుగా ఉన్న పెన్నా డెల్టా కమిటీకి ఛైర్మన్‌గా జెట్టి రాజగోపాల్ రెడ్డి, వైస్ ఛైర్మన్‌గా బీద గిరిధర్, సోమశిల ప్రాజెక్టు ఛైర్మన్‌గా వేలూరు కేశవ చౌదరి, వైఎస్ ఛైర్మన్‌గా పులుగుంట మధుమోహన్‌రెడ్డి ఎన్నికయ్యారు. మీడియం ప్రాజెక్టులుగా ఉన్న కనుపూరు కాలువ కమిటీకి ఛైర్మన్, వైఎస్ ఛైర్మన్‌లుగా వద్దినేని చిన్న మస్తానయ్య, టీ రామయ్యలు, గండిపాళెం ప్రాజెక్టు కమిటీకి ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, కే రమణారెడ్డి, రాళ్ళపాడు పీసీ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్లుగా ఏలూరు వెంకటేశ్వర్లు, నరాల మాలకొండారెడ్డి, వీరరాఘవునికోట (వీఆర్‌కోట) ఆనకట్టు సిస్టమ్ పీసీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా తాళ్లపనేని వెంకటరవీంద్రబాబు, టీ మాల్యాద్రి ఎన్నికైనట్లు జలవనరుల శాఖ ఉన్నతాధికారులు అధికారికంగా ప్రకటించారు.

ఏపీఐఐసీ జడ్‌ఎంగా అనీల్‌కుమార్

నెల్లూరు (వెంకటేశ్వరపురం) డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) జోనల్ మేనేజర్(జడ్‌ఎం)గా జీ.అనీల్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఏపీఐఐసీ ఇంజనీరింగ్ విభాగంలో డీజడ్‌ఎంగా ఉన్న వీరశేఖర్ రెడ్డి జెడ్‌ఎంగా బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నది. ఈ నేపథ్యంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఈడీగా విధులు నిర్వహిస్తున్న అనీల్‌కుమార్‌ను నెల్లూరు జడ్‌ఎంగా ప్రభుత్వ నియమించింది.

డీఎంహెచ్‌వోగా సుజాత

- రంపచోడవరానికి పెంచలయ్య బదిలీ
- పలు ఆరోపణల నేపథ్యంలో డి ప్రమోషన్
- వైద్య ఆరోగ్య శాఖలో విస్తృత చర్చ



నెల్లూరు (వైద్యం), (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా (డీఎంహెచ్‌వో) డాక్టర్ సుజాత నియమితులయ్యారు. ఇక్కడున్న పెంచలయ్యను అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం అదనపు డీఎంహెచ్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం రూరల్ హెల్త్ అధికారిగా ఉంటున్న డాక్టర్ సుజాత డీఎంహెచ్‌వోగా త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా, ప్రస్తుత డీఎంహెచ్‌వో పెంచలయ్యకు డీ ప్రమోషన్‌పై ఆ శాఖలో విస్తృత చర్చ నడుస్తోంది. ఈయనపై అనేక ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 2022, మే నెలలో ప్రమోషన్‌పై డీఎంహెచ్‌వోగా తిరుపతి నుంచి వచ్చిన పెంచలయ్య జిల్లాలో రెండేళ్ల ఏడు నెలలు పనిచేశారు. మరో ఏడాది మాత్రమే సర్వీసు ఉంది. అయితే వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న అనుమానంతో ప్రభుత్వం ఆయనపై కఠినంగా వ్యవరించినట్లు సమాచారం.

ఇంటర్ కళాశాలల్లోనూ

మధ్యాహ్న భోజనం

- పునరుద్ధరణకు చర్యలు చేపట్టిన అధికారులు

నెల్లూరు(విద్య)/ఆత్మకూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ఆకలి చదువులకు కూటమి ప్రభుత్వం మంగళం పాడనుంది. కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలు జారీ చేశారు. 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వమే ఇంటర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం అమలుచేసింది. అయితే, అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ పథకాన్ని తొలగించింది. ప్రస్తుతం జిల్లాలో 23 ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్ జూనియర్ కాలేజీలు ఉండగా, 6074 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రాంగణంలో ఉన్న కాలేజీలకు ఆ పాఠశాలల్లోని వంటవారి

- మిగతా 6లో

- మరుగుదొడ్లు, ఫ్యాన్లు ఉండవు!
- అనుభవ ఫ్యాకల్టీ కూడా అంతంతే
- కోచింగ్ సెంటర్ల పేరుతో నిలువు దోపిడీ
- భారీగా ఫీజులు వసూలు చేస్తున్న నిర్వాహకులు
- అన్నీ తెలిసి కునుకు వహిస్తున్న యంత్రాంగం

కూటమి ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ చేస్తామని ప్రకటించడంతోపాటు నోటిఫికేషన్లు జారీ చేస్తుండటంతో ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల నిర్వాహకుల పంట పండుతోంది. ఉద్యోగాల మాటేమోగానీ శిక్షణకు వస్తున్న అభ్యర్థుల నుంచి మాత్రం భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారు. అనుమతులు, కనీస వసతులు లేకుండా దుకాణాలు, ఇళ్లు బాడుగలకు తీసుకుని వాటిల్లో శిక్షణ ఇస్తున్నారు. వీరిపై అధికారుల పర్యవేక్షణ కూడా లేకపోవడంతో ఇష్టానుసారంగా కోచింగ్‌ల పేరుతో జిల్లాలో దోపిడీ జరుగుతోంది.

ఇదేం శిక్షణ!

నెల్లూరు (విద్య), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గత కొన్నేళ్లుగా నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పలు విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో వేలాది మంది నిరుద్యోగ యువత ఇప్పుడు ఈ అవకాశాన్ని చేజార్చుకుంటే తమకు ఉద్యోగం రాదని భావిస్తూ ఎలాగైనా ఉద్యోగం సాధించాలన్న కసితో ఉన్నారు. అందులో భాగంగానే పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు కోచింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన యువత తమ సమీపంలోని పట్టణం, నగర ప్రాంతాలకు చేరి కోచింగ్ సెంటర్లలో చేరడంతోపాటు సమీప హాస్టళ్లలో ఉంటున్నారు. కోచింగ్ సెంటర్లు, హాస్టల్స్ గతంలో రూ.15వేల నుంచి రూ.20వేలు వసూలు చేయగా ప్రస్తుతం రూ.20వలే నుంచి 30వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. తమ భవిష్యత్‌కు సంబంధించిన అంశం కావడంతో ఏమీ మాట్లాడలేని పరిస్థితి తమదని, ఎలాగైనా సరే ఉద్యోగం వస్తుందన్న ఆశతో వారు అడిగినంత ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని అభ్యర్థులు చెబుతున్నారు.



నెల్లూరు : సోమశేఖరపురంలో ఓ దుకాణంలో బీఈడీ కోచింగ్‌కు హాజరైన అభ్యర్థులు

ఫ్యాకల్టీ అర్హతలు ఏమిటి!?

జిల్లా కేంద్రంలోనే కాకుడా పలు పట్టణాల్లోకోచింగ్ సెంటర్లు వెలిశాయి. ఇవన్నీ ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నాయా!? అసలు అనుమతులు ఉన్నాయా లేదా, తమ వద్ద ఎలాంటి వసతులున్నాయన్న అంశాలను కూడా తెలియకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నేరుగా అభ్యర్థులకే తమ కోచింగ్ సెంటర్ గురించి తెలిసేలా చేస్తున్నారు. తమ వద్ద అనుభవజ్ఞులైన సీనియర్ ఫ్యాకల్టీ ఉందని, నిపుణులతో తయారు చేయించిన స్టడీ మెటీరియల్ ఉండి అధిక మార్కులు సాధించడానికి తోడ్పడతామని చెబుతూ ఆకర్షిస్తున్నారు. అయితే, ఎక్కడా ఫ్యాకల్టీలు, వారి అర్హతల వివరాలు మాత్రం రహస్యంగానే ఉంచుతున్నారు. ఇప్పటికే డీఎస్సీకి, పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి ఆయా శాఖలకు చెందిన ఉద్యోగులే దీర్ఘకాలిక సెలవులు పెట్టి అనధికారికంగా కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి లక్షలాది రూపాయలను దండుకుంటున్నారు. త్వరలో మరికొన్ని నోటిఫికేషన్లు కూడా విడుదల కానుండటంతో ఈ దోపిడీ మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేస్తున్నా, వీటిలో పరిమిత సంఖ్యలోనే అభ్యర్థులను చేర్చుకుంటున్నారు. దీంతో అత్యధిక శాతం మంది ప్రైవేట్ కోచింగ్ సెంటర్లను ఆశ్రయించక తప్పడం లేదు.

నిబంధనల ఉల్లంఘన

అత్యధిక శాతం కోచింగ్ సెంటర్లకు అనుమతులు లేకపోగా కనీస నిబంధనలు కూడా పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఫంక్షన్ హాళ్లు, స్కూళ్లు, కళాశాలలు, ఆడిటోరియాలు, పాతా షాపింగ్ మాల్స్‌ను అద్దెకు తీసుకుని కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. వీటిలో అత్యధికంగా ప్రభుత్వ ఉపాధ్యాయులే కోచింగ్ సెంటర్‌లు నిర్వహిస్తున్నారని, కొన్ని కోచింగ్ సెంటర్లలో వారే ఫ్యాకల్టీలుగా వ్యవహరిస్తున్నారని తెలిసినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రతి కోచింగ్ సెంటర్‌లో భారీగా యువత చేరుతుండటంతో వీరిని నాలుగైదు బ్యాచ్‌లుగా విభజించి శిక్షణ ఇస్తున్నారు. కనీసం మరుగుదొడ్లు, ఫ్యాన్‌లు లేకుండా శిక్షణ ఇస్తున్నారని అభ్యర్థులు వాపోతున్నారు. ఇటీవల కేంద్రప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసి కోచింగ్ సెంటర్లలో జరిగే మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రకటించింది. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం దీనిపై దృష్టి సారించి అనధికార కోచింగ్ సెంటర్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

ఇంటర్ కళాశాలల్లోనూ
మధ్యాహ్న భోజనం

(5వ పేజీ తరువాయి)

ద్వారానే విద్యార్థులకు భోజనం అందిస్తారు. మిగిలిన కాలేజీలకు సమీప పాఠశాలల నుంచి భోజనం సరఫరా చేస్తారు. ఇందుకుగాను వం టవారికి, రవాణా ఖర్చులు ఇవ్వనున్నారు. ఈ పథకం పునరుద్ధరణతో మే లు జరుగుతుందని అధ్యా పకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిర్వహణకు అన్ని చర్యలు

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుకు చర్యలు తీసుకుంటున్నాం. వంట ఏజెన్సీలు నియామకం, వసతులు, ఇతర అం శాలను పరిశీలిస్తున్నాము. జనవరి నుంచి తాత్కాలిక ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించేలా రంగం సిద్ధం చేస్తున్నాము. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయుక్తమైన ఈ కార్యక్రమాన్ని ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహిస్తాం.

- ఆదూరు శ్రీనివాసులు, ఆర్ఐవో

31లోగా ఓపెన్ స్కూల్ పరీక్ష
ఫీజు చెల్లించాలి

నెల్లూరు(విద్య), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్‌స్కూల్) టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు ఈనెల 31వతేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలస్యమైతే జనవరి 1 నుంచి 4 లోపల రూ.25, జనవరి 5 నుంచి 8లోగా రూ.50 అపరాధ రుసుము, జనవరి 9 నుంచి 10వతేదీ లోగా తత్కాల్ రుసుముతో ఫీజు చెల్లించవచ్చన్నారు. టెన్త్ అభ్యాసకులు థియరీ సబ్జెక్ట్‌కు రూ.100లు, ఇంటర్ అభ్యాసకులు థియరీ సబ్జెక్ట్‌కు రూ.150లు, ప్రాక్టికల్స్‌కు రూ.100ల చొప్పున ఫీజు చెల్లించా లన్నారు. అలాగే బెటర్‌మెంట్ రాసుకునే అవకాశం కూడా ఉందని, అభ్యాసకులు సమీపంలోని ఓపెన్ స్కూల్ కేంద్రాల్లోకానీ, నగరంలోని దర్గామిట్ట జిల్లా పరీక్షల విభాగంలో కానీ సంప్రదించాలని ఆయన తెలిపారు.

అరుదైన దృశ్యం..
ఆవిష్కృతం

ఆకాశంలో శనివారం అరుదైన దృశ్యం చోటుచేసుకుంది. సాధారణంగా రోజుకు 24 గంటల్లో ఉంటే అందులో సగం పగలు, సగం రాత్రి ఉంటుంది. అయితే, శనివారం మాత్రం 11.30 గంటల పగలు, 12.30 గంటల రాత్రి ఉండటం విశేషం. మండలంలోని చెముడు గుంట వద్ద ఉన్న జిల్లా సైన్స్ కేంద్రంలో ఖగోళ దర్పణం ద్వారా ఆకాశంలో ఏర్పడిన ఆ అద్భుతాన్ని పలువురు వీక్షించారు. జిల్లా సైన్స్ సెంటర్ క్యూరేటర్ ఎస్ సుబ్రహ్మణ్యం ఖగోళ దర్పణం ద్వారా మకరరేఖ మీద సూర్యుడి గమనమార్గాన్ని ప్రయోగ పూర్వకంగా వివరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి తన 23.5 డిగ్రీల వంపుతో అక్షంపై తిరుగుతున్నందువల్ల శనివారం సూర్యకిరణాలు మకరరేఖ మీద నిలువుగా పడతాయ న్నారు. ఇది ఎంతో అరుదైన రోజుగా పరిగణిస్తారని, జిల్లాలో దాదాపు 12.30 గంటలపాటు రాత్రి, మిగిలిన 11.30 గంటలు పగలు కనిపిస్తుందన్నారు. సాధార ణంగా ఇలా జరగడాన్ని అయనాంతం అని అంటారని, ఈ రోజున సూర్యుడికి, భూమికి మధ్యలో దూరం ఎక్కువగా ఉంటుందన్నారు. దీంతో దక్షిణార్థగోళంలో రోజు పొడవు ఎక్కువగా ఉండి ఉత్తరార్థగోళంలో రాత్రి సుదీర్ఘంగా ఉంటుందన్నారు. ఈ కారణంగా ఉత్తరార్థగోళం సూర్యుడికి ఎక్కువ దూరం వెళుతుందని, ఆ సమయంలో చంద్రకాంతి భూమిపై చాలా సమయం ఉంటుంద న్నారు. ఈ అరుదైన రోజున భూమికి సూర్యుడికి గరిష్ఠ దూరం ఉండటం వల్ల సూర్యకిరణాలు ఆలస్యంగా భూమి పైకి చేరుతాయని, ఈ సహజమార్పు కారణంగా అత్యంత తక్కువ కాలం పగలు.. ఎక్కువకాలం రాత్రి ఉంటుందని తెలిపారు. ఉష్ణోగ్రతలో కూడా స్వల్ప మార్పులు ఉంటాయన్నారు.

- శనివారం నాటి పగలు 11.30 గంటలు, రాత్రి 12.30 గంటలు
- సైన్స్ కేంద్రంలో ఖగోళ దర్పణం ద్వారా వీక్షణ

- వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి)



పశువులు వ్యాధుల బారిన పడితే మన సొంత జ్ఞానం, మందుల దుకాణ నిర్వాహకుల సలహాలతో యాంటీబయాటిక్స్ వినియోగిస్తుంటాం. ఆసుపత్రికి తీసుకెళితే ఎక్కువ ఖర్చులు అవుతాయని అక్కడ ఏవేవో మందులు రాస్తారని పాడిరైతుల ఉద్దేశం. అదేవిధంగా పశువులు, మేకలు, గొర్రెలకు వ్యాధినిరోధక టీకాలు వేస్తుంటే కొంతమంది రైతులు వద్దంటున్నారు. పాల దిగుబడి తగ్గుతుందని, జ్వరం వస్తుందని వారి వాదన. ఇవన్నీ కేవలం అపోహలేనని, డాక్టర్ సలహాలు తీసుకోకుండా విచక్షణారహితంగా యాంటిబయోటిక్స్ వాడకం వల్ల కలిగే నష్టాలు, ముందస్తు టీకాలు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, వర్షాకాలం పశువులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను నెల్లూరు పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల సహాయ సంచాలకుడు డాక్టర్ జానా చైతన్యకిషోర్ 'ఆంధ్రజ్యోతి' ద్వారా రైతులకు తెలియ జేశారు. పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో జిల్లాలో అనేక సంక్షేమ కార్యక్రమాలు జరుగుతు న్నాయని, ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేయడం, గోకులాలు వంటి ఎన్నో కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. పరిశుభ్రత పాటిస్తూ, ముందస్తు టీకాలు వేయించుకోవడం, యాజమాన్య పద్ధతులను పాటిస్తూ పాడిరైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)



యాంటీబయాటిక్స్ మోతాదుకు
మించితే అనర్థమే!

- వ్యాధుల నివారణకు ముందస్తు టీకాలే బెటర్
- 'గోకులం' షెడ్ల నిర్మాణానికి రాయితీలు
- పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏడీ చైతన్యకిషోర్

? యాంటిబయోటిక్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలు

! యాంటిబయోటిక్స్ వల్ల పశువులకు ఎంత మంచి జరుగుతుందో అంతే నష్టం కలుగు తుంది. విచక్షణారహితంగా వినియోగిం చడం వల్ల యాంటి మైక్రోబియల్ నిరోధకత బారిన పడతాయి. ఇది అత్యంత ప్రమా దకరం. అత్యవసర పరిస్థితుల్లో పశువులకు ఎలాంటి మందులు పని చేయవు. కాబట్టి రైతులు వైద్యుల సలహాలు తీసుకోకుండా ఎలాంటి యాంటీబయోటిక్స్ వాడకూడదు. దీనిపై ఇటీవల జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాము. వైద్యులు సూచిం చిన కోర్సు తప్పనిసరిగా పూర్తి చేయాలి. ఎలాంటి పరిస్థితుల్లోనూ మధ్యలో ఆపకూడదని సూచించాము.

? వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులు

! వర్షాకాలం వచ్చిందంటే పశువులు అధికంగా పచ్చికదొమ్మ అనే వ్యా ధిన పడతాయి. వర్షం వల్ల మట్టిలోని బ్యాక్టీరి యా గడ్డిపైకి వచ్చి చేరు తుంది. దీన్ని తిన్న పశు వులు, మేకలు, గొర్రెలు ఆ వ్యాధి బారిన పడతాయి. గురక, తీవ్ర జ్వరం, చొంగ, చీమిడి కారడం దీని ముఖ్యలక్షణం. పశువులు ఒత్తిడికి గురైనప్పుడు కూడా ఈ వ్యాధిన బారిన పడతాయి. అంటే సరైన షెడ్డు, పాకలు లేకపోవడంతో ఎండ, వర్షాల కారణంగా పశువులు, తీవ్ర ఒత్తిడికి గురవుతాయి. ఆ సమయంలో పశువుల్లో ఉండే బ్యాక్టీరియా రెట్టింపు అవుతుంది. 24 గంటల్లో మృత్యువాత కూడా పడొచ్చు.



డాక్టర్ చైతన్యకిషోర్

? వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి

! పశువులను వ్యాధుల బారి నుంచి కాపాడుకోవాలంటే ముఖ్యంగా పరిశుభ్రత పాటించాలి. పాకలు, షెడ్లు శుభ్రంగా ఉంచాలి. ముందస్తు టీకాలు వేయించాలి. పశువులను ఎండ, వానల నుంచి కాపాడుకునేందుకు ప్రభుత్వం గోకులం పేరుతో షెడ్లను మంజూరు చేస్తోంది. 90 శాతం సబ్సిడీ కూడా అందిస్తోంది. 2 పశువులకు రూ.1.15 లక్షలు, 4 పశువులకు రూ.1.85 లక్షలు, 6 పశువులకు రూ.2.3 లక్షలతో షెడ్లను మంజూరు చేస్తోంది. అవసరమైన వారు పశువైద్యుడిని సంప్రదించాలి.

? టీకాలపై పాడిరైతులకు కొన్ని అపోహలున్నాయి

! కొంత మంది రైతులకు ఇంకా ఎన్నో అపోహలున్నాయి. పశువులు వ్యాధుల బారిన పడకుండా ఉచితంగా టీకాలు వేస్తున్నాం. అయితే టీకాలు వేయించు కుంటే పాల దిగుబడులు తగ్గుతాయని అంతేగాక జ్వరం వస్తుందని కొంతమంది అనుకుంటున్నారు. ఇది కేవలం అపోహ మాత్రమే. టీకాలతో ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

? జునోటిక్ వ్యాధుల గురించి

! పెంపుడు జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులే జునోటిక్ వ్యాధులు. ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, ప్లేగు, క్షయ, మైక్రోప్లాస్మా న్యూమోనియా, రేబిస్, ఎబోలా, బర్డ్‌ఫ్లూ, నిపా వంటి వైరస్, బ్యాక్టీరియా జునోటిక్ వ్యాధులు ఇలా చాలా ఉన్నాయి. వీటిపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం. ప్రస్తుతం బ్రూసెల్లోసిక్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జరుగు తోంది. 4 నుంచి 8నెలల వయసున్న ఆడ దూడలకు ఉచితంగా వేస్తున్నాము. ఇది ఒక్కసారి వేయడం వల్ల జీవిత కాలంలో ఎప్పు డూ బ్రూసెల్లోసిస్ వ్యాధి బారిన పడవు. పాలు, పాల పదార్థాల కారణంగా ఈ వ్యాధి మనుషులకు వ్యాప్తి చెందుతోంది. అదేవిధంగా ఈ వ్యాధి కలిగిన పశువులు ఈనే సమయంలో వచ్చే ఉమ్మనీరు గాయాలైన చేతులు, కాళ్లకు తగిలినా వ్యాధిబారిన పడతారు.

కేంద్ర పథకాలతో
జిల్లా సమగ్రాభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

అధికారులను ప్రశ్నించారు. నూటికి నూరు శాతం వ్యాక్సినేషన్, మందులు పశువులకు అందచేస్తే పాలఉత్పత్తి, జంతు ఉత్పత్తి ఎందుకు పెరగడం లేదని పశుసంవర్థక శాఖ జేడీని ప్రశ్నించారు. అందుకు ఆయన వద్ద సమాధానం లేదు. ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి ఉండాలన్న కేంద్రం నిర్ణయం అది ఎందుకు జరగడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ప్రశ్నించారు. మధ్యాహ్న భోజన పథకంలో ఎన్జీవోల భాగస్వామ్యాన్ని ఎందుకు తీసుకోవడం లేదని ఎస్ఎస్ఏ అధికారులను అడిగారు. అనంతరం శాఖల వారీగా కేంద్ర పథకాలపై సమీక్షించారు.

● తీర్మానాలకే మమ్మల్ని వాడుకుంటారా? : ఎంపీపీలు

మండల పరిషత్ అధ్యక్షులుగా ఉన్న మాకు ప్రభుత్వ పథకాలపై కనీసం సమాచారం కూడా ఇవ్వరా? అల్లూరు మండలంలో ఇదే జరుగుతోందని ఎంపీపీ శశిరేఖ తెలిపారు. తీర్మానాలు అవసరమైన ప్పుడు మాత్రమే తమ వద్దకు వస్తున్నా రంటూ అసహనం వ్యక్తం చేశారు. పథకాలు నిర్వహణ, వాటి లబ్ధి, ప్రజలకు ఉపయోగం వంటి విషయాలేవీ తమతో చర్చించడం లేదన్నారు. అనంతరం చేజర్ల ఎంపీపీ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లకు లెవలింగ్ పనులు చేశామని, ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా బిల్లులు రాలేదన్నారు. ఎప్పుడొస్తాయి? ఎవరిస్తారో? చెప్పాలని కోరారు. డ్వామా పీడీతోపాటు కలెక్టర్ కూడా తమకు తెలియదని చెప్పడంతో సమావేశంలో విస్మయం నెలకొంది. అవెన్యూ ప్లాంటేషన్ జరగడం లేదని, ఇది ఎవరి పరిధిలోకి వస్తుందని ఏఎస్‌పేట ఎంపీపీ ప్రస్తావించగా డ్వామా పీడీ తనకు తెలియదని, కనుక్కొని చెప్తానని చెప్పడం ఆశ్చర్యానికి గురి చేసింది.

కాగితాలలో లెక్కలొద్దు

గురుకుల పాఠశాలలో అంతా బాగుందని కాగితాల్లో లెక్కలొద్దు. వాస్తవంగా ఏం జరుగుతోందో అందరూ తెలుసుకోవాలి. తరగతి గదులు లేక గురుకులాల్లోని పిల్లలు అవస్థలుపడుతున్నారు. ఒకేగదిలో వసతి, అదే గదిలో తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలు జిల్లాలో ఉన్నాయి. వాటిని నేనే స్వయంగా చూశాను. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలి.

- బల్లి కల్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్సీ

'దిశ' సమాచారం ఇవ్వరా?

ఎంపీ అధ్యక్షతన తొలిసారిగా దిశ సమీక్ష సమావేశం నిర్వహించేటప్పుడు ఎమ్మెల్యేలకు స్వయంగా ఫోన్ చేసి సమాచారం ఇవ్వరా!? మా పీఏలకు మాత్రమే చెబుతారా!? అటువంటప్పుడు సమీక్షలు, సమావేశాలకు మా పీఏలనే పంపిస్తాం సరిపోతుంది. అధికారుల పద్ధతి బాగోలేదు. జిల్లాలో అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలలకు అత్యవసరంగా మట్టితో లెవలింగ్ చేయాల్సి ఉంది. ఎస్ఎస్ఏ ప్రాజెక్టు నుంచి ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాలి.

- కావ్య కృష్ణారెడ్డి, కావలి ఎమ్మెల్యే

టీబీ రోగులకు మెరుగైన వైద్యం అవసరం

టీబీ బాధితులకు ఇక్కడ అందిస్తున్న వైద్యం మెరుగ్గా కనిపించడం లేదు. అభివృద్ధి చెందిన దేశాలలో ఇలాంటి రోగులకు ఐసోలేషన్ ఏర్పాటు చేసి వ్యాధి అదుపులోకి వచ్చేవరకు మెరుగైన వైద్యం అందిస్తారు. వారిని ప్రజల్లో తిరగనివ్వరు. కానీ ఇక్కడ టీబీ వ్యాధిగ్రస్థులు యథేచ్ఛగా బయట తిరిగేస్తున్నారు. ఇది ఆందోళనకరమైన అంశం.

- కాకర్ల సురేష్, ఉదయగిరి ఎమ్మెల్యే

పారదర్శకంగా మందులు, టీకాల వినియోగం

నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి): పశువులకు అందిస్తున్న మందులు, టీకాల వినియోగంలో పార దర్శకత ఉండాలని, తప్పనిసరిగా రికార్డుల్లో నమోదు చేయాలని పశుసంవర్థకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కే రమేష్‌నాయక్ ఒక ప్రకట నలో పేర్కొన్నారు. పశువులకు వచ్చే వ్యాధులను నియంత్రించడానికి తమశాఖ సమవర్థ వంతమైన చర్యలు చేపడుతున్న దని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలోని నాలుగో త్రైమాసికంలో చేపట్టాల్సిన వైద్య సేవలు, టీకాల కార్యక్రమాలు, ఇతర పశు వైద్యసేవ లపై క్షేత్రస్థాయి సిబ్బందికి ఉత్తర్వులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో కొక్కెర తెగులు, కోళ్ల మశూచి, డక్ ప్లేగు వ్యాధినివారణకు కోళ్లు, బాతులకు ఉచితంగా టీకా లు వేయనున్నట్లు పేర్కొన్నారు. జనవరిలో గొర్రెలు, మేకలు, గేదెలు, ఆవులు, దూడలకు నట్టల నివారణ మందుల పంపిణీ చేయ నున్నట్లు తెలిపారు. ఫిబ్ర వరిలో 4నుంచి 8నెలల వయసు కలిగిన గేదె, పెయ్య దూడలకు బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలు, మార్చిలో గేదెలు, ఆవులు, పంది లకు గాలికుంటు వ్యాధి నివా రణ టీకాల వేయనున్నట్లు పేర్కొ న్నారు. ఈ అవకా శాన్ని పాడిరైతులు సద్వినియో గం చేసుకోవాలని ఆయన తెలిపారు.

జనవరి, ఫిబ్రవరి నెలల్లో వ్యాధి నివారణ టీకాలు
పశుసంవర్థకశాఖ జేడీ రమేష్‌నాయక్



వివరాలు సేకరిస్తున్న బ్యాంక్ డీపీఎం శ్రీనివాసులు, ఏసీ సింహాద్రిరావు

లోపభూయిష్టంగా సమాఖ్య సంఘం నిర్వహణ

ప్రతి పనికి లంచం.. సభ్యుల ఆరోపణలు నిజమే ● స్పష్టం చేసిన విచారణ అధికారి శ్రీనివాసులు

ఉలవపాడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న ఆంధ్రజ్యోతిలో ప్రచురించబడిన 'లంచం ఇస్తేనే రుణం మంజూరు' శీర్షికపై శనివారం బ్యాంక్ లంకేజీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివా సులు, కందుకూరు వెలుగు ఏసీ సింహాద్రి రావుతో కలిసి విచారణ చేపట్టారు. వినా యక సమాఖ్య వీవోఏ కల్యాణిపై సమాఖ్య సంఘంలోని 14 పొదుపు సంఘాల సభ్యులతో ఆయన ఉలవపాడు వడ్డెర పాలెం కమ్యూనిటీహాల్‌లో విచారణ చేప ట్టారు. ధనలక్ష్మి గ్రూపుకు సీఐఎఫ్ చెక్కు మంజూరై మూడు వారాలు కావస్తున్నా సభ్యులకు ఇవ్వకుండా లంచం కోసం కాలయా పన చేస్తుందని, అలాగే అనీషా గ్రూపు సభ్యులు వీవోఏ చేష్టలను వివరించారు. పొదుపు గ్రూపు సంఘాల వారీగా ఆరోరపణలు రాసుకున్నారు. డీఆర్‌డీఏ పీడీ ఆదేశాలతో విచారణకు వచ్చామన్నారు. వినాయక సమాఖ్య సంఘంలో అనేక రకాల లోపభూయిష్ట అంశాలు కనుగొ న్నట్లు చెప్పారు. ప్రతిదానికి డబ్బులు వసూళ్లు చేసినట్లు, గడిచిన 5ఏళ్లలో సమాఖ్య సంఘం సమావేశాలు, వీవో సమా వేశాలు జరిగిన దాఖలాలు లేవ న్నారు. వీవోఏకు సంబంధించిన పుస్తక నిర్వహిణ కూడా చేపట్ట లేదని విచారణలో తేలినట్లు ఆయన స్పష్టం చేశారు. విచారణ నివేదికను పీడీకి నివేదించి వారి అనుమ తితో వీవోఏపై చర్యలు తీసుకుంటామన్నారు.

మరో 3 మోటార్లతో
నీటి సరఫరా పెంచుతాం

● ప్రకాశం జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువలో మరి కొన్ని మోటార్లు ఏర్పాటు చేస్తామని ప్రకా శం జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ పీ వరలక్ష్మి తెలి పారు. రాళ్లపాడు ప్రాజెక్టును, కుడి కాలువ తూము వద్ద జరుగుతున్న పనులను శనివారం ఆమె పరిశీలించారు. తెలంగాణలోని కరీంనగర్ నుంచి మెగా కంపెనీ ద్వారా మూడు మోటార్లను తెప్పించనున్నట్లు చెప్పారు. మూడు రోజుల్లో కుడి కాలువకు ఎక్కువ పరిమా ణంలో నీటి సరఫరా చేయిస్తామని తెలిపారు.

● నీటిని తోడేయద్దు : సబ్‌కలెక్టర్

కుడి కాలువలో ప్రవ హిస్తున్న నీటిని అక్రమ పద్ధతుల్లో మోటార్ల ద్వారా తోడేయకుం డా రెవెన్యూ, పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ ఆదేశించారు. శని వారం రాత్రి కుడి కాలువ తూమును సందర్శిం చి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీపూజ మాట్లా డుతూ కుడి కాలువ లోని నీళ్లు దిగువకు వెళ్లకుండా మోటా ర్లు తోడేస్తుంటే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రైతుకు నీరు అందేలా మిగిలిన రైతులు సహకరించాలని కోరారు. కార్యక్ర మంలో ఎస్ఈ వరలక్ష్మి, డీఈ వెంకటేశ్వర్లు, తహసీల్దారు సీతామహాలక్ష్మి, ఎస్సై మహబూబ్ సుభాణి పాల్గొన్నారు.

నీరు అందేనా..
వరి పండేనా!?

'రాళ్లపాడు' ఆయకట్టుదారుల్లో ఆందోళన

- కొలిక్కిరాని స్టాప్‌లాక్ గేటు ప్రక్రియ
- విరిగి రెండువారాలైనా పరిష్కారం కాని సమస్య
- దిగువకు రాని నీటితో అన్నదాతల కలవరం

కందుకూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 7న రాళ్లపాడు రిజర్వాయరు కుడికాలు వకు నీరు విడుదల చేస్తుండగా, స్టాప్‌లాక్ గేటు విరిగి పడిపోయిన విష యం తెలిసిందే. ఆ వెంటనే అధికారులు రిజర్వాయర్ల గేట్లు మరమ్మతులు, నిర్వహణలో విశేష అను భవం ఉన్న నరసరావు పేటకు చెందిన మెకా నిక్ బాషాను రప్పించి పడిపోయిన గేటును లేపేందుకు మూడురోజులు ప్రయత్నించి విఫలమయ్యారు. ఆ వెంటనే నీళ్ల లోపలికి వెళ్లి గేటు మరమ్మతులు చేయటంలో అనుభవం కలిగిన ఓ బృందాన్ని వైజాగ్ నుంచి రప్పించారు. వారు రెండురోజులు ప్రయత్నించి మూడు అంగుళాల మేర గేటును పైకి లేపి తమ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఆ తర్వాత నాలుగు రోజులకు పోలవరం గేట్లు ఏర్పాటులో క్రియాశీలంగా పనిచేస్తున్న దిగ్గజ సంస్థ బెకాం నుంచి నిపుణులు కుడికాలువ గేటు సమస్య పరిష్కారం కోసం రంగంలోకి దిగారు. బెకాం ప్రతినిధి పరుశు రామిరెడ్డి నేతృత్వంలో గత సోమవారం వచ్చిన ప్రతినిధులు రెండు రోజుల పాటు శ్రమించి, జీరో రిజల్ట్‌తో వెళ్లిపోయారు. వారు వెళ్లిపోయాక మేఘా సంస్థ ప్రతినిధులు రంగంలోకి దిగారు. వారు కూడా అదెంతపని అన్నట్లు మాట్లాడారే తప్ప చివరికి రెండు మోటార్లు పెట్టి నీటిని కాలువలోకి లిఫ్ట్ చేయటంతో తమ పని అయిపోయిందనిపించుకున్నారు. ఈ మొత్తం ప్రక్రియలో ఏ ఒక్కరూ స్థిరంగా తమ ప్రయత్నాన్ని కొనసాగించక పోవటం, ప్రణాళికాబద్ధ కృషి జరగటం లేదన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. ఇటీవల తుంగభద్ర ప్రాజెక్టు వద్ద, ప్రకాశం బ్యారేజీ వద్ద ఇంతకంటే సమస్యాత్మక పనులు పూర్తి చేయగలి గిన నిపుణులు ఈ చిన్న గేటు సమస్యను పరిష్కరించక పోవటం ఏమిటన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.



ముదిరిపోతున్న వరినార్లు

మొక్కుబడి చర్యలతో...

కాగా మోటార్ల ద్వారా నీటిని లిఫ్ట్ చేయడం, స్టాప్‌లాగ్ గేటువద్ద బఫర్‌వాల్ పగలగొట్టడం ద్వారా నీరివ్వటం వంటి తాత్కాలిక మొక్కు బడి చర్యలతో ఫలితం లభించేనా అన్న సందేహాలు రైతుల్లో వ్యక్తమవుతు న్నాయి. పడిపోయిన గేటును మూడు అంగుళాల మేర లేపటం ద్వారా 30 క్యూసెక్కులు, వాల్ పగలగొట్టడం, మోటార్ల ద్వారా పంప్‌చేయ టం వంటి చర్యలతో మరో 40 క్యూసెక్కుల నీరు కుడికాలువకు వెళ్తోంది. అయితే పగలగొట్టిన బఫర్‌వాల్ నుంచే అగ్రభాగం నీరు బయటకు వెళ్తుం డగా రిజర్వాయరు లో నీటిమట్టం తగ్గేకొద్దీ ఈ ప్రవాహం తగ్గటమే గాక నీటిమట్టం 16 అడుగు లకు చేరాక పూర్తిగా నిలిచిపో తుంది. అలాగే దిగు వన ఉన్న 3 అంగు ళాల ఖాళీకి వ్యర్థాలు అడ్డుపడితే ఆ ప్రవా హం కూడా నిలిచిపోయే అవ కాశాలు ఉన్నాయి. ఈ స్థితిలో ఇలాంటి మొక్కుబడి చర్యలతో ఫలితం ఉండ దని ఉన్నతస్థాయిలో స్పందించి పడిపోయిన గేటును బయటకు తీయగలిగి తేనే ఆయ కట్టులో వరి సాగవుతుంది తప్ప లేనిపక్షంలో రైతులు రెండువిధాలా మునుగు తారన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం దుక్కు లకే నీరందక ఎగువగ్రామాల ప్రజలు దిగువ కు నీటిని పంపించక సమస్యలు ఉత్పన్న మవుతున్నాయి. వారం రోజుల నుంచి ఎగువన ఉన్న ఇసుకపాలెం, శాయిపేట, మేదరమిట్లపాలెం గ్రామాల వారు అడ్డుకట్టలు వేస్తూ దిగువక నీరు పోనివ్వటం లేదు. కాలువపై నీటిని పర్యవేక్షించేందుకు లష్కర్లు కూడా లేకపోవటంతో రైతుల ఇష్టారాజ్య మైంది. దీంతో రైతుల మధ్య ముష్టిముద్ధాలు కూడా జరుగుతున్నాయి. దిగువ గ్రామాల ప్రజలు దుక్కులు ఎండిపోతున్నాయన్న ఆందోళనతో కాలువ వెంట వస్తే ఎగువ గ్రామాల రైతులు కర్రలు పట్టుకుని తిరుగుతుండటంతో చేసేదిలేక వెనుదిరిగి పోతున్న పరిస్థితులు నెలకొన్నాయి. గురు వారం రాత్రి మేదరమిట్లపాలెంలో ఆ గ్రామ రైతులే తమ పొలాలకు నీళ్లుకట్టుకునే విషయంలో గొడవపడి చివరికి ఘర్షణకు దిగినట్లు తెలిసింది. ఇదే పరిస్థితి మరో వారం జరిగితే గ్రామాల మధ్య కూడా ఘర్షణలు తలెత్తే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ముదురుతున్న నార్లు

మరోవైపు రాళ్లపాడు ఆయకట్టులో పోసిన వరినార్లు ముదిరిపోతుండగా గేటు సమస్య రాకముందు దుక్కులు దున్నిన భూములు ఎండిపోయి నెర్రెలు వారుతున్నాయి. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే అధికారులు ఎలాగోలా తంటాలుపడి నాట్లు అయితే వేయించగలరు కానీ పంట చివరివరకు నీరివ్వగలరా అన్న సందేహాలతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చివరి ఆయకట్టు రైతులు వరికి ప్రత్యామ్నాయంగా పత్తి సాగుచేస్తారని అధికారులు భావిస్తుండగా పత్తికి కూడా నీరు అవసరమే కనుక వరినాట్లు వేసిన వారు ఇబ్బందిపడక తప్పదు. ఒక ఎకరంలో వరినాటు వేయాలంటే రూ. 40వేలు వరకు ఖర్చవుతుందని తీరా నాట్లువేశాక నీరందకపోతే తమ పరిస్థితి ఏమిటన్న ఆవేదన రైతుల్లో తీవ్రంగా ఉంది. ఈ పరిస్థితుల్లో జిల్లా కలెక్టరు, ఇతర ఉన్నతాధికారులు స్పందించి నిపుణులను రప్పించటం ద్వారా పడిపోయిన గేటు బయటకు తీయించేందుకు నిర్మాణాత్మక కృషి జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



రాళ్లపాడు కుడికాలువకు నీటి కోసం అమర్చిన మోటార్లు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఉదయగిరి: డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న వెంకటసుబ్బయ్య



అల్లూరు: ధ్రువీకరణ అందుకుంటున్న బీద గిరిధర్

ఉదయగిరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని పొన్నెబోయిన చెంచురామయ్య (గండిపాళెం) జలాశయ చైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య అన్నారు. శనివారం జలాశయ ఆవరణలో ఆత్మకూరు ఆర్డీవో పావని, జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లుల ఆధ్వర్యంలో ప్రాజెక్టు కమిటీ ఎన్నిక జరిగింది. జలాశయం పరిధిలోని 17 డిస్ట్రిబ్యూటరీల అధ్యక్షులు చైర్మన్‌గా అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, వైస్ చైర్మన్‌గా కుమ్మిత రమణారెడ్డిలను ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వారికి ఆర్డీవో, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబుయాదవ్‌లు నియామ కపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్లు బయ్యన్న, మధు, అడుసుమల్లి వెంకటేశ్వర్లు, రెడ్డిబత్తిన వెంకటేశ్వర్లు, ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమాసాయిరాం, బొజ్జా నరసింహులు పాల్గొన్నారు.

● **పెన్నా డెల్టా ప్రాజెక్ట్ వైస్ చైర్మన్‌గా బీద గిరిధర్**

అల్లూరు: నెల్లూరులో నిర్వహించిన పెన్నా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికల్లో మండల సీనియర్ టీడీపీ నేత పైడేరు ఎస్కేప్-2 అధ్యక్షుడు బీద గిరిధర్‌ను ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడారు. అవకాశాన్ని కల్పించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రలకు కృతజ్ఞతలు తెలిపారు.

● **'రాళ్లపాడు' ప్రెసిడెంట్‌గా ఏలూరి వెంకటేశ్వర్లు**

కందుకూరు: రాళ్లపాడు రిజర్వాయరు ఆయకట్టుదారుల సంఘం ప్రెసిడెంట్‌గా లింగసముద్రం మండలం చినపవని ఏలూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా గుడ్లూరు మండలం బసిరెడ్డిపాలెం నరాల మాలకొండారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలో ప్రాజెక్టు పరిధిలోని ఆరు నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు హాజరైయ్యారు. ఎన్నికైన వారికి సబ్‌కలెక్టరు తిరుమణి శ్రీపూజ నియామక ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈఈ మధుబాబు, ఇతర టీసీ మెంబర్లు పాల్గొన్నారు. అలాగే వీఆర్‌కోట ఆనకట్ట సిస్టమ్ కింద ఉన్న మాచవరం, మోపాడు చెరువుల ఆయకట్టు కమిటీ ప్రెసిడెంట్‌గా కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆనందపురం తల్లపనేని రవీంద్ర చైర్మన్‌గా, ఉపాధ్యక్షుడిగా మోపాడు తోకల మాల్యాద్రిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కావలి ఆర్డీఓ వంశీకృష్ణ వీరికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ హజరత్తయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లపనేని రవీంద్రలు మాట్లాడారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రోత్సాహంతో రైతులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు.

● **సోమశిల ప్రాజెక్టు చైర్మన్‌గా కేశవచౌదరి**

చేజర్ల: సోమశిల ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా నాగులవెల్లటూరు టీడీపీ సీనియర్ నేత వేలూరు కేశవచౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయంలో ఎన్నికల అధికారి కె.వెంటకరెడ్డి సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో వేలూరు కేశవచౌదరిని చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి, కిమ్స్ హాస్పిటల్ ఈడీ తాళ్లూరు గిరినాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చైర్మన్‌ను పలువురు అభినందించారు. నాగులవెల్లటూరులో కార్యకర్తలు సంబరాలు నిర్వహించుకున్నారు.

● **ఉపాధ్యక్షుడిగా మధు మోహన్‌రెడ్డి**

జలదంకి: మండల టీడీపీ అధ్యక్షుడు మధు మోహన్‌రెడ్డి సోమశిల ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికలో వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నెల్లూరు ఇరిగేషన్ కార్యాలయంలో జరిగిన ఎన్నికలో ఆయనకు ఈ పదవి వరించింది. తనపై నమ్మకం ఉంచి పదవి వచ్చేందుకు కృషి చేసిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

దుత్తలూరు (ఉదయగిరి), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, అధికధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి ఎస్.వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి అమ్మకం, నిల్వ రికార్డులతో పాటు గోదాంల్లోని ఎరువుల నిల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో భోగ్యం సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

డీలర్ల సమావేశం

దుత్తలూరు (ఉదయగిరి), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం మండల చౌక దుకాణాల డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో తహసీల్దారు వైనాగరాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. డీలర్లు సకాలంలో డీడీలు చెల్లించాలన్నారు. పండుగల దృష్ట్యా ప్రతి కార్డుదారుడికి నిత్యావసర వస్తువులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపకరణాలకు అర్హుల ఎంపిక

ఆత్మకూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంస్థ సంయుక్త ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక క్యాంప్ నిర్వహించి ఉపకరణాలు మంజూరుకు అర్హులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో బజాక్‌ప్రవీణ్, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, సంస్థ ప్రతినిధులు రఘు, దామోదర్ ఉన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

ఆత్మకూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి క్యాంపు కార్యాలయంలో వైసీపీ నియోజకవర్గ నాయకులు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి బర్త్ డే కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

సీవీ రామానుజన్ సేవలు మరువలేనివి

● ఘనంగా జాతీయ గణిత దినోత్సవం
● నివాళులర్పించిన ఉపాధ్యాయులు



బిట్రగుంట: నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, ఏవోలు



ఉదయగిరి: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఉలవపాడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, గణితశాస్త్రం అధ్యాపకులు మల్లికార్జున ఆధ్వర్యంలో శనివారం గణితశాస్త్ర కోవిదులు శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గారపాటి గోపీచంద్ ప్రకాష్, జ్యోతి, సుబ్బాచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వల్లూరయ్య, మాధవరెడ్డి, సుభాషిణి, హనుమంత రావు పాల్గొన్నారు.

● బిట్రగుంట: కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గణిత విభాగ అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ పీవీఎన్ రెడ్డి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏవో ఆర్వీ రమణారెడ్డి, హెచ్అండ్ఎస్ హెచ్‌వోడి డాక్టర్ లక్ష్మీ, అధ్యాపకులు, బీటెక్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఉన్నారు.

● ఏఎస్ పేట: స్థానిక ఠాగూర్ పాఠశాలలో గణిత ఫార్ములతో రంగవల్లులను వేశారు. 1 నుంచి 5వ తరగతి వరకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. శ్రీనివాస రాయానుజన్ జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రమణారెడ్డి, హెచ్ఎం దొరస్వామిరెడ్డి పాల్గొన్నారు.

● దుత్తలూరు (ఉదయగిరి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి, గణిత ఉపాధ్యాయుడు కండ్లగుంట కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే సామాజిక స్పృహ అవసరం: డీఎస్పీ

కావలి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వివిధ అంశాలపై బాల్యం నుంచే సామాజిక స్పృహ, సృజనాత్మక కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కావలి డీఎస్పీ పి. శ్రీధర్ తెలిపారు. పట్టణ ముసునూరు రెడ్‌ఫీల్డ్ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కిడ్స్ ఫెయిర్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్‌ఫీల్డ్ కరస్పాండెంట్ సాయి అభినవ్, అకడమిక్ హెడ్ నిహారిక, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● కావలి టౌన్: విద్యార్థులు చెడువ్యసనాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసలైతే కుటుంబ ఆర్థిక, సామాజిక పతనానికి దారి తీస్తుందని డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. విట్స్ ఇంజనీరింగ్ కళాశాల యాంటి ర్యాగింగ్ సెల్ ఆధ్వర్యంలో యాంటి ర్యాగింగ్ డ్రగ్ అబ్యూజ్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి అధ్యక్షత జరిగిన సీఐ గిరిబాబు ప్రిన్సిపాల్ శేషయ్య, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషారెడ్డి, లిఖిత్ రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా గంగాభవానీ తిరునాళ్ల



పూలంకరణలో అమ్మవారు

వింజమూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గంగమిట్ట ప్రాంతంలో వెలిసిన గంగాభవానీ తిరునాల ఉత్సవాలు శుక్రవారం మొదలైయ్యాయి. యాదవ వీరుల వీర్రాజుల వంశస్థులు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని జల్దిలో నింపి పట్టణంలో భాజాభజంత్రీలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దర్శించుని దివ్య చెట్టు కింద ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆదివారం అమ్మవారికి పొంగళ్లు సమర్పిస్తారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు భారీ అన్నదానం చేయనున్నారు. సాయంత్రం అమ్మవారికి పండ్లతో అలంకరణ చేసి గుడి చుట్టూ ఊరేగింపు చేపట్టనున్నారు. మొదట ఎద్దుల బండిని గుండ్లపల్లి వంశస్థులు ఆచారబండిగా అమ్మవారి గుడి చూటూట ప్రదక్షిణలు చేస్తారు. కార్యక్రమంలో అత్యధి సంఖ్యలో భక్తులు పాల్గొంటారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కాజ్‌వే నిర్మాణానికి రూ.20 లక్షల మంజూరు



రామన్నగారిపల్లె వాగును పరిశీలిస్తున్న పీఆర్ డీఈ ఏడుకొండలు, ఏఈ జయరామిరెడ్డి

కలువాయి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రామన్నగారిపల్లె ఎస్టీ కాలనీ నుంచి చింతలపాళెంకు సుమారు రూ.1.5కిలో మీటరు మెటల్ రోడ్డు నిర్మాణంతో పాటు వాగుపై కాజ్‌వే నిర్మాణంకు ఐటీడీఏ నిధులు రూ.20లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు పంచాయతీరాజ్ డీఈ ఏడుకొండలు తెలిపారు. కాజ్‌వేకు రూ.8లక్షలు, రోడ్డుకు రూ.12లక్షలకు పరిపాలనా అనుమతి వచ్చిందని తెలిపారు. శనివారం ఈ రోడ్డును, కాజ్‌వే నిర్మించాల్సిన వాగును ఆయన పరిశీలించారు.

రూ.79 లక్షలతో సీసీ రోడ్ల మంజూరు

పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా తాజాగా మరో రూ.79 లక్షలతో 15 సిమెంటు రోడ్లు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఏఈ జయరామిరెడ్డి తెలిపారు. ఇప్పటికే ఈ కార్యక్రమం కింద మండలంలో సుమారు రూ.2కోట్లతో 38 రోడ్ల పనులు జరుగుతున్నాయని చెప్పారు. చింతలపాళెంలో 3రోడ్లు రూ.24లక్షలు, మాదన్నగారిపల్లెలో 4రోడ్లు రూ.21లక్షలు, కలువాయి మేజర్ పంచాయతీలో 8రోడ్లు రూ.34లక్షలు మంజూరైనట్లు వివరించారు. ఇవి కూడా త్వరలో పనులు ప్రారంభించి సంక్రాంతి నాటికి సీసీ రోడ్లు పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి

చేజర్ల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆదురుపల్లి ఎరువుల దుకాణాన్ని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, వేరే ఎరువులతో లింక్ పెట్టి అమ్మిన చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా కృత్రిమ కొరత సృష్టించి రైతులను మోసం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఏడీఏ శ్రీదేవి, వ్యవసాయ శాఖ అధికారి వి.శశిధర్ పాల్గొన్నారు.

● ఏఎస్ పేట: హసనపురంలో ఉన్న ఎరువుల దుకాణాన్ని మండల వ్యవసాయ అధికారి ఐరజని తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఎంఆర్‌పీకే విక్రయించాలని, రైతులకు అవసరమైన వాటిని మాత్రమే ఇవ్వాలని తెలిపారు. అవసరం లేకున్న ఇతర ఎరువులను అంటగట్టే ప్రయత్నం చేయరాదని సూచించారు. షాపులో స్టాక్ వివరాలు, ధరల పట్టికను రాసి ఉంచాలని తెలిపారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

సంగం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో జనసేనపార్టీ ఆధ్వర్యంలో నాలుగు నిరుపేద కుటుంబాలకు శనివారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్ఫూర్తిగా తీసుకుని ఆత్మకూరు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు ప్రతినెలా కొందరు పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నారు. అందులో భాగంగా ఎన్ఆర్ఐ చదలవాడ హరీష్ కుమార్, తోకల శ్రీధర్, పులిపాటి అనిల్ కుమార్‌ల సహకారంతో గ్రామానికి చెందిన పలు కుటుంబాలకు నెలరోజులకు సరిపడ బియ్యం, పప్పులు, నూనె, యర్రగడ్డలు, సబ్బులు, సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్, ఎన్ఆర్ఐ హరిష్ కుమార్, భాను కిరణ్ పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాల అందజేత

కందుకూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెన్నైకు చెందిన ఉల్లాస్ ట్రస్ట్ సభ్యులు శనివారం స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలోని 9,10 తరగతుల మెరిట్ విద్యార్థులకు శనివారం ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఇంటెలెక్ట్ డిజైన్స్ అండ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాల్లో భాగంగా 20మంది మెరిట్ విద్యార్థులకు రూ.20వేల ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉల్లాస్ ట్రస్ట్ ప్రతినిధి దింటకుర్తి బాలకృష్ణ, హెచ్ఎంలు నరసింహమూర్తి, పార్వతి, న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు, సంస్థ సీనియర్ కన్సల్టెంట్ డి. శిరీష పాల్గొన్నారు.

అనివేటి మండపం నిర్మాణానికి విరాళాలు

కందుకూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామదేవత అంకమ్మ అమ్మవారి ఆలయ మండప నిర్మాణానికి శనివారం దాతలు విరాళాలు అందజేశారు. కాళిదాసు శ్రీనివాసమూర్తి కుమారుడు ఆదిత్యదత్త చరణ్ రూ.50వేలు, పొటికెలపూడి వెంకటసుబ్బు సుందరరామారావు, మహాలక్ష్మి దంపతుల కుమారుడు నరసింహసాయి కౌశిక్ రూ.40,516లను ఆలయ పునర్నిర్మాణ కమిటీసభ్యులు గాండ్ల శ్రీనివాసులు, ఆవుల మాధవరావులకు అందజేశారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం పట్టివేత

సంగం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సంగంలో శనివారం మత్స్యశాఖ అధికారులు దాడి చేసి కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పటించారు. వివరాల మేరకు.. చిత్తూరు నుంచి ఆది కేశవులు అనే డ్రైవర్ కోళ్ల వ్యర్థాలను డ్రమ్ముల్లో తీసుకొస్తుండగా సంగం-ముంబై రోడ్డుపై అధికారులు పట్టుకున్నారు. పోలీసులు వ్యర్థాలను కొండ వద్ద గుంతలు తీసి పూడ్చి పెట్టి కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు సుప్రజ, ఖలీల్ పాల్గొన్నారు.

అధిక ధరకు యూరియా విక్రయిస్తే కఠిన చర్యలు

కలువాయి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): యూరియా అధిక ధరకు విక్రయించినా, కాంప్లెక్స్ ఎరువులతో లింక్‌పెట్టినా వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి వీ.ప్రతాప్ హెచ్చరించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులు వ్యాపారులను అడిగి బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. రైతులు నిల్వ చేసుకో కుండా అవసరాల మేరకే తీసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాద్రిపాలెం ఫీడర్, మండలంలోని మాచవరంలో లైన్‌వర్క్ ఉన్నందున ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ టీవీ నరసింహం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటాద్రిపాలెం ఫీడర్ పరిధిలోని తానికొండవారి కొష్టాలు, రామానాయుడు నగర్, వెంకటాద్రిపాలెం, కనిగిరి రోడ్డు షా మిల్లులు ఏరియా, లంబాడిడొంక, దూబగుంటలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా ఉండన్నారు. మాచవరం గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గుర్తించి తమకు సహకరించాలని కోరారు.

విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే ఉద్యమిస్తాం

బిట్రగుంట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పేదవాడికి పెనుభారంగా మారిన విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే ఉద్యమిస్తామని సీపీఎం సీనియర్ నాయకులు టీ.మాల్యాద్రి తెలిపారు. బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆయన సీపీఎం నేతలతో కలిసి శనివారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల వెంకయ్య, ఎం.రాధాకృష్ణ, యు.యానాదయ్య, షేక్.బాదుల్లా, కుమారి, శ్రీనివాసులు, మాల్యాద్రి, బ్రహ్మయ్య ఉన్నారు.

ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ

కావలి రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముసునూరు జాతీయ రహదారి టోల్ ప్లాజా వద్ద శనివారం వాహనదారులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సింహపురి ఎక్స్‌ప్రెస్ వే ఎన్‌హెచ్-16 ప్రాజెక్ట్ హెడ్ శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరానికి ముఖ్య అతిథిగా రూరల్ సీఐ రాజేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం ఎల్‌వి కంటి ఆసుపత్రి వైద్యులు 94 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అద్దాలు అవసరమైన వారికి సీఐ చేతులు మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుమల రెడ్డి, టోల్‌ప్లాజా మేనేజర్ గణేష్, రూట్ ఆపరేషన్ హెడ్ నరశింహరావు పాల్గొన్నారు.

లుమీనా డేటా మ్యాట్రిక్స్‌కు విద్యార్థుల ఎంపిక

కందుకూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): లుమీనా డేటా మ్యాట్రిక్స్ కంపెనీకి 10మంది ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల టెక్నికల్ డైరక్టర్ డాక్టరు విజయ్‌శ్రీనివాస్ తెలిపారు. శనివారం కంపెనీ హెచ్‌ఆర్‌లు మెక్సిల్, పెట్రిక్స్‌లు కళాశాల ప్రాంగణంలో చేపట్టిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. ప్రముఖ కార్పొరేట్ కంపెనీకి 10మంది విద్యార్థులు ఎంపిక కావడంపై కరస్పాండెంట్ కంచర్ల రామయ్య హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు



కావలి: మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డికి కేక్ తినిపిస్తున్న నేతలు



ఉదయగిరిలో కేక్ కట్ చేస్తున్న నేతలు

ఉదయగిరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఉదయగిరిలో ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ ఓబులరెడ్డి, గౌస్‌మొహిద్దీన్, అక్కి భాస్కర్‌రెడ్డి, ముర్తుజా, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

● దుత్తలూరు: స్థానిక జేఎస్ఆర్ ఫౌండేషన్ కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ దొంతిరెడ్డి వాసు దేవరెడ్డి, సర్పంచులు కొండారెడ్డి పాల్గొన్నారు.

● సీతారామపురం: స్థానిక బస్టాండ్ సెంటర్లో వైసీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాలగిరి అల్లూరురాజు, మాబయ్య, గుర్రం సుబ్బయ్య, ఓబులేస్ పాల్గొన్నారు.

● జలదంకి: స్థానిక బస్టాండ్ కూడలిలో జలదంకి మాజీసర్పంచ్ తిప్పారెడ్డి ఇందిరమ్మ కేక్ కట్ చేసి సీనియర్ నాయకుడు ఇస్కా మదన్ మోహన్‌రెడ్డికి తినిపించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండారెడ్డి, దేవరపల్లి మధురెడ్డి, దండా అనిల్‌రెడ్డి, కోర్నిపాటి రామిరెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

● బిట్రగుంట: బోగోలు వైసీపీ పార్టీ కార్యాలయంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు పార్టీ మండల కన్వీనర్ వీర రఘు ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి హాజరై య్యారు. కార్యక్రమంలో ఎంపీపీ సుజాత, జడ్పీటీసీ కీర్తన, ఎంపీటీసీలు, సర్పంచులు ఉన్నారు.

● కావలి టౌన్: ముసునూరులోని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి నివాసంలోని కార్యాలయంలో వేడుకలు జరిగాయి. పార్టీ పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

ఆత్మకూరు, డిసెంబరు 21(ఆంధ్రప్రదేశ్): పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను కించపరిచే విధంగా వాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణ మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాజ్యాంగాలను మార్చి వేయాలని, అంబేడ్కర్ సిద్ధాంతాలను రూపుమాపాలని, మనుధర్మాన్ని దేశంలో ప్రచారం చేయాలని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు, నాయకులు జి లక్ష్మీపతి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని, నాగేంద్ర, సాలారుద్దీన్, అవాజ్ కమిటీ రాష్ట్ర నాయకుడు యస్థానీ, ఐద్వా మహిళా నాయకురాలు గుల్జార్‌బేగం పాల్గొన్నారు.

● బిట్రగుంట: కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యసభలో చేసిన ప్రసంగానికి క్షమాపణ చెప్పాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. బోగోలు బజారు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం, ఎంఆర్‌పీఎస్, దళిత సంఘాల నేతలతో కలిసి ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు వెంకయ్య, ఇజ్రాయిల్, నరసయ్య, షేక్.నూరుద్దీన్, బత్తుల రవిచంద్ర ఉన్నారు.

● కందుకూరు:అంబేడ్కర్‌ను అవమాన కరంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని.. ఆయన్ను తక్షణం మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ, ఐఎఫ్‌టీయూ ప్రజాసంఘాల సభ్యులు శనివారం సాయంత్రం కందుకూరులో నిరసన చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్, ఆర్.మోహన్, హరి బాబు, న్యాయవాది లింగాబత్తిన బ్రహ్మయ్య, నాంచార్లు, బాలకోటయ్య నాగేశ్వరరావు, వెంకట రావు, చంద్ర, సునీల్ పాల్గొన్నారు.

25న నెల్లూరులో నవయాన బౌద్ధధర్మ స్వీకారం

కలువాయి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ధర్మ పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 25న నెల్లూరులో నవయాన బౌద్ధధర్మ స్వీకార మహోత్సవం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏడీపీఎస్ వ్యవస్థాపకుడు ఇంగిలాల రామచంద్రయ్య పిలుపు నిచ్చారు. స్థానిక ఏడీపీఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు నవయాన బౌద్ధ ధర్మాన్ని స్వీకరించకుండా ఉన్నటువంటి డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అనుయాయులందరినీ కార్యక్రమానకి ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాల్గొని నవయాన బౌద్ధధర్మాన్ని మీ జీవన ధర్మంగా స్వీకరించాలని కోరారు. ఇప్పటికే స్వీకరించి ఆచరిస్తున్న బౌద్ధ కుటుంబీకులందరూ కుటుంబ సమేతంగా హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో ఏడీపీఎస్ నేత నిజమాల ప్రసాద్ పాల్గొన్నారు.

వైసీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ప్రణీత్

ఆత్మకూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడుగా ఆత్మకూరు పట్టణానికి చెందిన డాక్టర్ ప్రణీత్‌చౌదరి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నాయకులు, అభిమానులు ఆయనను సన్మానించి అభినందించారు. శనివారం ఆయన నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ కమిటీ విభాగాల జిల్లా అధ్యక్షుడుగా ఎంపికైన బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



వైస్ చైర్మన్, డైరెక్టర్లను సన్మానించిన జనసేన నేత నలిశెట్టి శ్రీధర్

ఆత్మకూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన జనసేనకు చెందిన వైస్‌చైర్మన్లు, డైరెక్టర్లు నిబద్ధతతో రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ తెలిపారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం సాగునీటి సంఘం వైస్‌చైర్మన్ కరివేటి తిరుపతి, డైరెక్టర్లు లక్ష్మీశెట్టి సుమలత, దొరస్వామి శెట్టిలను ఆయన సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు జెపి ప్రసాద్, మావిళ్ల ఆనంద్, బత్తల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాళ్లపాడు గేటును బాగు చేయించండి

లింగసముద్రం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము స్టాప్ లాక్ గేటును బాగు చేయించి ఆయకట్టు పరిధిలోని వరినార్లు, నాట్లకు నీరిచ్చి ఆదుకోవాలని చినపవని రైతులు పోకూరి రవీంద్ర, మరికొందరు శనివారం అమరావతిలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి విజ్ఞప్తి చేశారు. వివిధమార్గాలతో అధికారులు కొంతమేరకు నీరు ఇస్తున్నా ఆ నీరు చాలక వరిపైర్లు ఎండిపోతున్నాయని చెప్పారు. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చినట్లు రైతులు చెప్పారు.

సారా తయారీ స్థావరాలపై దాడులు

● 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

బిట్రగుంట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కావలి ఎక్సైజ్ ఎస్ఐ ఎం.దేవిక సిబ్బందితో శనివారం మండలంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా చెంచులక్ష్మీపురం శివారులోని కప్పరాళ్ల తిప్పకు చెందిన వల్లాకి యోహాన్ నాటు సారా అక్రమంగా కాస్తునట్లు గుర్తించారు. సిబ్బందితో దాడి చేసి నాటు సారా తయారీకి నిల్వ ఉంచిన 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయించారు. అతని వద్ద విక్రయానికి ఉంచిన 10 లీటర్ల నాటునారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు.